జిల్లా ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రధాన హామీల అమలుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో జిల్లా అధికారులు కూడా అందుకు అవసరమైన కసరత్తు ప్రారంభించారు. నిర్దిష్ట ప్రణాళికలను రూపొందిస్తున్నారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేలు కూడా ఆ విషయాల సాధన గురించే ప్రధానంగా ఆలోచిస్తున్నారు. కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ ముందుగా వెలిగొండ టన్నెళ్ల నిర్మాణ ప్రాంతానికి వెళ్లకుండా కీలకమైన పునరావాస గ్రామాల్లో ప్రజలను కలవడంతో కదలిక వచ్చింది. అలాగే మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటైతే కావాల్సిన అవసరాలపై అధికారులు పరిశీలన చేపట్టారు. భూములు, భవనాల‌ను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పరిణామాలన్నింటినీ చూసి పశ్చిమప్రాంత ప్రజలు మురిసిపోతున్నారు.


మార్కాపురం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు (ఫైల్)

పశ్చిమాన ప్రకాశమే..!

- నెరవేరనున్న ప్రజల చిరకాల స్వప్నం
- మార్కాపురం జిల్లా ఏర్పాటుతోపాటు వెలిగొండపై కదలిక
- ప్రధాన హామీల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పరిశీలన ప్రారంభించిన యంత్రాంగం
- భూములు, భవనాల గుర్తింపునకు శ్రీకారం
- పునరావాస గ్రామాల్లో మూడ్రోజుల క్రితం పర్యటించిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పశ్చిమ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుంది. ఆదిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పశ్చిమ ప్రాంతం ప్రకాశించేలా కార్యాచరణకు ఉపక్రమించింది. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ త్వరితగతిన పూర్తికి చర్యలు చేపట్టింది. గత ఏడాది ఏప్రిల్ 20న అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు తన పుట్టినరోజు వేడుకలను మార్కాపురంలో చేసుకున్నారు. తాము అధికారంలోకి వస్తే మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గిద్దలూరు నుంచి ఎర్రగొండపాలెం వరకూ జరిగిన ప్రతి సభలో ఈ విషయంతోపాటు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది తానేనని.. ప్రారంభించేది కూడా తానేనని పదేపదే ప్రకటించారు. మరోవైపు యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా కందుకూరు నియోజకవర్గంలో ప్రవేశించిన రోజే ఆ నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. అద్దంకి సభలో అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చుతామని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 3వ తేదీన గిద్దలూరు వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ నిర్మాణం పూర్తి అంశాలపై స్పష్టమైన హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రధాన హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఆయా జిల్లాల వారీ ఆ ముగ్గురు నాయకులు ఇచ్చిన ప్రధాన హామీల అమలుపై దృష్టి సారించింది.



మార్కాపురంలో పరిశీలన ప్రారంభం

ఉమ్మడి జిల్లా విషయానికి వస్తే ఆ ముగ్గురు నేతలు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన వాటిలో మార్కాపురం జిల్లా ఏర్పాటు ఒకటి. తదనుగుణంగా యంత్రాంగంలో కదలిక ఆరంభమైంది.

లక్ష్మీపురంలో సబ్‌కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న గ్రామస్థులు

మార్కాపురం జిల్లా ఏర్పాటైతే మార్కాపురంతోపాటు గిద్దలూరు, ఎర్రగొండపాలెం, దర్శి, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు అందులో చేరతాయి. వీటిలో మూడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం టీడీపీ గెలుపొందడంతోపాటు రెండున్నర దశాబ్దాల తర్వాత ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూడా కైవసం చేసుకోవడంలో ఆప్రాంత ఓటర్లు కీలక పాత్ర పోషించారు. దీంతో స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా జిల్లా ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులను కలిసినపుడు గుర్తుచేస్తున్నారు. ఈనేపథ్యంలో మార్కాపురం జిల్లా ఏర్పాటుపై కసరత్తు ప్రారంభమైంది. సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఈవిషయంపై దృష్టి సారించినట్లు సమాచారం. ప్రభుత్వ భూముల గుర్తింపుతోపాటు, ప్రభుత్వ, అవకాశం ఉన్న ప్రైవేట్ సంస్థల భవనాల గుర్తింపునకు కూడా శ్రీకారం పలికారు. దీంతో ఆ ప్రాంత ప్రజల్లో కూడా ఆశావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంకోవైపు అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలపాలన్న డిమాండ్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్‌కు పదేపదే ఆప్రాంత ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఆయన కూడా ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, అనుమానాలు వద్దని ప్రజలకు చెప్తూనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు కూడా తన నియోజకవర్గం విషయాన్ని ఇప్పటికే మంత్రి లోకేష్‌కు గుర్తు చేశారు. తదనుగుణంగా అధికారులు కూడా ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఎలాంటి నిర్ణయం వస్తుందోనన్న ఆలోచనతో ముందస్తుగానే అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అర్ధవీడు మండలం కాకర్ల డ్యాం నిర్మాణ పనులను మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా గురువారం పరిశీలించారు. ముంపు గ్రామ ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఎంతమందికి పునరావాసం కల్పించాలి, నష్టపరిహారం ఎంతమందికి ఇవ్వాలి తదితర వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు పలు సమస్యలను ఆయన వద్ద ఏకరువు పెట్టారు.

ఆ దిశగానే కలెక్టర్ పర్యటన

జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియా ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగానే పర్యటన చేపట్టారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి టన్నెల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. పునరావాస గ్రామాల ప్రజలకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఖాళీ చేయించడమే ప్రధాన సమస్యగా ఉంది. కలెక్టర్ అన్సారియా కూడా తన తొలి పర్యటనలో భాగంగా టన్నెల్ ప్రాంతాన్ని సందర్శించకుండా పునరావాస గ్రామాలకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ప్రజల మనోభావాలు, అవసరాలను తెలుసుకున్నారు. పునరావాస గ్రామాలు ఖాళీ చేయించడంతోపాటు అవసరమైన కాలువల నిర్మాణానికి ఆమె ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. మొత్తం పరిస్థితిని సమీక్షించి స్పష్టమైన నివేదిక రూపొందించే పనిలో అన్సారియా ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటిని బట్టి చూస్తే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల మార్పులు, చేర్పులు, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి తొలి ప్రాధాన్యంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.


మూడు రోజుల క్రితం ముంపు గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

- గురుకులాల ప్రిన్సిపాళ్లకు మంత్రి డాక్టర్ స్వామి హెచ్చరిక
- ఆ పాఠశాలలపై సమీక్ష
- బోధన, సౌకర్యాల మెరుగుకు ఆదేశం


ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష చేస్తున్న మంత్రి

ఒంగోలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి నిబంధనల ప్రకారం వ్యవహరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఆదేశించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించినా, అర్హులకు అన్యాయం జరిగినా చర్యలు తప్పవని ప్రిన్సిపాళ్లను హెచ్చరించారు. జిల్లాలోని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం తూర్పునాయుడుపాలెంలోని తన స్వగృహంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 11 గురుకుల పాఠశాలలు ఉండగా వాటిలో సీట్ల సంఖ్య, ప్రస్తుతం ఉన్న విద్యార్థులు, వారికి అందుతున్న సౌకర్యాలు, విద్యా బోధన, ఫలితాలు, స్థానికంగా ఆయా పాఠశాలల్లో సమస్యలు, ఇతరత్రా అంశాలను మంత్రి స్వామి అడిగి తెలుసుకున్నారు. 11 గురుకులాల్లో 10 చోట్ల 5 నుంచి ఇంటర్ వరకు విద్యా బోధన జరుగుతుండగా, ఒక చోట 10 వరకు తరగతులు ఉన్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ డి.జయ ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఒక్కో పాఠశాలలో సుమారు 640 సీట్లు ఉన్నట్లు వివరించారు. తాజాగా మంత్రి డాక్టర్ స్వామి బాధ్యతల స్వీకరణ రోజు సింగరాయకొండలో ఈ విద్యా సంవత్సరానికి 80 సీట్లు ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మంజూరు చేయగా శుక్రవారం అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే గత విద్యా సంవత్సరంలో 95నుంచి 97శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అన్నింటిలో కలిపి సుమారు 200 సీట్లు ఖాళీగా ఉన్నట్లు సమీక్ష సందర్భంగా మంత్రి గుర్తించారు. తక్షణం వాటిని భర్తీ చేయాలని, అది కూడా నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. మరింత మెరుగ్గా బోధన చేసి నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. కొన్ని గురుకులాలలో తాగునీరు, ఇతర సౌకర్యాలకు సంబంధించిన సమస్యలను ప్రిన్సిపాల్స్ మంత్రి దృష్టికి తీసుకొని రాగా తక్షణ పరిష్కారానికి హామీ ఇచ్చారు.

నమ్మించి.. నట్టేట ముంచి!

- 20 గ్రామాల రైతులకు రూ.10 కోట్ల మేర టోకరా
- మిర్చి వ్యాపారి వెంకటరెడ్డి ఘరానా మోసం
- వైసీపీ అండదండలతో రైతులపైనే కేసులు
- ఖాళీ ప్రామిసరీ నోట్‌లు తీసుకొని దావాలు
- కడుపు మండి కిడ్నాప్ చేసిన బాధితులు
- గొట్టిపడియ కొండపై వదిలేసి వెళ్లిన వైనం


వెంకటరెడ్డి

మార్కాపురం, జూలై 4 : ఆయన మిర్చి వ్యాపారి. మార్కాపురం మండలంలోని బిరుదులనరవ గ్రామానికి చెందిన ఆయన గుంటూరులో సుమారు 12 సంవత్సరాలపాటు వ్యాపారం చేశాడు. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల కంభం, అర్ధవీడు మండలాలకు చెందిన రైతుల వద్ద మిర్చి కొనుగోలు చేయడం, అమ్మడం వారికి డబ్బులు చెల్లించడం అంతా కొంతకాలం బాగానే నడిచింది. అందరికీ తెలిసిన వాడు కావడం, నమ్మకంగా నడుచుకోవడంతో రైతులు మిర్చి అమ్మిన తర్వాత వచ్చిన డబ్బులను కూడా ఆ వ్యాపారి వద్దే దాచుకొనేవాళ్లు. 2020 వరకూ ఆయనకు, రైతులకు మధ్య లావాదేవీలు సక్రమంగానే సాగాయి. ఆతర్వాత ఆ వ్యాపారికి దురాశ కలిగింది. రైతులు దాచుకున్న, మిర్చి అమ్మిన డబ్బులు తిరిగి ఇవ్వడం నిలిపివేశాడు. అడిగిన రైతులకు రకరకాల సాకులు చెప్పి మభ్యపెట్టాడు. ఏళ్లు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు నిలదీయడం ప్రారంభించారు. అంతేకాక రాజకీయ నాయకులనూ ఆశ్రయించారు. ఎక్కడా న్యాయం జరగకపోగా రైతులపైనే వ్యాపారి కేసులు పెట్టడం మొదలుపెట్టాడు. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆ ఆక్రోశంతో.. తప్పించుకు తిరుగుతున్న వెంకటరెడ్డిని బుధవారం కిడ్నాప్ చేశారు.

సుమారు 20 గ్రామాల రైతులు బాధితులు


వెంకటరెడ్డి బాధితుల్లో సుమారు 20 గ్రామాల పైచిలుకు రైతులు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గొట్టిపడియ రైతులకే సుమారు రూ.2 కోట్ల మేర చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. వారిలో చాలామంది పేదలే. రూ.లక్ష నుంచి పది లక్షల వరకూ పోగొట్టుకున్నవాళ్లూ ఉన్నారు. తిప్పాయిపాలెం, మాల్యవంతునిపాడు, మిట్టమీదిపల్లి, బొడిచెర్ల, బొందలపాడు, కొండేపల్లి, చింతకుంట, తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు, ఓబాయపల్లె, తర్లుపాడు గ్రామాలకు చెందిన రైతులకు ఎక్కువ మొత్తంలో డబ్బులు ఎగ్గొట్టాడు. దాదాపు ఐదు మండలాలకు చెందిన రైతులు వెంకటరెడ్డి చేతిలో మోసపోయారు. రమారమి రూ.10 కోట్ల పైనే రైతులకు టోకరా వేసినట్లు తెలుస్తోంది.

కోర్టుల్లో కేసులు వేసి రెండు విధాలుగా మోసం..

గుంటూరు మిర్చి యార్డులోని వ్యాపారులు చాలామంది సీజన్‌కు ముందు రైతులకు ఎంతోకొంత పెట్టుబడి కింద ఇస్తుంటారు. ఈ క్రమంలో రైతుల నుంచి ప్రామిసరీ నోట్లు తీసుకుంటారు. పండిన మిర్చిని రైతు ఆ వ్యాపారికి అమ్మిన తర్వాత ముందుగా తీసుకున్న అడ్వాన్స్ పోను మిగిలిన పైకం తీసుకుంటారు. వ్యాపారి వద్దవున్న ప్రామిసరీ నోట్‌ను చించేస్తారు. కానీ వ్యాపారి వెంకటరెడ్డి మాత్రం ఈ ప్రక్రియను అడ్డుపెట్టుకుని రైతులను మరోలా మోసం చేశాడు. తొలుత రైతులకు నమ్మకం ఏర్పడేందుకు అడిగిన వారికి అడిగినట్లు అడ్వాన్స్‌లు ఇచ్చాడు. ఆ సమయంలో వారి నుంచి ఖాళీ ప్రామిసరీ నోట్లు తీసుకున్నాడు. తెలిసిన వ్యక్తి కావడం. అడగక ముందే డబ్బులు ఇస్తుండటంతో రైతులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. అలా ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేసిన పదుల సంఖ్యలోని రైతులపై వెంకటరెడ్డి మార్కాపురం, పొదిలి కోర్టుల్లో కేసులు వేశాడు. ఆ నగదు తనకు జమ అయితే ఇబ్బందులు ఎదురవుతాయని సమీప బంధువుల పేర్లు రాసుకుని వారి ద్వారా కేసులు వేయించాడు. తీసుకున్నది కొంత మొత్తమైతే ప్రామిసరీ నోట్లపై పెద్ద మొత్తంలో నగదు ఇచ్చినట్లు రాసి వారిని రెండు విధాలా ముంచాడు.

కిడ్నాప్ కథ సుఖాంతం

వెంకటరెడ్డి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. సుమారు 30 గంటలపాటు నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. వెంకటరెడ్డిని గురువారం రాత్రి 7.00 గంటల సమయంలో గొట్టిపడియ గ్రామ సమీపంలోని కొండపై రైతులు వదిలి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన పోలీసులు వెంకటరెడ్డిని వాహనంలో వైద్య పరీక్షల నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.



పుష్కలంగా రాజకీయ అండదండలు

మిర్చి వ్యాపారి రాగి వెంకటరెడ్డికి వైసీపీ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఆయన బావమరిది ఇటీవల వరకూ మార్కాపురం ముఖ్యప్రజాప్రతినిధిగా పనిచేసిన నేతకు బంధువు. ఆ ప్రజాప్రతినిధికి ప్రధాన అనుచరుడు వెంకటరెడ్డి రైతుల నుంచి కొట్టేసిన డబ్బులను బావమరిది ద్వారా పలు వ్యాపారాల్లో పెట్టాడు. తర్లుపాడు రోడ్డులో ఆయన బావమరిది నిర్మించిన అపార్ట్‌మెంటులో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయాలు గమనించిన మార్కాపురం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన బాధిత రైతులు పలుమార్లు అప్పటి ముఖ్యప్రజాప్రతినిధి వద్ద పంచాయతీ పెట్టారు. తమను వెంకటరెడ్డి నమ్మించి నట్టేట ముంచాడని లబోదిబోమన్నా ఆ ప్రజాప్రతినిధి మనసు కరగలేదు. కేవలం బంధుప్రీతికే ప్రాధాన్యం ఇచ్చి మీరుమీరు మాట్లాడుకోండని ఉచిత సలహా ఇచ్చాడు. ఈ విషయంలో కీలకంగా వ్యవహరించిన అప్పటి ప్రజాప్రతినిధి సోదరుడు మిర్చి వ్యాపారి బావమరిది వద్ద నుంచి పెద్ద మొత్తం జేబులో వేసుకున్నట్లు రైతులు బాహాటంగానే విమర్శించారు. అప్పట్లో రైతులు కొందరు పోలీసులను ఆశ్రయించారు. ప్రజాప్రతినిధి జోక్యంతో పోలీసులు రైతులనే బెదిరించి పంపించేశారు. మిర్చి వ్యాపారి ఫిర్యాదు చేస్తే మిమ్మల్నే కేసుల్లో ఇరికించాల్సి ఉంటుందని పోలీసులు భయపెట్టడంతో రైతులు స్టేషన్ చుట్టుపక్కలకే వెళ్లడం మానుకున్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు నారాయణ, రామానాయుడు

ట్యాంకర్లతో నీళ్లివ్వండి

- మార్కాపురం, పొదిలి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు
- మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి మంత్రి నారాయణ సమీక్ష
- 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

లోపలి పేజీల్లో

విద్యా సంస్థల బంద్ విజయవంతం



ఒంగోలులోని పీవీఆర్ హైస్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

- నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలపై నిరసన
- ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 4 : నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపుమేరకు జిల్లాలో గురువారం విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నేతలు ఉదయం నుంచే పాఠశాలలను మూసివేయించారు. ఒంగోలులో జరిగిన బంద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పేపర్ లీకేజీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు శ్యామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరించి పేదలకు అందకుండా చేస్తున్నదని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ మాట్లాడుతూ ఎన్‌టీఏ సంస్థ పరీక్ష నిర్వహించేందుకు అర్హత కోల్పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ ఏజెన్సీపై చర్యలు తీసుకోకపోగా సమర్థించుకోవడం దుర్మార్గంగా ఉందన్నారు.

ఇసుక విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్

- నిల్వ కేంద్రాల్లో ఈనెల 8 నుంచి ప్రారంభం
- సీనరేజీ రుసుం టన్నుకు రూ.88
- రవాణా చార్జీ అదనం

ఒంగోలు (క్రైం), జూలై 4 : కొత్త ఇసుక విధానం అమల్లోకి వచ్చే వరకూ నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుకను విక్రయించాలని నిర్ణయించింది. ఈనెల 8 నుంచి అమ్మకాలు ప్రారంభించనుంది. సీనరేజీ చార్జి టన్నుకు రూ.88గా నిర్ణయించింది. రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈమేరకు అధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లాలో గతనెల 21, 22 తేదీలలో ఇసుక కేంద్రాలను గనులు, రెవెన్యూ, ఎస్ఈబీ అధికారులు పరిశీలించారు. మొత్తం 43,466.62 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు లెక్క తేల్చారు. జిల్లాలోని మొత్తం ఏడు నిల్వ కేంద్రాల్లో ప్రస్తుతం మూడుచోట్ల మాత్రమే ఇసుక ఉంది. ఒంగోలు మార్కెట్ యార్డులో 1,818 మెట్రిక్ టన్నులు, జరుగుమల్లి మండలం చతుకుపాడు-1లో 16,044, చతుకుపాడు-2లో 24,971.62 మెట్రిక్ టన్నులు నిల్వ ఉంది. ప్రభుత్వం నూతన విధానం ప్రకటించే వరకూ ప్రజలు ఈ కేంద్రాల్లో ఇసుకను కొనుగోలు చేయవచ్చు.

ఒంగోలులో టన్ను ఇసుక రూ.435

ఇసుక అవసరమైన వారు సీనరేజీ రుసుం కింద టన్నుకు రూ.88 చెల్లించాల్సి ఉంటుంది. దీనికి రవాణా చార్జీలు అదనం. ఒంగోలులో ఉన్న ఇసుక నెల్లూరు నుంచి రవాణా చేశారు. సీనరేజీతోపాటు లోడింగ్, రవాణా చార్జీల కింద రూ.347 కలిపి ఒంగోలులో ఉన్న ఇసుక కేంద్రం వద్ద టన్ను ధర రూ.435గా నిర్ణయించారు. జరుగుమల్లి మండలం చతుకుపాడులో స్థానికంగానే ఇసుకను సేకరిస్తున్నారు. అక్కడ సీనరేజీ కింద రూ.88, లోడింగ్, రవాణా చార్జీ కింద రూ.147 మొత్తం కలిపి రూ.235కు విక్రయించనున్నారు. నిల్వ కేంద్రాల నుంచి ఎవరి సొంత రవాణా చార్జీలతో వారు ఇసుకను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక నిల్వ కేంద్రాల వద్ద ఈనెల 8 నుంచి విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా మైనింగ్ అధికారి జగన్నాథరావు తెలిపారు.


ఒంగోలు మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ఇసుక


రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

మాజీ గవర్నర్ రోశయ్యకు ఘన నివాళి

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 4 : తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 91వ జయంతిని గురువారం ఒంగోలులోని శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అద్దంకి బస్టాండ్‌లోని రోశయ్య విగ్రహానికి పూలమాలతో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నివాళులర్పించారు. రాష్ట్ర ఆర్థిశాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనులు రోశయ్య అని, ఆయన సేవలు మరువలేనివని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌బీఎంసీ కమిటీ అధ్యక్షులు తాతా వెంకటచెంచయ్యగుప్తా, కార్యదర్శి కొప్పురావూరి సురేష్‌కుమార్, కోశాధికారి సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులు మిరియాల కృష్ణ, చక్కా రాధాకృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ కూరపాటి ప్రకాష్, పల్లపోతు సురేష్, పబ్బిశెట్టి భాస్కర్, పల్లపోతు దుర్గాప్రసాద్, ఆకుతోట చంద్ర, పల్లపోతు వెంకటేశ్వర్లు, వలివేటి పవన్, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల పాదయాత్ర


పాదయాత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న నాయకులు

నాగులుప్పలపాడు, జూలై 4 : ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించడంతో నాయకులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం కొల్లూరు గ్రామానికి చెందిన తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూదన్‌ప్రసాద్ బృందం ఈ నెల ఒకటి నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర గురువారం ఉప్పుగుండూరుకు చేరుకుంది స్థానిక గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు, ఐటీడీపీ మండల అధ్యక్షులు బెల్లం వెంకటేశ్వర్లు, నాయకులు బృందానికి ఘన స్వాగతం పలికారు.

నీట్ పరీక్ష అక్రమాలపై చర్యలు తీసుకోవాలి


కేంద్రీయ విద్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4: నీట్ పరీక్ష అక్రమార్కులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ డిమాండ్ చేశారు. పరీక్షా పేపర్ల లీకేజిని నిరసిస్తూ గురువారం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీక్ చేసిన బాధ్యులపై చర్యలు తీసుకునే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మరోసారి నీట్ పరీక్ష నిర్వహించి వైద్య విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల, కేంద్రీయ విద్యాలయం, ఇతర ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, కార్తీక్, శ్రీకృష్ణ, సూర్య, లోకేష్, రాము, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: నీట్ పరీక్ష పేపరు లీకేజి బాధ్యులను శిక్షించాలని కోరుతూ గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పుగుండూరులో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ, హైస్కూల్‌లతో పాటు ప్రయివేటు పాఠశాలలు మూయించారు. బంద్‌కు సీఐటీయూ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అత్తంటి కుమార్‌రాజా, అత్తంటి జేమ్స్, పాలపర్తి శ్రీకాంత్, సారికుక్కు విజయ్, నితిన్, అజయ్, జి.బసవపున్నయ్య ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

నీలినాలుక వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


గొర్రెలకు టీకాలు అందిస్తున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, జూలై 4 : గొర్రెలు, మేకలలో వచ్చే నీలి నాలుక వ్యాధి పట్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జేడీఏ బేబీరాణి సూచించారు. గురువారం చదలవాడలో నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలను అందించే కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం గొర్రెలు, మేకల్లో నీలి నాలుక వ్యాధిని గుర్తించామని, పెంపకందారులు తొలి దశలోనే గుర్తించి తక్షణమే ప్రభుత్వ పశు వైద్యశాలకు తరలించి టీకాలు వేయించాలని ఆమె సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన బాలల సంక్షేమ కమిటీ చైర్మన్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4: బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమ కమిటీ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు.

విద్యాప్రవేశాన్ని విజయవంతం చేయాలి

చీమకుర్తి, జూలై4 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన విద్యాప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సమగ్రశిక్ష జిల్లా ఏఎంవో రమేష్ కోరారు. చీమకుర్తిలోని మండల వనరుల కేంద్రంలో గురువారం సీఆర్‌పీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. డ్రాపౌట్లను గుర్తించి బడిలో చేర్పించే కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహించాలని చెప్పారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4: సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉలిచి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, విద్యా సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ సయ్యద్ షహనాజ్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో చుంచు శేషయ్య, మండవ సుబ్బారావు, పిల్లుట్ల సుధాకరరావు, సర్పంచ్ మంచు మురళీ, యర్రంనేని నరసింహారావు, చుంచు సింగయ్య, యర్రంనేని వెంకటశేషయ్య, గ్రామ కార్యదర్శి కె.కాంచన, కొమ్ము శ్రీరాములు, హెచ్ఎం లక్ష్మీతులసీ, కొమ్ములిల్లీ పుష్ప, చుంచు లక్ష్మీనారాయణ, మన్నె హరిబాబు, చప్పిడి రవీంద్ర, చుంచు వాసుబాబు, కావూరి అశోక్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల లీకులతో అవస్థలు

రూ.లక్షలు ఖర్చు చేసినా మెరుగుపడని నీటి సరఫరా ● శాశ్వత పరిష్కార చర్యలు నిల్ ● ఇబ్బందిపడుతున్న నగరవాసులు


హౌసింగ్‌బోర్డులో పైపులైన్ లీకు కావడంతో తవ్వుతున్న ఎక్స్‌కవేటర్



అంజయ్యరోడ్డు, జడ్పీ కార్యాలయం వద్ద ఏర్పడిన లీకేజీలు

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 4: ఒంగోలు నగరంలో మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంటోంది. పైపులైన్ల లీకులతో నీటి సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోంది. గతంలో వేసవిలో మాత్రమే తాగునీటి కోసం తంటాలు పడిన ప్రజానీకం నేడు అన్ని కాలాల్లోనూ అదే సమస్య ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నగరంలో అధిక శాతం ఏరియాల్లో ఎప్పుడో ఏర్పాటు చేసిన పాత పైపులైనులే ఉండటంతో పదేపదే లీకులు ఏర్పడుతున్నాయి. వాటిని నియంత్రించడానికి అధికారులకు తలకు మించిన పని అవుతోంది. నగరంలోని పలు ప్రధాన రహదారుల్లో చెరువులను తలపించేలా తాగునీరు వృధా అవుతుండంతో అటువైపు రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో విచ్చలవిడిగా ఉన్న పైపులైన్ లీకులను పూర్తిస్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు ఖర్చవుతున్నా...

నగరంలో పెరిగిన జనాభాను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కార్పొరేషన్ హోదా కల్పించింది. కాని అందుకు అనుగుణంగా నగరంలో తాగునీటి సరఫరా మెరుగుపడలేదు. ఒంగోలు మునిసిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది ప్రజాప్రతినిధులు, పురపాలక పాలకవర్గ సభ్యులు, ప్రత్యేకాధికారులు కొనసాగారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపలేదు. లీకు సమస్య తలెత్తినపుడు మొక్కుబడి చర్యలు, తాత్కాలిక పనులకే పరిమితమైపోయారు. ప్రతి ఏడాది లీకుల నియంత్రణ కోసం రూ.30-40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నప్పటికీ తాగు నీటి సరఫరాలో అవాంతరాలను అరికట్ట లేకపోతున్నారు.

నిర్లక్ష్యం వీడితేనే..

ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారం వైపు దృష్టి సారించాల్సిన వైసీపీ పాలకవర్గ సభ్యులకు ఇవేమీ పట్టడం లేదు. వారితోపాటు ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో మోటార్లు సమస్య రాగా, నగరంలోని అన్ని కాలనీల్లోనూ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయి. కాగా ఒంగోలు నగరంలో 50 డివిజన్లు ఉండగా, వాటన్నింటికీ నీటి సరఫరాకు మూడు మోటార్లు ఏర్పాటు చేశారు. నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, ప్రజలు గోడు వెళ్ళబోసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తాగునీటి సరఫరా మెరుగు కోసం, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ప్రభుత్వ హాస్టళ్లలో వసతుల కల్పనకు చర్యలు ప్రారంభం

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 4: ప్రభుత్వ వసతిగృహాల్లో సమస్యలు తెలుసుకునేందుకు మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మిక తనిఖీలతో అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం ఒంగోలులోని ప్రభుత్వ బధిరుల పాఠశాల, సాంఘీక సంక్షేమ కళాశాల బాలికల వసతిగృహాలను వారు తనిఖీ చేసిన విషయం విదితమే. ప్రజాప్రతినిధుల తనిఖీలలో గుర్తించిన సమస్యలు, అలాగే విద్యార్థులు వెల్లడించిన సమస్యలపై మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల స్పందించారు. దీనిపై చర్యలకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సాంఘీక సంక్షేమశాఖ, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ఈమేరకు స్థానిక భాగ్యనగర్‌లోని బాలికల సంక్షేమ వసతిగృహం వద్ద పిచ్చిమొక్కలు తొలగింపు, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడం, అదనపు గదుల నిర్మాణానికి అంచనాలు చేశారు. ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి చిల్లచెట్లు తొలగించడంతోపాటు, పారిశుద్ధ్యం, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరిచినట్లు సాంఘీక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్ తెలిపారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ అన్సారియా తనిఖీలతో బాలికల వసతిగృహంలో సమస్యలు పరిష్కారం కావడం సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా వారికి డీడీ లక్ష్మనాయక్, వార్డెన్‌లు కె.స్వప్నలత, బి.శిరీష, హాస్టల్ విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.


చిల్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

అల్లూరి పోరాటపటిమ నేటి తరానికి ఆదర్శం

● కలెక్టర్ అన్సారియా


అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అన్సారియా, అధికారులు

ఒంగోలు నగరం, జూలై 4: అల్లూరి సీతారామ రాజు పోరాట పటిమను నేటితరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి 127వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఒంగోలులోని గిరిజన్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రత్యేక అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్య సాధనతో పాటు గిరిజన హక్కులపై అల్లూరి అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో జిల్లాలోని గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. చదువుకు దూరమైన గిరిజన బిడ్డలు తిరిగి పాఠశాలకు వెళ్ళేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రీ మెట్రిక్ గిరిజన హాస్టల్ ఏర్పాటుతో పాటు జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఈ దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారుల నృత్యప్రదర్శనలు ఆ కట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమఅధికారి జగన్నాథరావు, బీసీ సంక్షేమ అధికారి అంజల, సాంఘిక సంక్షేమశాఖాధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, గిరిజన సంఘాల నాయకులు పేరం సత్యం, ఈగా శ్రీనివాసరావు, భూమాని మంతన్న, రమావత్, రాపూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో..

ఒంగోలు(కలెక్టరేట్): బ్రిటీష్ పాలకులను ఎదిరించి స్వరాజ్యం స్థాపన కోసం అసువులు బాసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను నేటి సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బి.హరిబాబు కోరారు. ఒంగోలులోని విశ్వవిద్యాలయంలో గురువారం అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.రాజమోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హర్షప్రీతమ్ దేవ్ కుమార్, జి.సోమశేఖర్, నిర్మలామణి, కేవీ.కృష్ణారావు, ఆర్.శ్రీనివాస్, పి.వెంకట్రావు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

అందరివాడు మోహన్‌రంగా : ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 4: పేదల సంక్షేమం కోసం, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అందరివాడుగా పనిచేసిన వంగవీటి మోహన్‌రంగా సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. గురువారం కాపు సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులో రంగా 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక రామనగర్ 1వ లైను వద్ద ఏర్పాటు చేసిన రంగా విగ్రహానికి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాపు సంఘ జిల్లా అధ్యక్షులు సంజీవ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రక్తదాన శిబిరం : వంగవీటి మోహన్‌రంగా జయంతిని పురస్కరించుకుని స్థానిక జీజీహెచ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే దామచర్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక బ్లడ్‌బ్యాంకులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జీజీహెచ్‌లో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. సూపర్ స్పెషాలిటీ సేవలు అందించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలోనే జీజీహెచ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు.


రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్


విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న నిర్వాహకులు

నోటుపుస్తకాల పంపిణీ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4: అల్లూరి సీతారామరాజు నాటక మండలి ఆధ్వర్యంలో గురువారం మన్యం వీరుడు అల్లూరి 127వ జయంతిని పురస్కరించుకొని ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని కొప్పోలు బీవీఆర్ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, అట్టలు, జామెట్రీబాక్సులు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలి సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో చదివే 170 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. దేశానికి అల్లూరి సీతారామరాజు చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహకులు కె.నాగేశ్వరరావు, కె.చిరంజీవి, శ్రీనివాసరావు, ఇజువూరి అంజిరెడ్డి, ఎం.నాగరాజు, కొండరాజు రమేష్, సింగమనేని సుబ్బారావు, జి.శ్రీనివాసరావు, ఉప్పురి నాగేశ్వరరావు, పెళ్యూరి శ్రీనివాసరావు, గంగాడి రామకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నం రమణయ్య, ఓగిరాల వెంకటేశ్వర్లు, కోటయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించలేరా..?

మండల కౌన్సెల్ సమావేశంలో కేవీపాలెం ఎంపీటీసీ సభ్యురాలు అశ్వని ధ్వజం ● దాటవేత వైఖరి అవలంబించిన పాలకవర్గం

చీమకుర్తి, జూలై 4: "600 కుటుంబాలున్న గ్రామంలో ఏర్పడిన తాగునీటి సమస్యను ఏళ్లతరబడి పరిష్కరించలేకుండా ఉన్నారు. ప్రతి సమావేశంలో ప్రశ్నిస్తున్నా. ఇంతవరకూ పరిష్కార మార్గం చూపించలేకపోయారు. ఫ్లోరిన్ సమస్యతో గ్రామస్థులు కిడ్నీ, తదితర వ్యాధులబారిన పడి విలవిలలాడిపోతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించండి" అంటూ కూనంనేనివారిపాలెంకు చెందిన ఎంపీటీసీ వేమా అశ్వని పాలకవర్గం, అధికారులపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన చీమకుర్తిలో మండలపరిషత్ కౌన్సెల్ సమావేశం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. అజెండా కూడా లేని ఈ సమావేశంలో తొలుత శాఖలవారి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌పై సమీక్ష సందర్భంగా ఎంపీటీసీ అశ్వని కూనంనేనివారిపాలెంలో నెలకొన్న తాగునీటి సమస్యపై ప్రశ్నించారు. దీనిపై అధికారి నీళ్ల నములుతుండటంతో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు జోక్యం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రామతీర్థం జలాశయానికి సమీపంగా ఉన్నా గ్రామానికి సాగర్‌జలాలు అందటం లేదని అశ్వని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న నాయుడుచెరువును ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్య సహకారంతో పరిశుభ్రం చేసినట్లు చెప్పారు. ఈ చెరువును మంచినీటి చెరువుగా గుర్తించి సాగర్‌జలాలుతో నింపితే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రామతీర్థం నుంచి గ్రామానికి పైపులైన్ వేసినా ప్రయోజనం లేకుండా పోయిందని, కాబట్టి నాయుడు చెరువును సాగర్ జలాలతో నింపి గ్రామస్థుల దాహార్తిని తీర్చాలని డిమాండ్ చేశారు. చివరగా జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రసంగించారు. చీమకుర్తి అభివృద్ధికి జిల్లాపరిషత్ నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులును కోరారు. సమావేశంలో ఎంపీడీవో రాఘవేంద్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పాలకవర్గాన్ని, అధికారులను నిలదీస్తున్న అశ్వని

అవీ..ఇవీ..

15లోపు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(విద్య), జూలై 4: జాతీయ స్థాయిలో 2024 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానం కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలను వెబ్‌సైట్ ద్వారా ఈనెల 15లోపు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న దరఖాస్తు కాపీ, రెండు సెట్ల ప్రతిపాదనలు వర్డ్ డాక్యుమెంట్(సీడీ)ని 30పేజీలు మించకుండా డీఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఉచిత ఇసుక విధానంపై హర్షం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4: పేదలకు ఉచిత ఇసుక విధానంపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీల పరిధిలోనినే క్వారీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మాదిరిగా సీనరేజ్ విధానాన్ని అమలు చేయాలన్నారు. దానివల్ల పంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్‌లకు వాటాలు ఇవ్వాలని కోరారు. ఇసుక తోలకం వాహనాల ద్వారా గ్రామీణ రోడ్లు దెబ్బతింటాయని, వాటి మరమ్మతుల కోసం నిధులు అవసరమన్నారు. అందువల్ల సీనరేజ్‌ను అమలు చేయడం ద్వారా ఆ సమస్య కూడా పరిష్కారం అవుతుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సీపీఐ సీనియర్ నేత మృతి



రాఘవస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు, నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4: సీపీఐ సీనియర్ నేత నల్లూరి రాఘవస్వామి (80) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి శివారులోని నరసాయపాలెంకు చెందిన రాఘవయ్య సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్నారు. గురువారం ఉదయం సీపీఐ సీనియర్ నేత నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కమ్యూనిజం పూర్వ సంపాదకులు ఎంసి వెంకటేశ్వర్లు, సీపీఐ నగర కార్యదర్శి వీవీఆర్.చౌదరి, ఉప్పుటూరి ప్రకాశరావు, అడ్వకేట్ పోతినేని వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, పావులూరి ఆంజయ్య, గోగినేని రామారావు, పెద్దకొత్తపల్లి కార్యదర్శి నలజర్ల శ్రీను ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు.

చింతాయగారిపాలెం బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

నాగులుప్పలపాడు, జూలై 4: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం చింతాయగారిపాలెం బస్సును పునరుద్ధరించాలని అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.సత్యవతి కోరారు. గురువారం స్థానిక స్కూలులో ఆమె మాట్లాడుతూ చీర్వానుప్పలపాడు, అగ్రహారం, చవటపాలెం గ్రామాల నుంచి అమ్మనబ్రోలుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఎంతోమంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. చీర్వనుప్పలపాడు గ్రామంలో పది మంది విద్యార్థులు ఉండగా బస్సు లేక ఆరో తరగతిలో ఒక్కరు కూడా చేరలేదని చెప్పారు. కావున ఆర్టీసీ అధికారులు స్పందించి ఒంగోలు నుంచి చితాయిగారిపాలెం వెళ్ళే ఉదయం పూట ఆర్టీసీ బస్సును పునరుద్ధరించడంతో పాటు సాయంత్రం వేళల్లో తమ గ్రామానికి వెళ్ళేలా మరో సర్వీసును ఏర్పాటు చేయాలని కోరారు.

అక్రమ తొలగింపులను నిలుపుదల చేయాలి


కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4: మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూలు శానిటేషన్ వర్కర్లను అక్రమంగా తొలగించే విధానాలను నిలుపుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకులు కోరారు. గురువారం యూనియన్ ప్రధానకార్యదర్శి పి.కల్పన ఆధ్వర్యంలో ఒంగోలులో కలెక్టర్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు, శానిటేషన్ వర్కర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. అటువంటి కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ విధానాలను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరమ్మ, అక్కమ్మ, చెన్నమ్మ, చెన్నులక్ష్మీ, లక్ష్మీనరసమ్మ, సామ్రాజ్యం, సుబ్బలక్ష్మమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోలేబాబాను కఠినంగా శిక్షించాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగిన ఘటనకు ప్రధాన కారకుడైన బొలేబాబాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్.జయప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తన పాదధూళి మహిమగలదనే ఆశాస్త్రీయ, అభూత కల్పన భావాలను ప్రజలలో వ్యాప్తి చేశారన్నారు. ఈ ఘటనలో 120 మందికి పైగా మృతి చెందడం బాధాకరమన్నారు. మూఢ విశ్వాసాల నిరోధక చట్టాన్ని వెంటనే తీసుకవచ్చి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మంత్రి సత్యకుమార్‌కు సత్కారం


మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 4 : వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను జనసేన, బీజేపీ నాయకులు శాలువతో సత్కరించారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో ఆయా పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు జడా బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో మంత్రి సత్యకుమార్‌ను కలిసి జిల్లాలోని పలు అంశాలను తీసుకెళ్ళారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనేకుల శివాజీ యాదవ్, మెట్లె రామకృష్ణ, దాసరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓరియంటేషన్ శిక్షణ ప్రారంభం

ఒంగోలు(విద్య), జూలై 4: ఒంగోలులోని ట్రిపుల్‌ఐ క్యాంపస్‌లో పీయూసీ ముగించుకొని ఇంజనీరింగ్‌లో ప్రవేశించే విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యపై అవగాహన కోసం ఒక వారం రోజుల పాటు నిర్వహించే ఓరియంటేషన్ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. మొదటి రోజు కళాశాల డైరెక్టర్ భాస్కర్‌పటేల్ ఇంజనీరింగ్ శాఖ ఎంపిక చేసుకునే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంగ్లీషు లెక్చరర్ పి.శివాంజనేయులు, హెచ్‌వోడీ పద్మావతి, ఎస్‌కే.నశ్రీం, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డి.ప్రియాంక, ఏవో చంద్రశేఖర్, డీన్ ఎం.రూపాస్‌కుమార్, ఎస్‌డబ్ల్యూ డీన్ పి.సురేష్‌బాబు, ఎఫ్‌వో మీరావలి, సీఈవో పి.రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు క్లోరినేషన్


నీటిని పరిశీలిస్తున్న బాలకోటయ్య

మద్దిపాడు, జూలై 4: బసవన్నపాలెంలోని మంచినీటి ట్యాంక్‌ను గురువారం వైద్యఆరోగ్యశాఖ హెల్త్ సూపర్‌వైజర్ కె.బాల కోటయ్య ఆధ్వర్యంలో క్లోరినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్లోరినేషన్ ద్వారా బాక్టీరియా నశిస్తుందని తెలిపారు. దోమలు నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మద్దిపాడు,జూలై 4: గుండ్లాపల్లి ఫ్లైఓవర్ దగ్గర మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం.. అద్దంకి వైపు నుంచి వస్తున్న మోటార్‌సైకిల్ గుండ్లాపల్లి వద్దకు రాగానే కారును అధిగమించబోయి అదుపుతప్పి డివైడర్‌కి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఒంగోలు గోపాల్‌నగర్ చెందిన పి.ప్రసాద్‌రావు, ఆర్.రామ్మోహన్‌లు గాయపడ్డారు. క్షతగాయాలను స్థానికులు ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

8.6 మిలియన్ కేజీల పొగాకు విక్రయం

మద్దిపాడు, జూలై 4: వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో 8.4 మిలియన్ కేజీలు గాను 8.6 మిలియన్ కేజీలు విక్రయాలు జరిగినట్లు కార్యనిర్వహణ అధికారి కె.రామకృష్ణ గురువారం తెలిపారు. వెల్లంపల్లి వేలం కేంద్రంలో సరసరి ధర కిలో 261.29, బ్రైట్ యావరేజ్ రూ.301.42 లభించినట్లు పేర్కొన్నారు. ఐదు రోజులపాటు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోలు చేస్తామని ఆయన తెలిపారు.

రేపు ఉచితంగా రేబిస్ వ్యాక్సినేషన్

చీమకుర్తి, జూలై4 : జూనోసిస్‌డే సందర్భంగా ఈనెల 6వ తేదీన ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్‌ను వేస్తున్నట్లు పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లావణ్య కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తిలోని పశువైద్యశాలలో జరిగే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మంత్రి డాక్టర్ స్వామికి వినతిపత్రం సమర్పిస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

భూ అధీకృత రైతుల చట్టాన్ని అమలు చేయాలి

టంగుటూరు, జూలై 4 : గత ప్రభుత్వ కౌలు రైతు చట్టాన్ని రద్దుచేసి 2011 భూఅధీకృత చట్టాన్ని అమలు చేయాలని కౌలు రైతు సంఘ నాయకులు గురువారం రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం, సచివాలయాలు, వలంటీర్ల మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కోరారు. ఈ సందర్భంగా కౌలు రైతులు మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు వ్యవసాయం చేస్తున్న వారిలో 80శాతం కౌలు రైతులు, సన్న, చిన్నకారు రైతులేనని మంత్రికి వివరించారు. ఈ చట్టంలో నిబంధనల ప్రకారం, భూ యజమాని కౌలు ఒప్పంద చట్టంపై సంతకం చేయాలని, ఈ పరిస్థితులు ఆసరా చేసుకున్న భూయజమానులు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు ఇష్టపడడం లేదని, చివరకు కౌలు రైతు పేరున ఈ క్రాప్ బుకింగ్ కూడా చేయనివ్వడం లేదని తెలిపారు. మంత్రిని కలసిన వారిలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకోటయ్య, జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు, నాయకులు ఎస్కే మీరాసా, రాంబాబు, వీ మోజెస్ ఉన్నారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.362

టంగుటూరు, జూలై 4 : టంగుటూరు వేలం కేంద్రంలో గురువారం పొగాకు గరిష్ఠ ధర రూ.362 పలికింది. గురువారం వేలం కేంద్రానికి అనంతవరం, ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం రైతుల బేళ్లను అనుమతించారు. మొత్తం 1,146 బేళ్లు వచ్చాయి. వీటిల్లో 1,108 బేళ్లు కొనుగోలు కాగా మిగిలిన 38 వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర రూ.362 రైతులకు దక్కగా కనిష్ఠ ధర రూ.205 నమోదైంది. సరాసరి ధర రూ.319.99కి చేరింది. కొనుగోళ్లలో 26 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పొగాకు చూర, ముక్క అమ్మకం

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నుంచి బుధవారం వరకు పొగాకు చూర, ముక్క కొనుగోళ్లు జరుగుతాయని వేలం నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బ్యారన్‌కు 2 బేళ్లు (300 కేజీలు) అమ్మకానికి అనుమతించామని సునీల్‌కుమార్ వివరించారు. బేళ్ల తూకం 150 కేజీలకు మించరాదని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

టోల్ గేట్ వద్ద స్తంభాన్ని ఢీకొన్న చేపల లారీ

మార్టూరు, జూలై 4 : జాతీయ రహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలో బొల్లాపల్లి టోల్ గేట్‌లో ఇనుప స్తంభాన్ని చేపల లారీ ఢీకొన్న ఘటన గురువారం రాత్రి 9 గంటలకు జరిగింది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో డ్రైవింగ్ సీటులోనే డ్రైవర్ ఇరుక్కుపోయారు. లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవరు నున్న శివనాగరాజు పోలీసులకు తెలిపారు. అతనికి స్వల్పగాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. గుడివాడ నుంచి నెల్లూరుకు చేపల లోడుతో వెళుతున్న లారీ ఒంగోలు వైపు వెళ్లడానికి టోల్ గేట్‌లో 1 వ నంబరు గేట్ లోపలకు ప్రవేశించింది. ఈ లారీ ముందు ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్తున్న లారీ టోల్ గేట్ నుంచి బయటకు వెళుతున్న సమయంలో వెనుక నుంచి చేపల లారీ బ్రేకులు ఫెయిల్ అయి స్వల్పంగా ఎక్స్‌వేటర్ లారీ వెనుక వైపును ఢీకొట్టింది. దాంతో చేపల లారీని అదుపు చేయలేని డ్రైవరు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, లారీ క్యాబిన్‌లో డ్రైవరు ఇరుక్కు పోయారు. ఇలా కాకుండా లారీ టోల్ గేట్ నుంచి బయటకు వచ్చినట్లయితే అదే సమయంలో ఒంగోలు వైపు, బెంగళూరు వైపు వెళ్లడానికి ట్రావెల్స్ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులను లారీ ఢీకొనే ప్రమాదం ఉండేది. అయితే లారీ పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. దాంతో టోల్ గేట్ వద్ద ఉన్న సిబ్బంది, హైవే మొబైల్ వారు వెంటనే స్పందించి ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని అక్కడ నుంచి తొలగించి డ్రైవింగ్ సీటులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. అతనికి స్వల్పగాయాలు కావడంతో వెంటనే అతనిని టోల్ గేట్‌కు చెందిన అంబులెన్సులో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

మార్టూరు, జూలై 4 : జాతీయ రహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో ఇసుకదర్శి సెంటరు సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొన్న సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. ఒంగోలు నుంచి విజయవాడలోని కాలేజీలో జాయిన్ చేసేందుకు దోమల రజనీకాంత్ అనే వ్యక్తి కుమార్తెతో కారులో వెళుతున్నారు. రోడ్డు ప్రక్కన మతిస్థిమితం లేని వ్యక్తి కారుపైకి రాళ్లు విసరగా ఈ రాయిని తప్పించుకోవడానికి ప్రయత్నించగా కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొడుతూ డివైడర్‌ను దాటి ఒంగోలు వైపు కారు నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ఒక వైపు టైరు దెబ్బతిన్నది. తండ్రీ కుమార్తెలు క్షేమంగా బయటపడ్డారు. అనంతరం వారి బంధువులకు సమాచారం ఇవ్వగా మరో కారు అక్కడకు రాగా వారు దానిలో వెళ్లిపోయారు. హైవే మొబైల్ వారు రోడ్డుపై ఉన్న కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు.



మంత్రి రవికుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

మంత్రులకు ఆర్యవైశ్య నేతల శుభాకాంక్షలు

అద్దంకి, జూలై 4 : మంత్రులు గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్‌ను అద్దంకి పట్టణ ఆర్యవైశ్య నాయకులు గురువారం సచివాలయం వద్ద చాంబర్ల లో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ ఆర్యవైశ్య నాయకుడు టీడీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిన్ని శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శింగరకొండ ఆర్యవైశ్య అన్నదానసత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు భోజనపల్లి సత్యనారాయణ, చుండూరి మురళీసుధాకరరావు, నాగసూరి రమేష్‌బాబు, సంకా సుబ్రహ్మణ్యం, కురిచేటి వెంకటసుబ్బారావు, ఆత్మకూరి మస్తానయ్య, జవ్వాజి ఏడుకొండలు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, నేరెళ్ల శేషగిరి, అర్వపల్లి హనుమంతరావు, మల్లికార్జునరావు, శ్రీరామ్ హరిబాబు, మాజేటి సత్యం, చామర్తి మల్లికార్జునరావు, రవికుమార్ పాల్గొన్నారు.

కొణిజేడులో వాటర్‌షెడ్ పనుల పరిశీలన

వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ అన్సారియా

కొణిజేడు(టంగుటూరు), జూలై 4 : మండలంలోని కొణిజేడులో గురువారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో వాటర్ షెడ్ పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. పనుల మొత్తం విస్తీర్ణం ఎంత, ఇందుకోసం జరిగిన ఖర్చు, ఈ పనుల ద్వారా కలుగుతున్న ప్రయోజనం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ చెరువును ఆమె పరిశీలించారు. నాగార్జున సాగర్ కాలువ ద్వారా ఈచెరువుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని స్థానికులు కలెక్టర్‌ను కోరారు. ఈ విషయమై అర్జీ ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని కలెక్టర్ అన్నారు. ప్లాంటేషన్‌లో భాగంగా చెరువు ఆవరణలో కలెక్టర్ మొక్క నాటారు. ఈ సందర్భంగా వాటర్ షెడ్ పనుల్లో జరిగిన అవినీతిపై టీడీపీ నాయకుడు రామాగోపి కలెక్టర్‌కు వివరించారు. అర్జీ రూపంలో ఇస్తే విచారిస్తానని కలెక్టర్ చెప్పారు. కొణిజేడు పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట డ్వామా పీడీ అర్జునరావు, వాటర్ షెడ్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ వండర్‌మన్, ఇతర అధికారులున్నారు.



వాటర్ షెడ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ట్యాంకర్లతో నీటి సరఫరా చేయండి

మార్కాపురం, పొదిలి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు

మంత్రి నిమ్మలతో కలిసి నారాయణ సమీక్ష

అమరావతి/మార్కాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం, పొదిలి మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. గురువారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. తన నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీలలో తాగునీటి ఎద్దడిని అరికట్టాలని మంత్రి నారాయణను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కోరారు. ప్రతి ఏటా జూలై రెండో వారంలో నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి మార్కాపురం, పొదిలి మున్సిపాలిటీలకు నీటిని విడుదల చేస్తారని... దానికంటే ముందుగానే ఈ సారి సమస్య వచ్చిందని ఎమ్మెల్యే మంత్రికి తెలిపారు. వెంటనే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు.

రెండు మున్సిపాలిటీల్లో బోర్లు ఉన్నప్పటికీ ఆ నీరు తాగడానికి పనికిరాని విధంగా ఉందని, ఇతర అవసరాలకు మాత్రం ఆ నీరు వాడుకోవచ్చని అధికారులు వివరించారు. తాగునీటికి ముందు ప్రాధాన్యత ఇచ్చి అవసరమైనన్ని ట్యాంకర్లను వినియోగించాలని మంత్రి నారాయణ సూచించారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో ఈ రెండు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. అటు నాగార్జునసాగర్ ఇంజనీరింగ్ అధికారులతో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ అంశంపై ఫోన్‌లో మాట్లాడారు. సాగర్లో ప్రస్తుతం నీటిమట్టం డెడ్ స్టోరేజ్‌కు చేరుకుందని అధికారులు మంత్రికి వివరించారు. నాగార్జునసాగర్‌లో వాస్తవ పరిస్థితి, తాగునీటి సరఫరాపై వివరాలు తీసుకురావాలని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. మార్కాపురం, పొదిలి మున్సిపాలిటీలకు అందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో హాజరుకావాలని మంత్రి ఆదేశించారు.

అన్నదాతల ఉన్నతే లక్ష్యం

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ శాఖ సమీక్షలో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూలై 4: అన్నదాతల ఉన్నతే లక్ష్యంగా పాలన సాగిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలైన అగ్రికల్చర్, హార్టికల్చర్, మార్కెటింగ్ శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అన్నదాత అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికార యంత్రాంగం రైతుల పట్ల అప్రమత్తంగా ఉండి వారి అభ్యున్నతికి సహకరించాలన్నారు. విధి నిర్వహణలో అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. వైసీపీ వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, రైతులు అవసరాలు ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తామన్నా రు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆ యా శాఖల్లో ఉన్న ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

వ్యవసాయశాఖ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ రైతులకు చేదోడుగా నిలవాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు నేపథ్యంలో రైతులకు అవసరమైన పిల్లిపెసర, జీలుగ వంటి విత్తనాలను అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో మైక్రో న్యూట్రిషన్ అందించి రైతు సంఘానికి అండగా నిలిచారన్నారు. రైతన్నలకు అవసరమైన యంత్ర పరికరాలు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు.

ఆధునిక సాగువైపు కదిలించాలి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఆధునిక సాగు వైపు రైతులు అడుగులు వేసేలా చైతన్యం చేయాలన్నారు. పండ్లు, హైబ్రిడ్ వెజిటేబుల్ సాగుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసి రైతులను ఆదిశగా మళ్లించాలని సూచించారు. రైతులకు అవసరమైన స్పేయర్లు, రోటీవేటర్లు అందించేందుకు కృషి చేయాలన్నారు. బెస్ట్ రైతు సంఘాలు, ఏపీలో ఐదు బెస్ట్ ప్రదేశాలను గుర్తించి అక్కడకు రైతులను సందర్శనకు తీసుకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

మార్కెట్ యార్డ్ విస్తరణకు చర్యలు

నియోజకవర్గంలో మార్కెట్ యార్డ్‌లలో విస్తరణకు ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. రైతుల సౌలభ్యం కోసం మార్కెట్ యార్డులను విస్తరించాలని ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించటం జరిగిందన్నారు. పర్చూరు మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. పంట ఉత్పత్తులను నిల్వచేసేలా గోడౌన్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలన్నారు. పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాంలో గోడౌన్‌లను నిర్మాణం చేపడతామన్నారు. ఇంకొల్లు, పర్చూరులో పదివేల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ప్రతిపాదన చేయాలని అధికారులను ఆదేశించారు.

కనిగిరి అభివృద్ధికి సహకరించాలి



మంత్రి లోకేష్‌కు ప్రతిపాదనలు అంజేస్తున్న డాక్టర్ ఉగ్ర

» మంత్రులను కోరిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 4: కనిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకారాన్ని అందివ్వాలని కోరుతూ గురువారం రాజధానిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పలువురు మంత్రులను కోరారు. కనిగిరిలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కోసం వైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిశారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.కనిగిరి ప్రాంతానికి చెందిన యువత ఉద్యోగాలు లేక పరాయి ప్రాంతాల్లో వలస జీవనం గడుపు తున్నారని ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. చిన్న, చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారని, ఎక్కువ మంది తగిన ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనపై మంత్రి సానుకూలంగా స్పందించి కనిగిరి అభివృద్ధికి తమ సహకారం తప్పక అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, మంత్రి అచ్చెనాయుడును కూడా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కలిశారు.

పిన్నెల్లికి జగన్ వంతపాడడం సిగ్గుచేటు

టంగుటూరు, జూలై 4 : ఈవీఎంలు ధ్వంసం చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డికి మాజీ ముఖ్యమంత్రి జగన్ వంతపాడడం సిగ్గుచేటని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. ఒంగోలులో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. పిన్నెల్లి చేసిన అరాచకాలకు ఆయన్ని నెల్లూరు కాదు తీహార్ జైల్లో వేయాలని మంత్రి చెప్పారు. ఎన్నికల రోజున దౌర్జన్యంగా పోలింగ్ కేంద్రాల్లోకి చొరబడి ఈవీఎంలను పగులగొట్టి, ప్రజాస్వామ్యాన్నే పాతర వేశాడని మండిపడ్డారు. గత వైసీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అండ చూసుకొని వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు లెక్కలేనన్ని అరాచకాలు, అక్రమాలు దౌర్జన్యాలు చేశారని, అందుకే జనం వారిని చిత్తుచిత్తుగా ఓడించారని గుర్తుచేశారు. పిన్నెల్లి తాను ప్రాతినిధ్యం వహించిన మాచర్లలో మారణహోమం సృష్టించారని, టీడీపీ బీసీ కార్యకర్త తోట చంద్రయ్యను నడిరోడ్డుపై గొంతుకోసి చంపాడని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మాచర్ల వెళ్లిన తమ పార్టీ నాయకులు బోండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్నలపై బహిరంగంగా హత్యాయత్నానికి పాల్పడ్డా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

అలాంటి నియంతృత్వ అరాచకుడిని జగన్ వెనుకేసుకొని రావడం అంటే నేరస్తులను ప్రోత్సహించడమేనని చెప్పారు. జనం చేతిలో జగన్ చిత్తుచిత్తుగా ఓడినా తన బుద్ధి మార్చుకోలేదని, ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే వచ్చే ఎన్నికలకు నాటికి రాష్ట్రంలో వైసీపీ మళ్లీ కావడం ఖాయమని మంత్రి చెప్పారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం

● రెండు నెలల్లో ఒకే రైతుకు చెందిన రెండు గేదెలు మృతి

పీసీపల్లి, జూలై 4: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గేదెలు మృతిచెందుతు న్నాయని తురకపల్లి వాసులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో ఒకే పశు పోషకుడికి చెందిన రెండు గేదెలు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. గ్రామంలో సింగి ల్‌ఫేస్ ట్రాన్స్‌పార్మర్ ఉంది. ఆ ట్రాన్స్‌పార్మర్ సమీపంలో బాపనపల్లి మాలకొండ య్య ఇల్లు ఉంది. ఆ ఇంటి వద్ద తన గేదెలను కట్టేసుకుంటాడు. మే 8న ట్రాన్స్‌పార్మర్ సమీపంలోకి వెళ్లిన అతని గేదె విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ట్రాన్స్‌పార్మర్ వద్ద ఎర్త్ సరిగా లే నందువల్లనే గేదె మృతిచెందినట్లు గుర్తించిన విద్యుత్‌సిబ్బంది ట్రాన్స్‌పార్మర్ వద్ద ఎర్త్‌ను ఏర్పాటుచే శారు. అయితే, గురువారం ఉదయం అదే రైతుకు చెందిన మరో గేదె దూడ ట్రాన్స్‌పార్మర్ సమీపంలోకి వెళ్లగా, విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. రెం డు నెలల వ్యవధిలో జీవనాధారమైన గేదెలు మృతిచెందడంతో బా ధిత కుటుంబసభ్యులు లబోదిబో మంటున్నారు. ఇప్పటికైనా సంబం ధిత అధికారులు స్పందించి బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొత్త చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

కనిగిరి, జూలై 4: జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల పై ప్రజలు అవగాహన కల్గి ఉండాలని జడ్జి కె.భరత్‌చంద్ర అన్నారు. గురువారం స్థానిక కోర్టు అవరణలోని బార్ అసోసియేషన్ హాలులో పోలీసులకు, న్యాయవాదులకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాధితుల హక్కుల పరిరక్షణలో సమర్థవంతంగా విచారణ నిర్వహణకు కొత్త చట్టాలు ఉపయోగపడతాయని తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.



మానవహారంగా నిలిచి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

కొండపి, జూలై 4 : నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై కేంద్రం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. కొండపిలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బంద్‌లో పాల్గొన్నారు. టంగుటూరు రోడ్డులోని మండల కార్యాలయాల సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు లీకవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులపై కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొండపి హైస్కూల్‌లో సిబ్బంది కొరతను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు కేజీ మస్తాన్, ఆర్.లక్ష్మీ, వై. చంద్రశేఖర్, కత్తి శ్యామ్, కత్తి నాగలేఖ, ఎ. అజయ్‌కుమార్, మల్లీశ్వరి, ప్రవల్లిక, భాను, ఎస్కె మహబూబ్ పాల్గొన్నారు.

మంత్రి డోలా, ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిసిన వీఎల్‌వోలు

టంగుటూరు, జూలై 4 : రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మన్ టీబీ రమేష్‌బాబు నాయకత్వంలో పలువురు వీఎల్‌ఓలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీఎల్‌వో పోస్టులకు గజిట్ హోదా కల్పించేలా కృషి చేయాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జేవీవో, వీఎల్‌వో అసోసియేషన్ ప్రతినిధి టీవీ రమేష్ బాబు, కార్యదర్శి ఎం కోటేశ్వరరావు, కోశాధికారి బీ ప్రభావతి, అసోసియేట్ ప్రెసిడెంట్ కే రాజేశ్వరి, ఉపకార్యదర్శి ఏ ప్రభాకర్, రవిచంద్ర, కే శంకరరావు, సీహెచ్ స్వాతి, పీ భవాని, టీ చరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సామాజిక చైతన్యమూర్తి అల్లూరి

టంగుటూరు, జూలై 4 : సామాజిక చైతన్యమూర్తి అల్లూరి సీతారామరాజని అనంతవరం సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు కొనియాడారు. మండలంలోని అనంతవరంలో అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు విరివిగా పాల్గొన్నారు.

ఆ రెండు మున్సిపాలిటీలకు ట్యాంకర్లతో నీళ్లివ్వండి

- పొదిలి, మార్కాపురం మున్సిపల్ అధికారులకు రాష్ట్ర మంత్రుల ఆదేశం
- మున్సిపల్ అధికారులతో సమీక్ష
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మార్కాపురం, జూలై 4: ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులతో మార్కాపురం, పొదిలి పట్టణాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. రెండు పట్టణాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడి తీవ్రతపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మార్కాపురానికి పొంచి ఉన్న నీటి ముప్పు' కథనానికి స్పందించి స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి విషయాన్ని మంత్రి పొంగూరు నారాయణకు తెలిపారు. ప్రతి సంవత్సరం జూలై నెలలో సాగర్ ద్వారా తాగునీటి అవసరాలకు విడుదల చేస్తారని, కానీ ఈసారి ముందుగానే సమస్య తలెత్తినట్లు ఎమ్మెల్యే కందుల మంత్రికి వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి నారాయణ గురువారం సచివాలయం రెండో బ్లాకులోని తన ఛాంబర్‌లో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మార్కాపురం, పొదిలి మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాస్తవ పరిస్థితిని అధికారులు వివరించారు. రెండు మున్సిపాలిటీల్లో డీప్‌బోర్లు ఉన్నప్పటికీ ఆ నీరు తాగడానికి పనికిరాదని తెలిపారు. ఇతర అవసరాలకు మాత్రమే ఆ నీటిని వినియోగించాల్సి ఉందన్నారు. దీంతో మంత్రి నారాయణ తాగునీటికి ఎద్దడిని తీర్చేందుకు రెండు మున్సిపాలిటీల్లో అవసరమైనన్ని ట్యాంకర్లను వినియోగించాలని సూచించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు నాగార్జున సాగర్ ఇంజనీరింగ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సాగర్‌లో ప్రస్తుతం నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరుకున్నట్లు అధికారులు మంత్రి రామానాయుడుకు వివరించారు. తాగునీటి సరఫరాకు నీటిని వదిలేందుకు అవకాశాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలని మంత్రి సూచించారు. ఇప్పటివరకు తాగునీటి సరఫరాకు నీటిని విడుదల చేసిన వివరాలు పూర్తిస్థాయిలో అందించాలని ఆదేశించారు.


సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు రామానాయుడు, నారాయణలు

అవీ..ఇవీ..

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు

ఏవో బుజ్జిబాయ్

పెద్దారవీడు, జూలై 4: రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలకు సంబంధించి నిబంధనలు తప్పక పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో బుజ్జిబాయ్ హెచ్చరించారు. మండలంలోని కుంటలో డీడీఏ రామ్మోహన్‌తో కలిసి ఎరువులు, పురుగుమందుల దుకాణాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్ తనిఖీలలో పీసీలు లేనివిధంగా గుర్తించి రూ.73 వేల విలువైన విత్తనాల విక్రయాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా డీలర్లతో ఏవో బుజ్జిబాయ్ మాట్లాడుతూ అనుమతిలేని కంపెనీల విత్తనాలు, ఎరువులు విక్రయించినట్లయితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల్లో కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దుకాణాల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో

రాహుల్‌గాంధీ తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

- హిందువులను హింసావాదులుగా మాట్లాడారని విమర్శ
- డీటీకి బీజేపీ నాయకుల వినతి

పొదిలి, జూలై 4 :హిందువులను హింసావాదులుగా పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడటం సరికాదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హిందువులను హింసావాదులుగా చిత్రీకరించి చులకనగా చూడటం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర, లౌకికభావాలు కలిగిన పార్టీగా చెప్పుకుంటూ రాజకీయ ప్రయోజనాల కోసం సౌమ్యులు, శాంతి స్వభావులైన హిందువులను హిందువులను కించపరచడం తగదన్నారు. భారతీయ జనతా పార్టీ ఎప్పుడు ఏ కుల మతాల వారి మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడదన్నారు. రాహుల్‌గాంధీ వెంటనే తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, మునగాల కిరణ్, సాదు కోటేశ్వరరావు, మాతట్టి నాగేశ్వరరావు, దిబ్బారెడ్డి, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా రోశయ్య జయంతి

ఎర్రగొండపాలెం, జూలై 4 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య 91వ జయంతి వేడుకలు గురువారం ఆర్యవైశ్యనాయకులు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యులలో కొణిజేటి రోశయ్య ఆణిముత్యంలాంటి వారన్నారు. ఆర్యవైశ్యులలో మహానాయకుడని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు చీదెళ్ళ నాగేశ్వరరావు అన్నారు. ఏపీకి ముఖ్యమంత్రిగా తమిళనాడుకు గవర్నర్‌గా ఉత్తమ సేవలు అందించారని అన్నారు.ఈ కార్యక్రమంలో గోళ్ల సుబ్రహ్మణ్యం, కేవీ.నారాయణ, రామచంద్రయ్య, అప్పారావు, వెంకటయ్యగౌడ్, కొత్తమాసు కృష్ణయ్య, గోళ్ళ సుబ్బారావు, సుగ్రీవు మస్తాన్ రావు పాల్గొన్నారు.


రోశయ్యకు నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

సాయి సత్సంగం ఆధ్వర్యంలో విశేష పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 4: జవహర్ నగర్‌లోని షిరిడీ సాయి సత్సంఘ మందిర 29వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మందిర నిర్వాహకులు ఆర్.రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ.. సాయినాథుడు బోధించిన సేవామార్గం అనుసరణీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మందిరంలో పేదలకు అన్న సంతర్పణ నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, జూలై 4 : జిల్లా కలెక్టర్‌గా నియమితులైన తమీన్ అన్సారియా ఇటీవల బాధ్యతలు చేపట్టగా గురువారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.


పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

నష్టపరిహారం ఇప్పించండి

- సబ్ కలెక్టర్‌కు కాకర్ల డ్యాం నిర్వాసితుల వినతి

కంభం, జూలై 4 : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన కాకర్ల డ్యాం ముంపు గ్రామాలైన లక్ష్మీపురం, కృష్ణానగర్ గ్రామాల బాధితులకు పునరావాసం కల్పించి ఆదుకోవాలని ప్రజలు సబ్ కలెక్టర్ రాహుల్‌మీనాను కోరారు. ముంపు గ్రామ ప్రజలకు ఆర్అర్ ప్యాకేజీ అమలు చేసి పునరావాసం కల్పించాలి కోరారు. గ్రామస్థులు ఆయన్ను కలిసి వారి సమస్యలను వివరించారు. ముంపునకు గురవుతున్న 550 ఎకరాల అసైన్డ్ భూముల్లోని రైతులకు కూడా నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. దీంతో నష్టపరిహారం ఎంతమందికి ఇవ్వాలి తదితర వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి సబ్‌కలెక్టర్ తెలుసుకున్నారు అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసితుల సమస్యను సమగ్రంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బస్సును వెనుక నుంచి ఢీకొన్న కారు

- ముగ్గురికి స్వల్ప గాయాలు

త్రిపురాంతకం, జూలై 4: వేగంగా వస్తున్న కారు ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ముడివేముల మెట్ట సమీపంలో ఎన్‌హెచ్ 544డీపై గురువారం చోటుచేసుకొంది. విజయవాడ నుండి త్రిపురాంతకం వైపు వస్తున్న కారు ముందు వెళుతున్న బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో కారులోని డ్రైవరు సహా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే ట్రాఫిక్, అంబులెన్స్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో ధ్వంసమైన కారును రోడ్డుపై నుండి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.


ప్రమాదంలో ధ్వంసమైన కారు

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం

త్రిపురాంతకం, జూలై 4: మండలంలోని రాజుపాలెం లక్ష్మీవెంకటేశ్వర రైస్‌మిల్లుపై దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 137 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎర్రగొండపాలెం పట్టణానికి తరలించా రు. అక్రమంగా నిల్వ ఉంచిన గోడౌన్ యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడులలో డీటీలు జితేంద్ర, అనిల్, వీఆర్వో ఖాశింబాషా తదితరులు పాల్గొన్నారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ఘనంగా వంగవీటి రంగా జయంతి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 4: కాపు సంఘం ఆధ్వర్యంలో దివంగత వంగవీటి మోహన్‌రంగా జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్‌కట్ చేశారు. వంగవీటి రంగ ఆదర్శ నాయకుడని, ఆయన ఆశయాలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పొదిలి : వంగవీటి మోహనరంగా 77వ జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గుద్దేటివారి వీధి, 16వ వార్డులో కూటమి నాయకులు, రంగా అభిమానుల ఆధ్వర్యంలో చిత్రపటం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు విగ్నేశ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగా సేవలను కొనియాడారు. అనంతరం కేక్‌కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.


రంగా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

15లోపు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(విద్య), జూలై 4: జాతీయ స్థాయిలో 2024 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానం కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలను వెబ్‌సైట్ ద్వారా ఈనెల 15లోపు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత ప్రతిపాదనలు, దరఖాస్తు కాపీ రెండు సెట్లు డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

కిరోసిన్ పోసుకొని మైనర్ ఆత్మహత్య

గిద్దలూరు టౌన్, జూలై 4 : పెళ్లి సంబంధాలు చూస్తున్న క్రమంలో కుటుంబసభ్యుల మధ్య నెలకొన్న అభిప్రాయ బేధాల కారణంగా బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని కొంగలవీడు రోడ్డులో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని కొంగలవీడు ఓ మహిళ కూలిపనిచేసుకుంటూ తన కుమార్తె కుమారుడిని చదివించుకుంటూ ఉంటోంది. కొంతకాలం క్రితం ఆమె భర్త కూడా మృతిచెందాడు. దీంతో కుమార్తె, కుమారుడి బాధ్యత తల్లే చూస్తోంది. ఈ క్రమంలో తన కుమార్తె (15)కు పెళ్లిసంబంధాలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎవరిని చేసుకోవలనే విషయంలో ఇంట్లో బేధాభిప్రాయాలు వచ్చాయి. దీంతో దీంతో సదరు బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకొని ఆత్మహత్య చేసుకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకురాలి ఇంటిపైదాడి

- ఓ ఘర్షణ నేపథ్యంలో సమన్వయ పరిచినందుకే
- ముందుగా భర్త కిడ్నాప్, కుమారుడిని అప్పగించాలని డిమాండ్
- పదిమందితో వచ్చి అల్లరిమూకల దాడి

గిద్దలూరు టౌన్, జూలై 4 : టీడీపీ మహిళ నాయకురాలి ఇంటిపై, వారి కుటుంబ సభ్యులపై అల్లరిమూకలు బుధవారం దాడి చేసి ఇంటిలోని వస్తువులను ధ్వంసం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గిద్దలూరు పట్టణంలోని నల్లబండ బజారు ప్రాంతంలో నివసిస్తున్న టీడీపీ మహిళ నాయకురాలు బొంతా లక్ష్మీదేవికి కుమారుడు పవన్‌కుమార్ ఉన్నాడు. గత నెల 30న పట్టణంలోని ఓ బార్ వద్ద కామూరి రాముడు మరొకరికి మధ్య ఘర్షణ జరుగుతుండగా, పవన్ సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో రాముడు ఆయన అనుచరులు పవన్‌పై కక్ష పెంచుకొన్నారు. మరుసటి రోజు నుండి కావడి రాముడు, ఆయన నిత్యం టీడీపీ నాయకురాలు బొంతా లక్ష్మీదేవికి ఫోన్ చేసి నీ కుమారుడు అంతుచూస్తాం అంటూ నిత్యం బెదిరించేవారు. రెండు రోజులుగా కుమారుడిని అప్పచెప్పాలని ఆమెకు ఫోన్ చేశారు. పవన్‌కుమార్ కనిపించకపోవడంతో రాముడు ఆయన అనుచరులు రెండు రోజుల క్రితం బొంతా లక్ష్మీదేవి భర్త శ్రీనివాసులును బలవంతంగా తీసుకెళ్లి వాళ్ల ఆధీనంలో పెట్టుకున్నారు. పలువురు మధ్యవర్తులు సర్దిచెప్పి పవన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత మాట్లాడుకుందామని చెప్పి శ్రీనివాసులును తీసుకొచ్చారు. ఈ క్రమంలో పవన్ కోసం ఇంటికి వచ్చి రాముడు, ఆయన పదిమంది అనుచరులు దాడి చేశారు. ఇంటిలోని టీడీపీ మహిళ నాయకురాలు బొంతా లక్ష్మీదేవి భర్త శ్రీనివాసులును, కుమారుడు పవన్‌కుమార్, కోడలు చాముండేశ్వరిపై దాడి చేసి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై టీడీపీ నాయకురాలు లక్ష్మీదేవి, ఆమె కోడలు చాముండేశ్వరి గిద్దలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొన్న పోలీసులు కావడి రాముడు, ప్రభుదాస్, మరికొందరిపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న మరికొందరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ సోమయ్య తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే సహించం

విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం

పెద్ద దోర్నాల, జులై 4: విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే సహించేది లేదని విద్యార్థి సంఘాల నాయకులు తేల్చి చెప్పారు. నీట్ పరీక్షా పేపరు లీకేజిని ఖండిస్తూ విద్యార్థి సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో దోర్నాలలో గురువారం విద్యాసంస్థలను మూసివేయించారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ మండల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను మూసివేయించి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక నటరాజ్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం.రాజు మాట్లాడుతూ దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా నీట్ ప్రశ్నాపత్రం బయటకు రావడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. దీనిపై నేటికీ ప్రధానమంత్రి మోదీ స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర పభుత్వం స్పందించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కే.విజయ్, మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి గణేశ్‌రెడ్డి, పీడీఎస్‌యూ మండల కన్వీనర్ కోటేశ్వరరావు, నాయకులు జైపాల్, చిట్టిబాబు, తిరుపతయ్య, దేవా పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలో గురువారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మందా రాజులు మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను వ్యాపార వ్యవస్థగా మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి, దానిని రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. బాలికల ఉన్నత పాఠశాల నుంచి కంభం సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి మానవ హారం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.


బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలు

ఎర్రగొండపాలెం : నీట్ పరీక్షా పేపరు లీక్ అయ్యిందని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ప్రైవేటు విద్యాసంస్థలు మూసి వేసి యాజమాన్యాలు బంద్ పాటించాయి. ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూలు బయట నిరసన తెలిపి బంద్ సహకరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మందా రాజు పిలుపు మేరకు బంద్ పాటించారు.

ఉత్కంఠకు తెర

మార్కాపురం, జూలై 4: కిడ్నాప్‌కు గురైన మిర్చి వ్యాపారి వ్యవహారంపై ఇంచుమించు 30 గంటలపాటు నెలకొన్న ఉత్కంఠకు చివరకు తెరపడినట్లైంది. అపహరణకు గురైన వెంకటరెడ్డిని గురువారం రాత్రి 7.00 గంటల సమయంలో గొట్టిపడియ గ్రామ సమీపంలోని కొండపై రైతులు వదిలి వెళ్లిపోయారు. అక్కడకు వెళ్లిన పోలీసులు వాహనంలో వెంకటరెడ్డిని వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

ఉదయం నుంచి ముమ్మర గాలింపు

మండలంలోని బిరుదులనరవ గ్రామంలోని దానిమ్మ పొలం వద్దకు బుధవారం మధ్నాహ్న సమయంలో మిర్చి వ్యాపారి రాగి వెంకటరెడ్డి అత్తమామలతో కలిసి వెళ్లాడు. పొలం వద్ద ఉన్న విషయం తెలుసుకున్న గొట్టిపడియకు చెందిన బాధిత రైతులు అక్కడకు వెళ్లారు. తొలుత వెంకటరెడ్డి కారును ధ్వంసం చేశారు. అనంతరం మోటార్ సైకిళ్లపై వెంకటరెడ్డిని అక్కడ నుంచి సుమారు 8 మంది రైతులు అపహరించుకు పోయారు. సాయంత్రం సమయంలో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగినా రాత్రి సమయం కావడంతో వెతుకులాడేందుకు అవరోధం ఏర్పడింది. కొంత మంది సిబ్బందితో గొట్టిపడియ, బిరుదుల నరవ గ్రామ పరిసరాల్లో పోలీసు సిబ్బంది గాలించారు. కానీ ఎక్కడా ఆయన ఆచూకీ లభించలేదు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ సుమిత్ సునీల్ ప్రత్యేక దృష్టిపెట్టారు. ఉదయాన్నే అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావును ఏఆర్ సిబ్బందితో కలిపి మార్కాపురం పంపారు. అంతేకాక మార్కాపురంతో పాటు ఎర్రగొండ పాలెం, త్రిపురాంతకం, కంభం, గిద్దలూరు సీఐలను కూడా రంగంలోకి దింపారు. పలు బృందాలుగా ఏర్పడిన పోలీసు అధికారులు అన్ని కోణాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధానంగా వ్యాపారిని కిడ్నాప్‌కు చేసిన రైతుల బంధువుల ద్వారా ఒత్తిడిని తీవ్రం చేయడంతో వ్యాపారిని అపహరించిన రైతులు గురువారం రాత్రి 7.00 గంటల సమయంలో వెంకటరెడ్డిని గొట్టిపడియ కొండపైకి తీసుకెళ్లి ఒక రైతు ఫోన్ నుంచి పోలీసులకు ఫలానా చోట ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకుని పోలీసులు వెంకటరెడ్డిని మార్కాపురం తరలించారు.

రైతుల కోసం పోలీసుల గాలింపు

కిడ్నాప్ వ్యవహారంలో మండలంలోని గొట్టిపడియకు చెందిన 9మంది రైతులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. వారిలో ఒకరైన అనుబోలు గాలిరెడ్డి బుధవారం సాయంత్రమే వ్యాపారి వెంకటరెడ్డి పొలం వద్ద దొరికాడు. ఆయన వద్ద నుంచి సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అనబోలు శ్రీనివాసరెడ్డి, అనబోలు సుబ్బారెడ్డి, అనబోలు గోపాల్‌రెడ్డి, తుమ్మా చిన్న అల్లూరిరెడ్డి, నడికట్టు నారాయణరెడ్డి, తంగిరాల సత్యనారాయణరెడ్డి, తువ్వా రామలక్ష్మిరెడ్డి, మాలపాటి అల్లూరిరెడ్డిలు వ్యాపారి వెంకటరెడ్డిని అపహరించిన వారిలో ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం వారి ఫోన్లు ఎవరివీ పని చేయడం లేదు. గొట్టిపడియ గ్రామంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ రావు. దీంతో పోలీసులు గ్రామంలోనే ఉండి పరిసర పొలాల్లో వారి కోసం గాలిస్తున్నారు. కానీ వారంతా గ్రామానికి సమీపంలోకి అటవీ ప్రాంతంలోకి వెళ్లి ఉంటారనే కోణంలో పోలీసులు ఏఆర్ సిబ్బందితో వెతికిస్తున్నారు.


పోలీసు స్టేషన్ వద్ద కుటుంబ సభ్యులతో వెంకటరెడ్డి

దోమలను నిర్మూలిద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

గిద్దలూరు, జూలై 4 : దోమలను నిర్మూలిద్దాం, దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడువాపు లాంటి వ్యాధుల నుంచి రక్షణ పొందుదామంటూ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. జాతీయ కీటక జనిత రోగనియంత్రణ కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ వ్యాధి మాసోత్స వాలలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, వైద్యాధికారులు డాక్టర్ హరీష్, డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి, రాజుపార మెడికల్ కళాశాల కరస్పాండెంట్ రాజు, మలేరియా యూనిట్ అధికారులు రంగనాయకులు, వెంకటేశ్వర్లు, వైద్యశాఖ సూపర్‌వైజర్లు సుధారాణి, రాజేశ్వరి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

కంభం, జూలై 4 : ప్రస్తుతం గ్రామాల్లో డయేరియా, జ్వరాలు ప్రబలుతున్నందున శానిటేషన్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని కంభం ఎంపీడీవో మస్తాన్‌వలి, తురిమెళ్ల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నాయబ్‌రసూల్, మలేరియా అధికారి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో శానిటేషన్ కార్యక్రమాలైన మంచినీటి ట్యాంక్‌ల క్లీనింగ్, కాలువల క్లీనింగ్, జ్వరాలపై అవగాహన కల్పించారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ పంపిణీ

కొమరోలు, జూలై 4 : కొమరోలు మండలంలోని బాదినేనిపల్లి గ్రామానికి చెందిన సానెబోయిన లక్ష్మమ్మ అనే దివ్యాంగురాలికి అమ్మా ఫౌండేషన్ గురువారం ట్రైసైకిల్ పంపిణీ చేశారు. గురువారం ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తుముల సంజీవరెడ్డి మాట్లాడుతూ అమ్మా ఫౌండేషన్ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు పేదలకు, వృద్ధులకు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. వెంకటేశ్వర్లు ఇటు టీడీపీకి, అటూ సేవా కార్యక్రమాల ద్వార ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. అదేవిధంగా మండలంలోని పేదలకు ఇంకా మంచి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో అమ్మా ఫౌండేషన్ ద్వారా పదేళ్లగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సానెబోయిన లక్ష్మమ్మకు ట్రైసైకిల్ అవసరముందని తెలుసుకొని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆగిపోయిన ఆమె పింఛన్ కూడా పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు బిజ్జాల తిరుమలరెడ్డి, అమ్మా ఫౌండేషన్ సభ్యులు పందరబోయిన భూపాల్, పార్టీ సమన్వయకర్త డోన్ ఓబుల్‌రెడ్డి, గోడి ఓబుల్‌రెడ్డి, బోయిళ్ల బాలిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, లక్ష్మిరంగారెడ్డి, ఆంజనేయులు, బాదరయ్య, దివ్యాహెల్పింగ్ నిర్వాహకులు లొక్కు శరత్‌కుమార్‌లు పాల్గొన్నారు.


ట్రైసైకిల్‌తో దివ్యాంగురాలు

కంభం జాతీయ రహదారిపై కారు బీభత్సం

- రాంగ్‌రూట్‌లో రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన వైనం
- ద్విచక్ర వాహనదారుల్లో ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- కారులోని మహిళకు, చిన్నపిల్లలకు గాయాలు

కంభం, జూలై 4 : వేగంగా వెళుతున్న కారు రాంగ్‌రూటులో రావడమే కాకుండా అదుపుతప్పి రెండు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. మరో ద్విచక్రవాహనంపై ఉన్న ఒకరికి చెయ్యి విరిగింది. మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అనంతరం కారు చెట్టును ఢీకొట్టింది. కారు ముందు భాగం దెబ్బతింది. అయితే కారులోని బెలూన్లు తెరచుకోవడంతో మహిళ, ఇద్దరు పిల్లలు బయటపడ్డారు. గాయపడిన వీరిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గిద్దలూరుకు చెందిన మాజీ సైనికుడు వీరకుమార్ భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు, వీరజితేష్, విరాట్‌లు విజయవాడ నుంచి గిద్దలూరుకు వస్తున్నారు. మధ్యాహ్నం 12.30 సమయంలో జాతీయ రహదారి 544డీ నంబరుపై పాలిటెక్నిక్ కళాశాల వద్దకు వచ్చాడు. కారుపై నియంత్రణ కోల్పోయిన వీరకుమార్ రాంగ్‌రూట్‌లోకి వచ్చాడు. ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొట్టాడు. ముందున్న ద్విచక్రవాహనంపై సుబ్బారెడ్డి (45) ఉన్నాడు. వెనక ఉన్న ద్విచక్రవాహనంపై అహ్మద్‌గౌడ్, ఆయన తల్లి ఉన్నారు. కారు ముందుగా సుబ్బారెడ్డి వాహనాన్ని ఢీ కొట్టింది. అదేవేగంతో ద్విచక్ర వాహనాన్ని ఇడ్చుకుంటూ వెళ్లి రెండవ ద్విచక్ర వాహనంపై ఉన్న అహమ్మద్‌గౌడ్ వాహనాన్ని ఓ అంచున ఢీకొట్టింది. అనంతరం ఎదురుగా ఉన్న వేపచెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు వాహనంపై ఉన్న సుబ్బారెడ్డి కాలు తెగిపడింది. ఆయన దూరంగా పడి తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. వెనుక వాహనంలో అహమ్మద్‌గౌడ్‌కు స్వల్పగాయాలు కాగా, ఆయన తల్లికి చెయ్యి విరిగింది. కారు చెట్టును ఢీకొన్న క్రమంలో కారులోని బెల్స్ తెరుచుకున్నాయి. దీంతో కారులోని వారు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇద్దరు పిల్లలు పిల్లలు వీరజితేష్, విరాత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆయన భార్య రాజేశ్వరికి ఒక మోస్తారు గాయాలయ్యాయి. కాగా కారునడుపుతున్న వీరకుమార్‌కు గాయాలు కాలేదు.

స్పందించిన సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

అదేసమయంలో అటువైపు వెళుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా వెంటనే స్పందించి, పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తంగా చేశారు. క్షతగాత్రులను దగ్గరుండి అంబులెన్స్ ఎక్కించారు. కారు దిగి బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రాణాలతో బయటపడ్డ వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫాలో చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు.

ప్రమాదంలో మృతిచెందిన కందులాపురానికి చెందిన సోముల సుబ్బారెడ్డి (45) కంభం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నిస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌కు అన్నం తెచ్చేందుకు కందులాపురంలోని ఇంటికి వెళ్లి అన్నం తీసుకుని వస్తుండగా ప్రమాదం జరిగింది. సుబ్బారెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మరో ద్విచక్రవాహనంపై వస్తున్న గిద్దలూరుకు చెందిన అహమ్మద్ గౌస్ తన తల్లిని మార్కాపురం వైద్యశాలలో చూపించుకునేందుకు వెళుతున్నాడు. వారిని కూడా కారు ఢీకొట్టగా వారు కిందపడి స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కొంతసేపు జాతీయ రహదారి స్తంభించింది.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు



విద్యార్థినులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యకేంద్రం సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

దొనకొండ, జూలై 4: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులకు గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సీహెచ్‌వో కె.ఇన్నాసమ్మ సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.దోమల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం బాలికలతో ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనం అనంతరం బాలికలకు ఐరన్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఆోగ్యకేంద్రం సిబ్బంది, పాఠశాల బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, మండలంలోని ఇండ్లచెరువులో హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతిదేవి ఆధ్వర్యంలో అతిసారపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

దర్శి, జూలై 4: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ లక్ష్మి, లలిత్ సాగర్ దంపతులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడని కొనయాడారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో.. సీఎస్‌పురం(పామూరు), జూలై 4: బ్రిటీష్ పాలకుల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య అన్నారు. సీఎస్‌పురంలోని టీడీపీ కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌సీ మాలకొండయ్య, ఆర్‌కె వలి, రమేష్, బీజేపీ నాయకుడు ఇండ్ల వెంకటసత్యం పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

» కుటుంబసభ్యులకు ఆపార్టీ నాయకులు ఆర్థికసాయం



గురవయ్య కుటుంబసభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు శివకోటేశ్వరరావు, తదితరులు

దొనకొండ, జూలై 4: మండలంలోని చిన్నగుడిపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీరాభిమాని అయిన పొన్నెబోయిన చిన్నగురవయ్య(32) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, కొత్తం రఘునాథరెడ్డి, శృంగారపు నాగసుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు. నివాళులర్పించిన వారిలో మోడి వెంకటేశ్వర్లు, నిమ్మకాయల సుబ్బారెడ్డి, పొన్నెబోయిన నాగేశ్వరరావు, చిలకపాటి కృష్ణకుమార్, తదితరులు ఉన్నారు. మృతిచెందిన గురవయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దొనకొండ, జూలై 4: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పది గంటలకు ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల తోడ్పాటు అవసరం

సీఎస్‌పురం(పామూరు), జూలై 4: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల తోడ్పాటు ఎంతో అవసరమని ఎంఈవోలు, జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చింతపూడుకు చెందిన గంటిమడుగు శ్రీనివాస్ వర్మ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు అవసరమైన విద్యా కిట్లను పంపిణీ చేశారు. సి.నాగులారం, పెదరాజుపాలెం, కోమటిగుంట్ల ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్రాత పుస్తకాలు, పెన్నులు, పలకలను, హైస్కూల్ విద్యార్థులకు జామెంట్రి బాక్స్‌లు, పెన్నులు అందజేశారు.

కార్యక్రమంలో టీడీపీ నేతలు బి.వెంగయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, ఎస్‌సీ చినమాలకొండయ్య, పి.రవికుమార్, బొబ్బూరి రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, రియాజ్‌బాషా, వీరాంజనేయులు, షేక్ పాదుషా, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల బంద్

పామూరు, జూలై 4: నీట్ పరీక్షలను సక్రమంగా నిర్వహించి పేపర్ లీక్ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నేత కొమ్మలపాటి మాల్యాద్రి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా పామూరులో ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలను బంద్ చేశారు. కార్యక్రమంలో షేక్ అల్లాబక్ష్, శంకర్, నవీన్, నరేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో.. దొనకొండ, జూలై 4: నీట్ పేపరు లీకేజీని నిరసిస్తూ గురువారం పాఠ శాలలు బంద్ చేశారు. కొచ్చెర్లకోట, మల్లంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశా లలను అంబేద్కర్ యూత్ సభ్యులు బంద్ చేయించారు. కార్యక్రమంలో అంజయ్య, ప్రశాంత్, బ్రహ్మయ్య ప్రసన్నకుమార్, శ్రీను, బాలశౌరి, చెన్నయ్య, శివకృష్ణ, రామాంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని సెంటర్‌లో ఏర్పాటుచేయాలి



ప్రభుత్వాసుపత్రిలో ఓమూలలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహం

కనిగిరి, జూలై 4: ఎన్టీఆర్ విగ్రహాన్ని సెంటరులో ఏర్పాటుచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ అభిమానసంఘం నాయకులు యస్థాని బాషా(పులి), తాతపూడి ఐజాక్ పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని లాడేసాహెబ్ వీధి వద్ద ఉన్న బావి స్థలంలో ఏర్పాటుచేసేందుకు మున్సిపాల్టీలో తీర్మానం జరిగిందన్నారు. అయితే, అప్పటి పాలకులు విగ్రహాన్ని ప్రభుత్వాసుపత్రి లోపల వైపు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని అందరికి కనిపించేలా ఏర్పాటుచేయాలని కోరారు. మున్సిపాల్టీలో తీర్మానం చేసి లాడేసాహెబ్ వీధి మలుపు వద్ద ఉన్న పంచాయతీ బావి స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు తాళ్లూరు మండల సర్వసభ్య సమావేశం

తాళ్లూరు, జూలై 4: తాళ్లూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం పది గంటలకు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీవో కె.యుగకీర్తి తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్ని శాఖలఅధికారులు హాజరుకావాలని కోరారు.

సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరుకానున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి ఎస్.నరేంద్ర తెలిపారు.

కట్టుతప్పుతున్న దర్శి పోలీసులు

» అవినీతి అక్రమాలకు పాల్పడి సస్పెండైన ఇద్దరు అధికారులు

» వీఆర్‌కు మరో ఇరువురు

» పాత కేసుల్లో డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు

దర్శి, జూలై 4: దర్శి సబ్ డివిజన్ పరిధిలోని కొంతమంది పోలీసులు పట్టుతప్పుతున్నారు. నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మరికొంతమంది అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది పాత కేసుల్లో ఉన్న వ్యక్తులను పిలిచి డబ్బులు వసూల్లు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు అధికారుల తీరుపట్ల ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

ఇటీవల కాలంలో జరిగిన పలు సంఘటనలు పోలీసు అధికారులకు మచ్చ తెచ్చే విధంగా ఉన్నాయి. ఇరువురు అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయ్యారు. మరో ఇరువురు అధికారులు అవినీతి అక్ర మాల ఆరోపణలతో వీఆర్‌కు వెళ్లారు. కొంతమంది వైసీపీకి ఇప్పటికీ ఊడిగం చేస్తూ అభాసుపాలవుతున్నారు. ఇక్కడ జరుగుతున్న విషయాలు తీవ్ర చర్చనీయాంశమవుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆరు నెలల క్రితం దర్శిలో పనిచేసిన ఎస్సై రామకృష్ణ ఒక కేసులో వ్యక్తులను బెదిరించి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆ అధికారి అనేక కేసుల్లో అడ్డగోలుగా వ్యవహరించారు. బాధితులపై లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాళ్ళూరులో గతంలో పనిచేసిన ఎస్సై బొద్దికూరపాడులో ఒక కేసు విషయంతో మహిళను బెదిరించి రెండు లక్షలు ముడుపులు తీసుకోవటంతో ఉన్నతాధికారులు గుర్తించి వీఆర్‌కు పంపారు. ఆ అధికారి కూడా అడ్డగోలుగా వ్యవహరించినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. కురిచేడు మండలంలో పనిచేసిన ఒక పోలీసు అధికారి పేకాట రాయుళ్ళకు సన్నిహితంగా మెలుగుతూ వారి వద్ద ముడుపులు తీసుకుంటున్నారు. పేకాటను ఆయనే ప్రోత్సహిస్తున్నారు. ఆరోపణలు రావటంతో జిల్లా అధికారులు ఆయన్ను వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. తాజాగా ముండ్ల మూరు మండలంలో ఏఎస్సైగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు మద్యం సేవించి చిందులేస్తూ దొరికిపోయాడు. ముండ్లమూరు మండలం శంఖరాపురంలో ఇటీవల జరిగిన గొడవల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్కడ ఒక వర్గం వారితో పోలాల్లో ఆ ఏఎస్సై వెంకటేశ్వర్లు మద్యం సేవించి చిందులేస్తున్న వీడియో వైరల్ అయింది. ఈ విషయం గుర్తించిన ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. ఇంకా మరికిందరు అధికారులు పాతకేసుల్లో నిందితులను పిలిపించి బెదిరించి డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏలాగు తాము బదిలీ అవుతామనే ఉద్దేశంతో దీపం ఉండగానే చక్కబెట్టుకోవాలనే ఉద్దేశంతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో పనిచేస్తూ సస్పెండ్ అయిన ఎస్సై దర్శి మండలంలోని పొతకమూరుకు చెందిన బాధితుల నుండి ఒక పాతకేసులో రెండు లక్షలు తీసుకున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వకపోతే ఇబ్బంది పెడతా మని బెదిరించటంతో పేదలైన ఆ బాధితులు అప్పుతెచ్చి ఇచ్చారు. ఆ వ్యక్తులను మళ్లీ ఇప్పుడు పోలీసులు పిలుస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికీ తీరుమార్చుకోని కొందరు అధికారులు

అనేకమంది అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ చర్యలకు గురైనప్పటికీ ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది తీరు మార్చుకోలేదు. ఇప్పటికీ కొంతమంది వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో డివిజనల్ స్థాయి అధికారితో పాటు దాదాపు పోలీసులందరూ వైసీపీ కార్యకర్తల్లాగా పనిచేసిన విషయం తెలిసిందే. దాడులు చేసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలను వదిలేసి బాధితులైన టీడీపీ వర్గీయులపై అక్రమకేసులు బనాయించారు. కొంత మందిని బెదిరించే ప్రయత్నం చేశారు. దర్శి పట్టణానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు అక్కడ పొసగక ఎన్నికల ముందు టీడీపీలో చేరాడు. ఆ నాయకుడి పై పోలింగ్ సందర్భంగా అక్రమకేసు పెట్టి స్టేషన్‌కు పిలిపించి దుర్భాషలాడారు. ఎంత తీసుకొని పార్టీ మారావురా, రెచ్చిపోతున్నావని ఇరువురు పోలీసు అధికారులు బెదిరించినట్లుగా తెలిసింది. ఇళ్లుకూడా చాలా పెద్దది కట్టుకున్నావుగా ఎలా సంపాదించావు అని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే ఆ నాయకుడు బెదరకుండా అక్కడ తనకు గిట్టక టీడీపీలో చేరానని గట్టిగా సమాధానం ఇచ్చారు.

అదేవిధంగా సామంతపూడి గ్రామంకు చెందిన కొందరు టీడీపీ వర్గీయులను ఒక పాత కేసులో పిలిపించి ఒక అధికారి కులం పేరుతో దూషించినట్లు తెలిసింది. మీకు అంతపిచ్చి ఎందుకురా అని దుర్భాషలాడినట్లు సమాచారం. ఇక్కడి పోలీసు అధికారులు అడ్డగోలుగా వ్యవహరించిన తీరు రోజులు జరిగే కొద్ది ఒకొక్కటిగా బయటకు వస్తున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అడ్డగోలుగా వ్యవహరించిన అధికారుల తీరును బయటపెడుతున్నారు. వారిపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేసేందుకు సిద్దమవుతున్నారు.

బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు

అనేక విషయాల్లో అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులు ఇక్కడ ఉంటే ఇబ్బంది పడతామనే ఉద్దేశంతో బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల సందర్భంగా అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులు టీడీపీ వర్గీయులపై అక్రమకేసులు పెట్టి అధికారులు ఏదోరకంగా బయటపడాలని అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే వారిని ఎక్కడకు వెళ్లకుండా ఇక్కడే ఉంచి చేసిన తప్పులపై విచారణ జరిపించాలని టీడీపీ వర్గీయులు భావిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఆ తర్వాత కొంతమంది అధికారులు వ్యవహరించిన తీరును, వారు చేసిన తప్పులను పూర్తి సమాచారం సేకరించినట్లు తెలిసింది. వైసీపీకి ఊడిగం చేసిన అధికారులపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేసేందుకు టీడీపీ నాయకులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

అధ్వానంగా రహదారులు

» వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దర్శి, జూలై 4: గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో దర్శి ప్రాంతంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రోడ్లు అధ్వానంగా మారాయి. అనేక రోడ్లు కంకర లేచిపోయి గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస మరమతుల గురించి పట్టించుకో లేదు. పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్లకు నిధులు విడుదల చేయలేదు. పొతకమూరు నుంచి పాపిరెడ్డిపాలెం వెళ్లే రహదారి గుంతలమయమైంది. అనేకచోట్ల తారు, కంకర లేచిపోయి దారుణంగా మారాయి. వర్షాలు పడినప్పుడు పొతకమూరు చెరువు కింద రోడ్డుపై నీరు నిలబడి ప్రయాణాలకు ఇబ్బందిగా మారింది.



గుంతలమయమైన పొతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు

అలాగే, రాజంపల్లి-బొద్దికూరపాడు రోడ్డు అనేకచోట్ల గుంతలు పడ్డాయి. దర్శి-దొనకొండ రోడ్డులో మార్జిన్లు కోసుకుపోయాయి. చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా మారింది. దర్శి-పోతవరం రోడ్డు అనేకచోట్ల గుంతలు పడ్డాయి. దర్శి-పాదిలి రోడ్డులో కాటేరు వాగుపై నిర్మించిన చప్టా కాలం చెల్లిపోవటంతో పూర్తిగా దెబ్బతింది. ఆ వాగు పొంగినప్పుడు రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. అనేక సందర్భాల్లో వాహనచోధకులు కొట్టుకుపో యారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రోడ్లు అభివృద్ధి చేస్తారని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.



దర్శి-పాదిలి రోడ్డులో పూర్తిగా దెబ్బతిన్న చప్టా

2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అనేక రోడ్లను అభివృద్ధి చేశారు. గతంలో మెటల్‌రోడ్లుగా ఉన్న వాటిని తారురోడ్లుగా మార్చారు. అప్పుడు జరిగిన పనులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కనిగిరి అభివృద్ధికి సహకరించాలి



మంత్రి లోకేష్‌కు ప్రతిపాదనలు అందజేస్తున్న డాక్టర్ ఉగ్ర

» మంత్రులను కోరిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 4: కనిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకారాన్ని అందివ్వాలని కోరుతూ గురువారం రాజధానిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పలువురు మంత్రులను కోరారు. కనిగిరిలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కోసం వైద్యఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిశారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

కనిగిరి ప్రాంతానికి చెందిన యువత ఉద్యోగాలు లేక పరాయి ప్రాంతాల్లో వలస జీవనం గడుపుతున్నారని ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. చిన్న, చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారని, ఎక్కువ మంది తగిన ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి కనిగిరి అభివృద్ధికి తమ సహకారం తప్పక అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, మంత్రి అచ్చెనాయుడును కూడా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కలిశారు.

కాపుల సంక్షేమానికి రంగా ఎనలేని కృషి

కనిగిరి, జూలై 4: కాపుల సంక్షేమ సారథి వంగవీటి మోహనరంగా అని కాపుసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రామయ్య నాయుడు అన్నారు. వంగవీటిరంగా 77వ జయంతి సందర్భంగా గురు వారం పట్టణంలోని శ్రీదేవి నర్సింగ్‌హోంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రామయ్యనాయుడు మాట్లాడుతూ రంగా చిన్ననాటి నుంచి కాపుల సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. కాపులంతా ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు ముక్కమూరి మాలకొండయ్య, పుల్లయ్య, రావిళ్ళ కోటేశ్వరరావు, ముండ్లమూరి కొండలు, పసుపులేటి అరుణోదర్, నరసయ్య, కొట్టే ప్రసాద్, శ్రీకరం మాలకొండయ్య, ఎల్‌వీఆర్, చమిడిశెట్టి(బొట్టు) శ్రీను, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలో రంగా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కాపు సంఘం నేత డాక్టర్ రామయ్యనాయుడు, తదితరులు

వంగవీటి రంగాకు నివాళి

దర్శి, జూలై 4: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన యోధుడు వంగవీటి మోహన రంగా అని టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కొనియాడారు. దర్శిలో గురువారం నిర్వహించిన రంగా జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి రంగా యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎం.శోభారాణి, సంగా తిరుపతిరావు, దారం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో రంగా జయంతి సభలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

పామూరులో.. పామూరు, జూలై 4: స్వర్గీయ వంగవీటి మోహన రంగా ఆశయ సాధనకు కాపులంతా సంఘటితం కావాలని తెలుగు యువత మండల అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు పిలుపునిచ్చారు. రంగా 77వ జయంతిని కాపు సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక మమ్మిడాడీ సెంటర్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు.

కార్యక్రమంలో సంఘ నాయకులు పాలపర్తి వెంకటేశ్వర్లు, నీరుకట్టు హరిబాబు, వెంగళశెట్టి బాబురావు, ఉప్పలపాటి రామాంజనేయులు, ఊసా మధుసూదన రావు, బీవీ నారాయణ, గుత్తి మాధవ, సురేష్, మద్దిశెట్టి చంద్ర. పాల్గొన్నారు. ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్‌హోం విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు నీరుకట్టు నాయబ్‌రసూల్, నరసింహారావు, నీలవేణి ప్రసాద్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి కె.భరత్‌చంద్ర

కొత్త చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

కనిగిరి, జూలై 4: జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజలు అవగాహన కల్గి ఉండాలని న్యాయాధికారి కె.భరత్‌చంద్ర అన్నారు. గురువారం స్థానిక కోర్టు అవరణలోని బార్ అసోసియేషన్ హాలులో పోలీసులకు, న్యాయవాదులకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాధితుల హక్కుల పరిరక్షణలో సమర్థవంతంగా విచారణ నిర్వహణకు కొత్త చట్టాలు ఉపయోగపడతాయని తెలిపారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా సీతాలాంబ వార్షికోత్సవం



సీతాలాంబ ఆలయంలో పూజలు చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, జూలై 4: దర్శి పట్టణంలోని సందువారిపాలెంలో శ్రీసీతాలాంబ వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, సంగా తిరుపతిరావు, దారం సుబ్బారావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం

» రెండు నెలల్లో ఒకే రైతుకు చెందిన రెండు గేదెలు మృతి

పీసీపల్లి, జూలై 4: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో గేదెలు మృతిచెందుతున్నాయని తురకపల్లి వాసులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో ఒకే పశుపోషకుడికి చెందిన రెండు గేదెలు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. గ్రామంలో సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఆ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో బాపనపల్లి మాలకొండయ్య ఇల్లు ఉంది. ఆ ఇంటి వద్ద తన గేదెలను కట్టేసుకుంటాడు. మే 8న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లిన అతని గేదె విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ సరిగా లేనందువల్లనే గేదె మృతిచెందినట్లు గుర్తించిన విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్‌ను ఏర్పాటుచే శారు.

అయితే, గురువారం ఉదయం అదే రైతుకు చెందిన మరో గేదె దూడ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లగా, విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. రెండు నెలల వ్యవధిలో జీవనాధారమైన గేదెలు మృతిచెందడంతో బాధిత కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.




తెనాలి: గుర్రపుడెక్కతో నిండిన నల్ల కాల్వ

వరుణుడు కరుణిస్తున్నాడు.. వర్షాలు పడుతున్నాయి.. అడపాదడపా సాగునీరు విడుదలవుతుంది.. అయినా పంటలు చేతికిరావడంలేదు. రైతుల ఇంట సిరులు కురిపించాల్సిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. కాల్వల్లో సాగునీరు సక్రమంగా పారి పొలాలను తడిపితే ఈ దుస్థితి ఉండదు. కానీ పూడిక, జమ్ముతో పూడిపోయిన కాల్వల్లో సాగునీరు పారుదల కావడంలేదు. దీంతో సకాలంలో పంటలకు నీరందక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి కాల్వల బాగు కాదు కదా కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. పంటలు ఎండిపోతున్నాయి.. రక్షించండి మహాప్రభో అని అన్నదాతలు వేడుకున్నా పాలకులకు పట్టలేదు. గతంలో సాగునీటి సంఘాలు కాల్వల బాగుపై దృష్టి సారించేవి.. వాటిని కూడా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో సాగునీటి కాల్వలు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నేపథ్యంలో సాగునీటి కాల్వల బాగుపై పాలకులు దృష్టి పెట్టాలని రైతులు అభ్యర్థిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జలవనరులశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సచివాలయంలో ప్రత్యేకంగా సమీక్ష చేయనున్నారు. సాగర్, డెల్టా కాల్వల మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి

- పూడికతో నిండిన సాగునీటి కాల్వలు
- వైసీపీ పాలనలో పట్టించుకున్న దాఖలాలే లేవు
- కృష్ణా పశ్చిమ డెల్టాలో నామరూపాలు కోల్పోయిన ఆధునికీకరణ
- నేడు మంత్రి నిమ్మల సమీక్ష..
- డెల్టా, సాగర్ కాల్వలకు నిధులు కేటాయించేనా?

నరసరావుపేట


అధ్వానస్థితిలో చిలకలూరిపేట మేజర్ కాల్వ


బాపట్ల: పూడికతీతలు లేక వ్యర్థాలతో పేరుకుపోయిన రేపల్లె పరిధిలోని మెయిన్ కెనాల్

గుంటూరు, నరసరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పూడిక, జమ్ము, నాచులతో నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలోని కాల్వలు, పశ్చిమ డెల్టా పరిధి లోని సాగునీటి కాల్వలు నిండి పోయి ఉన్నాయి. మేజర్లు, మైనర్లు, సబ్‌మైనర్ కాల్వలు శిథిల స్థితికి చేరుకున్నాయి. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాల్వల్లో కంపచెట్లు పెద్దఎత్తున పెరిగాయి. జమ్ము, తూటు కాడ, రబ్బరు మొక్కలు కాల్వల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా ఉన్నాయి. ఐదేళ్లగా ప్రభుత్వం వాటి బాగుపై దృష్టి సారించ లేదు. మరమ్మతులకు నిధుల విడుదల చేయకుండా ప్రభుత్వం కాల్వలను గాలికొదిలేసింది. దీంతో సాగు నీటి కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎండిపోతున్న పంటలను కాపాడుకునేం దుకు రైతులు నానాకష్టాలు పడాల్సి వచ్చినా పాల కుల్లో చలనంలేదు. కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల్లో సాగునీరు ప్రవహించడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు కృష్ణా డెల్టా, సాగర్ కాల్వలపై సమీక్ష నిర్వహించనున్న దృష్ట్యా ఆయన తొలుత ఇక్కడ నెలకొన్న పరిస్థితుల పై స్పష్టమైన అవగాహన ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని సాగునీటి రంగ నిపుణులు సూచిస్తున్నారు. కాల్వల మరమ్మతులకు నిధుల మంజూరుపై మంత్రి నిర్ణయం తీసుకోనున్నారు.

దారుణంగా కృష్ణా పశ్చిమ డెల్టా..

గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో కృష్ణా పశ్చిమ డెల్టా కింద 5.70 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో డ్రెయినేజీ వ్యవస్థని కూడా పశ్చిమ డెల్టా కలిగివున్నది. అటు కాల్వలు, ఇటు డ్రెయినేజీ సక్రమంగా ఉంటేనే పంటలు సజావుగా పండుతాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కూడా వరదనీరు డ్రెయినేజీ కాల్వల ద్వారా బయటకు వెళ్లిపోయి నష్టం తగ్గుతుంది. టీడీపీ హయాంలో 2014-15లో రూ.116.16 కోట్లు, 2015-16లో రూ.63.40 కోట్లు, 2016-17లో రూ.40.31 కోట్లు, 2017-18లో రూ.119.84 కోట్లు, 2018-19లో రూ.106.65 కోట్లను డెల్టా ఆధునికీకరణ కోసం ఖర్చు చేసింది. అయితే ఆ తర్వాత పగ్గాలు చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కాల్వల నిర్వహణను గాలికొదిలేసింది. గత ఐదేళ్లలో ఏడాదికి సగటున రూ.9 కోట్ల వరకు కేవలం ఓ అండ్ ఎం పనులకు మాత్రమే నిధులు ఇచ్చింది. అయితే ఆయా పనులను ఇరిగేషన్ శాఖ సక్రమంగా చేయకుండా బిల్లులు డ్రా చేసుకున్నది. నేడు కృష్ణా పశ్చిమ డెల్టాలో ఏ కాల్వని చూసినా బావురుమనాల్సిన పరిస్థితి. కాల్వ గట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేయలేని పరిస్థితి. హెడ్ రెగ్యులేటర్లు, రెగ్యులేటర్లు మరమ్మతులకు గురై ఉన్నాయి. అక్కడక్కడ నిర్మించిన రిటైనింగ్ వాల్స్, సిమెంట్ కాంక్రీట్ లైనింగ్‌లు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం గత నెలలో అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 13.62 కోట్లు విలువ చేసే ఓ అండ్ ఎం పనులను మళ్లీ అధికారులు ప్రతిపాదించారు. తెనాలి డివిజన్‌లో 85 పనులకు రూ.4.98 కోట్లు, రేపల్లె డ్రైనేజీ డివిజన్‌లో 61 పనులను రూ.3.55 కోట్లు, చీరాల డివిజన్‌లో 37 పనులకు రూ.3.75 కోట్లు, గుంటూరు ఛానెల్‌కు సంబంధించి ఐదు పనులను రూ.1.31 కోట్లతో ప్రతిపాదించారు. అయితే ఇవి ఏ మేరకు కాల్వల్లో సాగునీటి ప్రవాహానికి ఉపయోగపడతాయనేది ప్రశ్నార్థకమే. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ వచ్చేసింది. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని కూడా కృష్ణా డెల్టాకు తరలింపు ప్రక్రియని టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. దీని దృష్ట్యా ఓ అండ్ ఎం పనులను వేగవంతంగా పూర్తి చేయించి రాబోయే ఐదేళ్లలో కాలువలకు శాశ్వత మరమ్మతులు చేయించడంపై దృష్టి పెట్టాలి.

ఆధునికీకరణ అస్తవ్యస్తం

“ కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల్లో ఏళ్లుగా సాగుతున్న ఆధునికీకరణ పనులు ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యం కారణంగా నామరూపాలు లేకుండా పోయాయి. మూడు జిల్లాలకు సంబంధించి కొమ్మమూరు కాల్వ ఆధునికీకరణని తూతూమంత్రంగా చేసి పనులు నిలిపేశారు. మరోవైపు ఈపీసీ పద్ధతిలో కాంట్రాక్టులు దక్కించుకున్న ఏజెన్సీలు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు, బిల్లులు డ్రా చేసుకుని పత్తా లేకుండా పోయాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం సీజన్‌లో కనీస పునరావాస మరమ్మతులు(ఓ అండ్ ఎం) మినహా మరెలాంటి పనులు చేపట్టలేదు. ఈ సంవత్సరం కూడా అవే పనులను ప్రతిపాదించారు. ఇవి ఇంజనీర్లకు జేబులు నింపడానికి పనికొస్తున్నాయి తప్ప కాల్వల్లో నీటి ప్రవాహానికి ఏమాత్రం మేలు చేకూర్చడం లేదు. ”

తక్షణావసరమైన పనుల గుర్తింపు

“ నాగార్జునసాగర్ కుడికాల్వల మరమ్మతులకు సంబంధించి ఇప్పటికే జలవనరులశాఖ 473 పనులను గుర్తించింది. రూ.22.54కోట్ల అంచనాతో ప్రతిపాదనలను మంత్రి నిమ్మల రామానాయుడికి అందజేసింది. తక్షణావసరమైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 473 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ.22.54 కోట్లుగా అంచనా వేశారు. కాల్వల్లో పూడిక తీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించారు. లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 153 పనులకు రూ.7.63కోట్లు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 133 పనులకు రూ.6.38కోట్లు, సత్తెనపల్లి పరిధిలో 107 పనులకు రూ.5.09కోట్లు, వినుకొండ పరిధిలో 24 పనులకు రూ.2.12 కోట్లు, లింగంగుంట్ల డివిజన్ పరిధిలో 56 పనులకు రూ.2.29 కోట్లుగా అధికారులు అంచనా వేశారు. ”





వైసీపీకి.. పేదల ఉసురు

- రాజధానిలో నిరుపేదల పింఛన్ కట్
- మూల్యాంకనం పేరుతో 4,422 మందికి తొలగింపు
- శ్వేతపత్రంలో గణాంకాల సహా వెల్లడించిన సీఆర్‌డీఏ
- అటు పింఛన్ అందక.. ఇటు పనులు లేక ఇబ్బందులు

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధానిగా వెలుగులీనాల్సిన అమరావతిని పాడుపెట్టిన వైసీపీ ప్రభుత్వం పేదలనూ వదల్లేదు. రాజధానికి రైతులు భూములు ఇవ్వడంతో కూలీలు వ్యవసాయ పనులు కోల్పోయారు. ఈ క్రమంలో రైతులకు కౌలుతో పాటు నిరుపేదలకు పింఛన్లను టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ అమరావతి రాజధాని పనులను ఆపేసిన విషయం తెలిసిందే అదేవిధంగా అమరావతి పరిధిలో భూమిలేని నిరుపేదలు అప్పటివరకు పొందుతున్న పింఛన్‌ని లాగి పారేసింది. దాంతో వారంతా అటు పనులు లేక ఇటు పింఛన్ అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పేరుకు పింఛన్ల సంఖ్య పెంచామని డప్పు కొట్టుకొన్న నాటి సీఎం జగన్ అమరావతిలో తొలగించిన 4,422 మంది పింఛన్ల గురించి ఏమి సమాధానం చెబుతారన్న ప్రశ్న తలెత్తుతున్నది. అమరావతి రాజధానిపై తాజాగా సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలో ఈ విషయాన్ని ఏపీసీఆర్‌డీఏ గణాంకాల సహా కళ్లకు కట్టింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధానిలో భూమిలేని పేదలు దాదాపుగా 21,643 మందికి పింఛన్ అందేది. వైసీపీ అధికారంలోకి రాగానే ఆరు అంచెల మూల్యాంకనాన్ని అమలు చేసింది. దీనిని గతంలో ఏ ప్రభుత్వం అమలు చేసిన దాఖలాలు లేవు. తెల్లరంగు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుని పింఛన్లకు ఎంపిక చేసేవారు. 2019-20లో 20706 మందికి రూ.61.79 కోట్ల పింఛన్ అందింది. 2020-21లో ఈ సంఖ్య 19532కి తగ్గించారు. దాంతో రూ.58.41 కోట్లు చెల్లించారు. 2021-22లో 19425 మందికి రూ.57.75 కోట్లు చెల్లించారు. 2022-23లో 19,118 మందికి రూ.53.73 కోట్లు చెల్లించారు. 2022లో సెప్టెంబరు, అక్టోబరు పింఛన్లు నేటికీ చెల్లించలేదు. 2023-24లో పింఛన్ల సంఖ్యలో భారీగా కోత పెట్టి 17391కి కుదించారు. వీరికి రూ.56.35 కోట్లు చెల్లించారు. 2024-25లో 17221 మందికి మే నెల వరకు పింఛన్ల చెల్లింపు జరిగింది. ఇందుకోసం రూ.17.23 కోట్లు చెల్లించారు. అమరావతి రాజధానిపై అక్కసు, ఆర్థికభారాన్ని తగ్గించుకునే లక్ష్యంతో అర్హులైన 4,422 మంది పేదలను పింఛన్‌కు దూరం చేసింది. కారు లేకపోయినా ఉన్నట్లుగా, ఆదాయపు పన్ను చెల్లించకపోయినా ఐటీ కట్ అవుతున్నట్లుగా చూపించారు. అలానే ఎవరెవరి పేరుతో ఉన్న భూములు, ఆస్తులు పేదల పేర్లతో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని కూడా సాకు చూపించి పింఛన్ కోత విధించారు. దాంతో ఆయా పేదలకు నోటి కాడ కూడు లాగేసినట్లైంది. ప్రస్తుతం టీడీపీ నేతృత్వ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా తమ పింఛన్లను పునరుద్ధరించాలని బాధితులు కోరుతున్నారు. కాగా వారిలో కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం




కొల్లూరులో విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

బాపట్ల, కొల్లూరు, జూలై 4: నీట్ లీకేజ్‌ని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. బంద్ విజయవంత మైనట్లు విద్యార్థి సంఘాలు నాయకులు ప్రకటించారు. కొన్ని ప్రైవేట్ విద్యా సం స్థలు స్వ చ్ఛందంగా మూసివేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల వద్దకు ఎస్ఎఫ్ఐ నాయకులు ర్యాలీగా వెళ్లి వాటిని మూయించారు. ఈ సందర్భంగా బాపట్లలో ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎస్.భాను తేజ మాట్లాడుతూ నీట్ లీకేజి వల్ల లక్షల మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలోని 61 వేల పాఠశాలల మూతతో విద్యా వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. యూనివర్సిటీల్లో అన్యాయాలను ప్రశ్నిస్తున్న విద్యార్థులపై పెడుతున్న అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయిలో విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అవినాష్, నితిన్, శివమణి, ఆనంద్, బాబి, ఆదిత్య పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొల్లూరు మండలంలోని అన్ని విద్యా సంస్థలను మూయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభిషేక్, విజయేంద్ర, చొప్పర కోటేశ్వర రావు, చైతన్య, జయశంకర్, రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌గా.. వెంకటమురళి

- జేసీ శ్రీధర్ నుంచి బాధ్యతల స్వీకరణ
- కలెక్టరేట్‌లో మేళతాళాలతో ఘన స్వాగతం
- ప్రభుత్వ లక్ష్యాలు.. ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని దిశానిర్దేశం

బాపట్ల, జూలై 4: బాపట్ల కలెక్టర్‌గా గురువారం జె.వెంకటమురళి ఇన్‌చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు వచ్చిన వెంకటమురళికి ఉద్యోగులు, అధికారులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ప్రభుత్వ లక్ష్యాలు.. ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని ఈ సందర్భంగా ఉద్యోగులకు నూతన కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఉద్యోగులంతా కలిసి పనిచేస్తే లక్ష్యాలు సాధించవచ్చన్నారు. సమయపాలన పాటిస్తూ జవాబుదారితనంతో ఉద్యోగులు పనిచేయాలన్నారు. జిల్లాను మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్ళడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలు కలిసి పనిచేయాలన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్‌లతో చర్చించామన్నారు. ప్రభుత్వ సంక్షేమఫలాలు ప్రజలందరికీ చేరువయ్యేలా చూడాలని తెలిపారు. అనంతరం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటమురళిని ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్వో సత్తిబాబుతో పాటు ఆర్డీవోలు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.


కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న జె.వెంకటమురళి

- నూతన కలెక్టర్‌పై ఎన్నో ఆశలు
- కలెక్టర్‌గా వెంకటమురళికి తొలి పోస్టింగ్

సమస్యలు.. సవాళ్లు

బాపట్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పూడికతీతలు లేక అధ్వానంగా మారిన సాగునీటి కాల్వలు, గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చీరాలలో టెక్స్‌టైల్ పార్కు, నిజాంపట్నం పోర్టు, అసైన్డ్ భూములు అన్యాక్రాంతం.. ఇలా పరిష్కరించాల్సిన ఎన్నో సమస్యలు జిల్లాలో ఉన్నాయి. ఈ సమస్యల సవాళ్ల మధ్య వెంకటమురళి గురువారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన జిల్లాగా బాపట్ల ఆవిర్భవించినా జిల్లాలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. జిల్లా స్థాయికి తగినట్లుగా ప్రభుత్వ స్థాయిలో వనరులు సమకూరలేదు. ఈ పరిస్థితుల్లో కలెక్టర్‌గా వెంకటమురళి తొలి పోస్టింగ్‌తో బాపట్లకు వచ్చారు. 2020లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వెంకటమురళి పనిచేశారు. ప్రస్తుత బాపట్ల జిల్లాలో భాగంగా ఉన్న పర్చూరు, చీరాల, అద్దంకి మీద ఆయనకు పూర్తి స్పష్టత ఉంది. ఇక మిగిలిందల్లా బాపట్ల, రేపల్లె, వేమూరులే కావడంతో త్వరగానే పాలన పట్టాలెక్కించడంతో పాటు సమస్యలను త్వరితగతిన పరిష్కారిస్తారనే ఆశాభావాన్ని జిల్లా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

● తీర ప్రాంతంలో పర్యాటకం అభివృద్ధికి అవకాశమున్నా ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో కట్టి వదిలేసిన టిడ్కో ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. మైనర్ బ్రిడ్జీలు కనీస మరమ్మతులకు నోచుకోక ప్రమాద ఘంటికలుగా మారాయి. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చీరాలలో టెక్స్‌టైల్ పార్కు, నిజాంపట్నం పోర్టు ఇలా ఎన్నో హామీలు అమలుకు నోచుకోక ఎదురుచూస్తున్నాయి. జిల్లాలో ఉన్న రోడ్లపై ఐదేళ్లుగా కనీసం తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదు. తక్షణమే వీటి బాగుమీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కాల్వల్లో గుర్రపుడెక్క, వ్యర్థాలు పేరుకుపోవడంతో నీరు సరిగా పారక చివరి ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ దృష్ట్యా వెంటనే కాల్వల బాగుపై దృష్టిపెట్టి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. కౌలుదారులకు సీసీఆర్‌సీ కార్డులతో పాటు, ఇంతవరకు బ్యాంకర్లు ఇంకా వార్షిక రుణ పద్దును ప్రకటించలేదు. వెంటనే దానిపై శ్రద్ధపెట్టాల్సిన అవసరం ఉంది. గడచిన ఐదేళ్లలో పారిశ్రామికంగా ఒక్కటంటే ఒక్క కంపెనీ జిల్లాకు వచ్చిన దాఖలాలే లేవు. జిల్లాలో దాదాపు 56 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉన్నా దీనిని ఉపయోగించుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తీరప్రాంతంలో పర్యాటకరంగం అభివృద్ధిపై శ్రద్ధపెడితే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలపై కొత్త కలెక్టర్ దృష్టిపెట్టి ప్రభుత్వానికి నివేదిస్తే జిల్లాకు మేలు జరుగుతుందనేది పలువురి అభిప్రాయం.

అసైన్డ్ భూములను దోచేశారు....

అసైన్డ్ చట్ట సవరణ ద్వారా పేదలకు భూయాజమాన్య హక్కు కల్పించే నెపంతో ఆ భూములను వైసీపీ నేతలు చెరబట్టారనే ఆరోపణలు అప్పట్లో టీడీపీ చేసింది. ఇదే కాకుండా లంక భూముల పట్టాల విషయంలో గోల్‌మాల్ జరిగిందనే విమర్శలున్నాయి. ఈ రికార్డులను పరిశీలించి అనర్హులకు ఎవరికైనా మేలు జరిగి ఉంటే వాటిని రద్దు చేయాల్సిన బాధ్యత కొత్త కలెక్టర్‌పై ఉంది. బాపట్ల, చీరాల పరిధిలో 80 శాతం అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనట్లు రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి.

రహదారులు.. రయ్‌రయ్

- కేంద్రమంత్రి గడ్కరీ హామీతో ముందడుగు
- వైసీపీ హయాంలో మూలనపడిన రోడ్లకు కదలిక

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగురోడ్డు, చినకాకాని - పొట్టిపాడు హైవే, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న చినకాకాని - గుండుగొలను రోడ్లకు సంబంధించి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ హామీ ఇచ్చారు. జిల్లా రూపురేఖలు మార్చే కీలక జాతీయ రహదారులవి. వాటిల్లో ఒకటి ఇప్పటికే చివరి దశలో ఉండగా మరో రెండు ప్లానింగ్‌లో ఉన్నాయి. డీపీఆర్‌లు కూడా సిద్ధమయ్యాయి. ఈ మూడు జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి అయితే పారిశ్రామికంగా జిల్లా గణనీయమైన అభివృద్ధిని సాధిస్తుంది. వైసీపీ హయాంలో మూలనపడిపోయిన ఈ ప్రాజెక్టుల గురించి గురువారం సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో వాటి ప్రాధాన్యాన్ని వివరించి మంజూరు చేయించారు. రాబోయే ఐదేళ్లలో ఈ మూడు ప్రాజెక్టులు పూర్తి అయితే అమరావతి రాజధాని అభివృద్ధి శరవేగంగా ముందుకు సాగుతుంది. చినకాకాని - గుండుగొలను(విజయవాడ వెస్టు బైపాసు) జాతీయ రహదారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అప్పటి యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో మంజూరైంది. అయితే పనులు గ్రౌండింగ్ చేయడానికి ఆలస్యమైంది. భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణం చేపట్టిన జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ వేగవంతంగా పూర్తి చేస్తున్నది. కృష్ణానదిపై భారీ వంతెనను నిర్మిస్తున్నది. అటు విజయవాడ, ఇటు గుంటూరు జిల్లాల వైపు రహదారి పనులను దాదాపుగా పూర్తి చేసింది. కొన్ని పెండింగ్ పనులపై దృష్టి సారించింది. మరోవైపు చినకాకాని - పొట్టిపాడు(విజయవాడ ఈస్టు బైపాసు రోడ్డు)కి సంబంధించి డీపీఆర్ మాత్రమే రూపుదిద్దుకొన్నది.

ఓఆర్ఆర్‌కి కేంద్రం సిద్ధం

అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌లో అవుటర్ రింగురోడ్డుని ప్రతిపాదించారు. దీనిని కూడా కేంద్ర ప్రభుత్వమే నిర్మించేందుకు తాజాగా సుముఖత వ్యక్తపరిచింది. దాదాపుగా 190 కిలోమీటర్ల పొడవునా ఈ అవుటర్ రింగు రోడ్డుని ఇటు గుంటూరు, అటు కృష్ణా జిల్లాల్లో నిర్మించేందుకు ఎలైన్‌మెంట్ చేశారు. ఈ రోడ్డు జిల్లాలో ముత్తాయపాలెం, సత్తెనపల్లి, మందపాడు, పొత్తూరు, నారాకోడూరు, మున్నంగి మీదగా కృష్ణా జిల్లాలో కంకిపాడు, పొట్టిపాడు, ఆగిరిపల్లి, గంగినేని, కంచికర్ల వరకు నిర్మిస్తారు. ఇందుకోసం కృష్ణానదిపై రెండు భారీ బ్రిడ్జీలను నిర్మించాల్సి ఉంది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.17,761 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా వేశారు.


మంత్రి గొట్టిపాటికి వినతిపత్రం ఇస్తున్న మెప్మా ఆర్‌పీలు, సభ్యులు

మహిళా మార్ట్ నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేయిస్తా

● మంత్రి రవికుమార్

అద్దంకి, జూలై 4 : మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న మహిళామార్ట్ నిధులు గోల్‌మాల్, దుర్వినియోగంపై విచారణ చేయిస్తానని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మెప్మా ఆర్‌పీలు, సభ్యులకు హామీ ఇచ్చారు. మహిళా మార్ట్ ఏర్పాటుకు సభ్యుల నుంచి పెట్టుబడి నిధి కింద సుమారు 11 లక్షల రూపాయలు వసూలు చేసి నిర్వహించడంతో పాటు సభ్యులతో బలవంతంగా ఎక్కువ ధరలకు సరుకులు కొనుగోలు చేయించారని ఫిర్యాదు చేశారు. అదే సమయంలో పెట్టుబడి నిధి నిధులు గోల్‌మాల్ చేయడంతో పాటు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని దీనికి బాధ్యులైన సీఎంఎం ఫణికుమారి, ఇతర సిబ్బందిపై పూర్తి స్థాయిలో విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని, సభ్యుల పెట్టుబడి వెంటనే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు మెప్మా ఆర్‌పీలు, సభ్యులు గురువారం అద్దంకి వచ్చిన మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన రవికుమార్ వెంటనే పూర్తిస్థాయిలో విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకునే విధంగా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

మంత్రి గొట్టిపాటి నివాళి

పట్టణంలోని కాకానిపాలెంలో కాంట్రాక్టర్ నాదెండ్ల రంగారావు ఇటీవల మృతి చెందగా గురువారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలంలోని నాగులపాడులో మంగమూరి సుబ్బారావు దశదిన కర్మ గురువారం జరగగా రవికుమార్ హాజరయ్యారు. టీడీపీ నేతలు కరి పరమేష్, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, వడ్డవల్లి పూర్ణచం ద్రరావు, దామా హనుమంతరావు, కొండమ్మ, కౌన్సిలర్‌లు కంపా రజనీ, అత్తులూరి రమేష్, గుంటూరు మాధవరావు, మాజీ సర్పంచ్ కరి శివానందబాబు, పెంట్యాల రామాంజనేయులు ఉన్నారు.


మృతిచెందిన దుప్పి

రోడ్డు ప్రమాదంలో దుప్పి మృతి

పంగులూరు, జూలై 4 : రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి చెందింది. ఈ ఘటన బుధవారం రాత్రి కశ్యాపురం శివారు ప్రాంతంలోని అద్దంకి రోడ్డు మార్గంలో చోటుచేసుకుంది. రేణంగివరం పోలీసులు జరిగిన సంఘటనను అటవీశాఖ అధికారులకు తెలియచేశారు. సమాచారం తెలుసుకున్న బీట్ ఆఫీసర్ రమేష్, అసిస్టెంట్ బీటాఫీసర్ శ్రీనివాసరావు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సమీపంలో దుప్పిని దహనం చేశారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ గతంలో భగవాన్‌రాజుపాలెం సమీపంలో రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు దుప్పిలు మృతి చెందాయన్నారు. వాహన చోదకులు రోడ్డుపై సంచరించే దుప్పులను గుర్తించి జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. జాతీయ రహదారికి దక్షిణం వైపు సుబాబుల్ తోటలు అధికంగా ఉండడంతో ఈ ప్రాంతంలో దుప్పులు సంచరిస్తున్నాయన్నారు. వీటికి తెలిసి ఎవరైనా హాని తలపెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శిక్షణాధికారి జాన్సన్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్‌ఐ కొండయ్య

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

● రూ.2,26,898 విలువైన సెల్‌ఫోన్‌లు స్వాధీనం

చీరాలటౌన్, జూలై 4 : రైళ్లల్లో సెల్‌ఫోన్‌లు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను చీరాల జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కొండయ్య తెలిపిన వివరాల ప్రకారం కడప జిల్లా ముద్దనూరు మండలం పెనికలపాడుకు చెందిన ఇల్లూరు హరినాథ్‌రెడ్డి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఖాళీగా ఉంటున్నాడు. ఉద్యోగం లేకపోవడంతో మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు బానిసగా మారాడు. ఈక్రమంలో రైళ్లల్లో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఇదిలావుండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 4వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో హరినాథ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా దొంగతనాలకు పాల్పడిన వివిధ కంపెనీలకు చెందిన 6 సెల్ ఫోన్‌లు అప్పగించాడు. వాటి విలువ సుమారు రూ.2,26,898 ఉంటుందని తెలిపారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి విత్తనాలపై రైతులకు అవగాహన

చెరుకూరు (పర్చూరు), జూలై 4 : ఏరువాక కేంద్రం, బాపట్ల శాస్త్రవేత్తల నేతృత్వంలో పర్చూరు మడల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని రైతులకు వరి విత్తనాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరువాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.మురళీధర్ నాయక్, డాక్టర్ జే.రాధాకృష్ణ, ఎం.ఉష పాల్గొన్నారు. అనంతరం చిరుసంచుల ప్రదర్శనలో భాగంగా బీపీటీ 3082, బీపీటీ 2782(భవతి), రకాలను ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు. బీపీటీలలో కొత్త రకాలైన వంగడాలు తెగుళ్లను తట్టుకొని 140-145 కాలపరిమితి కలిగిన రకాలని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు జి.నాగబాబు, రైతులు దాసరి రామకృష్ణ, సురేష్, పాలేటి రామరాజు పాల్గొన్నారు.

కొట్లాడుకున్న ఇద్దరిపై కేసు

ఇంకొల్లు, జూలై 4 : పాత కక్షలను మనసులో పెట్టుకొని తనను గుమ్మడి రామ్మోహనరావు, బత్తుల శ్రీనివాసరావు అనే ఇద్దరు వ్యక్తులు కొట్టి గాయపరిచారని బాధితుడు మురుకొండ శ్రీనివాసరావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మొహ్మద్ ముస్తాఫా తెలిపారు. ఇంకొల్లు పర్చూరు రోడ్డులోని శుభమస్తు ఫంక్షన్‌హాల్ ఎదుట రామ్మోహనరావు, బత్తుల శ్రీనివాసరావులు మా వ్యాపారాలపై పిటీషన్లు పెడతావా అని కొట్టి గాయపరిచారని దీంతో రక్తపు గాయాలైన మురకొండ శ్రీనివాసరావు చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చేరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుమ్మడి రామ్మోహనరావు, బత్తుల శ్రీనివాసరావుపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

పశ్చిమాన ప్రకాశమే!

నెరవేరనున్న ప్రజల చిరకాల స్వప్నం
వెలిగొండ, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై కదలిక
ప్రధాన హామీల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
పరిశీలన ప్రారంభించిన యంత్రాంగం
భూములు, భవనాల గుర్తింపునకు శ్రీకారం
పునరావాస గ్రామాల్లో మూడ్రోజుల క్రితం పర్యటించిన కలెక్టర్

జిల్లా ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రధాన హామీల అమలుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో జిల్లా అధికారులు కూడా అందుకు అవసరమైన కసరత్తు ప్రారంభించారు. నిర్దిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేలు కూడా ఆ విషయాలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. కొత్తగా జిల్లాకు వచ్చిన కలెక్టర్ ముందుగా వెలిగొండ టన్నెళ్ల ప్రాంతానికి వెళ్లకుండా కీలకమైన పునరావాస గ్రామాల్లో ప్రజలను కలవడం అందుకు దర్పణం పడుతోంది. అలాగే మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటైతే కావాల్సిన అవసరాలపై అధికారులు పరిశీలన చేపట్టారు. భూములు, భవనాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పరిణామాలతో పశ్చిమప్రాంత ప్రజలు మురిసిపోతున్నారు.


మార్కాపురం సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు (ఫైల్)

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లా ప్రజల చిరకాల స్వప్నం నెరవేరనుంది. ఆదిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పశ్చిమ ప్రాంతం ప్రకాశించేలా కార్యాచరణకు ఉపక్రమించింది. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ త్వరితగతిన పూర్తికి చర్యలు చేపట్టింది. గత ఏడాది అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు తన పుట్టిన రోజు వేడుకలను మార్కాపురంలో చేసుకున్నారు. తాము అధికారంలోకి వస్తే మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గిద్దలూరు నుంచి ఎర్రగొండపాలెం వరకూ జరిగిన ప్రతి సభలో ఈ విషయంతోపాటు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది తానేనని.. ప్రారంభించేది కూడా తానేనని పదేపదే ప్రకటించారు. మరోవైపు యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా కందుకూరు నియోజకవర్గంలో ప్రవేశించిన రోజే ఆ నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. అద్దంకి సభలో అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చుతామని ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 3వ తేదీన గిద్దలూరు వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ నిర్మాణం పూర్తి అంశాలపై స్పష్టమైన హామీ ఇచ్చారు. కాగా ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రధాన హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఆయా జిల్లాల వారీ ఆ ముగ్గురు నాయకులు ఇచ్చిన ప్రధాన హామీల అమలుపై దృష్టి సారించింది.

మార్కాపురంలో పరిశీలన ప్రారంభం

ఉమ్మడి జిల్లా విషయానికి వస్తే ఆ ముగ్గురు నేతలు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన వాటిలో మార్కాపురం జిల్లా ఏర్పాటు ఒకటి. తదనుగుణంగా యంత్రాంగంలో కదలిక ఆరంభమైంది. మార్కాపురం జిల్లా ఏర్పాటైతే మార్కాపురంతోపాటు గిద్దలూరు, ఎర్రగొండపాలెం, దర్శి కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు అందులో చేరతాయి. వీటిలో మూడు నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపొందడంతోపాటు రెండున్నర దశాబ్దాల తర్వాత ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూడా కైవసం చేసుకోవడంలో ఆప్రాంత ఓటర్లు కీలకపాత్ర పోషించారు. దీంతో స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా జిల్లా ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులను కలిసినప్పుడు గుర్తుచేస్తున్నారు. ఈనేపథ్యంలో మార్కాపురం జిల్లా ఏర్పాటుపై కసరత్తు ప్రారంభమైంది. సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఈవిషయంపై దృష్టి సారించినట్లు సమాచారం. ప్రభుత్వ భూముల గుర్తింపుతోపాటు, ప్రభుత్వ, అవకాశం ఉన్న ప్రైవేట్ సంస్థల భవనాల గుర్తింపునకు కూడా శ్రీకారం పలికారు. దీంతో ఆ ప్రాంత ప్రజల్లో కూడా ఆశావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంకోవైపు అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలపాలన్న డిమాండ్‌ను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్‌కు పదేపదే ఆప్రాంత ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఆయన కూడా ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, అనుమానాలు వద్దని ప్రజలకు చెప్తూనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు కూడా తన నియోజకవర్గం విషయాన్ని ఇప్పటికే మంత్రి లోకేష్‌కు గుర్తు చేశారు. తదనుగుణంగా అధికారులు కూడా ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఎలాంటి నిర్ణయం వస్తుందోనన్న ఆలోచనతో ముందస్తుగానే అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఆ దిశగానే కలెక్టర్

పర్యటన

జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తమీమ్ అన్సారియా ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగానే పర్యటన చేపట్టారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి టన్నెల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. పునరావాస గ్రామాల ప్రజలకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఖాళీ చేయించడమే ప్రధాన సమస్యగా ఉంది. కలెక్టర్ అన్సారియా కూడా తన తొలి పర్యటనలో భాగంగా టన్నెల్ ప్రాంతాన్ని సందర్శించకుండా పునరావాస గ్రామాలకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ప్రజల మనోభావాలు, అవసరాలను తెలుసుకున్నారు. పునరావాస గ్రామాలు ఖాళీ చేయించడంతోపాటు అవసరమైన కాలువల నిర్మాణానికి ఆమె ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం.

మొత్తం పరిస్థితిని సమీక్షించి స్పష్టమైన నివేదిక రూపొందించే పనిలో అన్సారియా ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటిని బట్టి చూస్తే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల మార్పులు, చేర్పులు, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి తొలి ప్రాధాన్యంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

● నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలపై నిరసన
● ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్


ఒంగోలులోని మునిసిపల్ హైస్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఒంగోలు (కలెక్టరేట్), జులై 4 : నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలను నిరశిస్తూ దేశవ్యాప్త పిలుపుమేరకు జిల్లాలో గురువారం విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నేతలు ఉదయం నుంచే పాఠశాలలను మూసివేయించారు. ఒంగోలులో జరిగిన బంద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పేపర్ లీకేజీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏను తక్షణమే రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు శ్యామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరించి పేదలకు అందకుండా చేస్తున్నదని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ మాట్లాడుతూ ఎన్‌టీఏ సంస్థ పరీక్ష నిర్వహించేందుకు అర్హత కోల్పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ ఏజెన్సీపై చర్యలు తీసుకోకపోగా సమర్థించుకోవడం దుర్మార్గంగా ఉందన్నారు. అనంతరం నగరంలోని పలు పాఠశాలలను మూసివేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇసుక విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్

నిల్వ కేంద్రాల్లో 8 నుంచి ప్రారంభం
సీనరేజీ టన్నుకు రూ.88
రవాణా చార్జీ అదనం



ఒంగోలు (క్రైం), జూలై 4 : ఇసుక కొత్త విధానం అమల్లోకి వచ్చే వరకూ నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుకను విక్రయించాలని నిర్ణయించింది. ఈనెల 8 నుంచి అమ్మకాలు ప్రారంభించనుంది. సీనరేజీ చార్జి టన్నుకు రూ.88గా నిర్ణయించింది. రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈమేరకు అధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లాలో గతనెల 21,22 తేదీలలో ఇసుక కేంద్రాలను గనులు, రెవెన్యూ, ఎస్ఈబీ అధికారులు పరిశీలించారు. మొత్తం 43,466.62 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు లెక్క తేల్చారు. జిల్లాలోని మొత్తం ఏడు నిల్వ కేంద్రాల్లో ప్రస్తుతం మూడుచోట్ల మాత్రమే ఇసుక ఉంది. ఒంగోలు మార్కెట్ యార్డులో 1,818 మెట్రిక్ టన్నులు, జరుగుమల్లి మండలం చతుకుపాడు-1లో 16,044, చతుకుపాడు-2లో 24,971.62 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. ప్రభుత్వం నూతన విధానం ప్రకటించే వరకూ ప్రజలు ఈ కేంద్రాల్లో ఇసుకను కొనుగోలు చేయవచ్చు.

ఒంగోలులో టన్ను ఇసుక రూ.435

ఇసుక అవసరమైన వారు సీనరేజీ చార్జీ కింద టన్నుకు రూ.88 చెల్లించాల్సి ఉంటుంది. దీనికి రవాణా చార్జీలు అదనం. ఒంగోలులో ఉన్న ఇసుక నెల్లూరు నుంచి రవాణా చేశారు. సీనరేజీతోపాటు లోడింగ్, రవాణా చార్జీల కింద రూ.347 కలిపి ఒంగోలులో ఉన్న ఇసుక కేంద్రం వద్ద టన్ను ధర రూ.435గా నిర్ణయించారు. జరుగుమల్లి మండలం చతుకుపాడులో సీనరేజీ కింద రూ.88, లోడింగ్, రవాణా చార్జీ కింద రూ.147 మొత్తం కలిపి రూ.235కు విక్రయించనున్నారు. అక్కడి నుంచి ఎవరి సొంత రవాణా చార్జీలతో వారు ఇసుకను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక నిల్వ కేంద్రాల వద్ద ఈనెల 8 నుంచి విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు జిల్లా మైనింగ్ అధికారి జగన్నాథరావు తెలిపారు.

నమ్మించి.. నట్టేట ముంచి!

20 గ్రామాల రైతులకు రూ.10 కోట్ల మేర టోకరా
మిర్చి వ్యాపారి వెంకటరెడ్డి ఘరానా మోసం
వైసీపీ అండదండలతో రైతులపైనే కేసులు
ఖాళీ ప్రామిసరీ నోట్‌లతో కోర్టుల్లోనూ దావాలు
కడుపు మండి కిడ్నాప్ చేసిన బాధితులు
గొట్టిపడియ కొండపై వదిలేసి వెళ్లిన వైనం

మార్కాపురం, జూలై 4 : ఆయన మిర్చి వ్యాపారి. మార్కాపురం మండలంలోని బిరుదులనరవ గ్రామానికి చెందిన ఆయన గుంటూరులో సుమారు 12 సంవత్సరాలపాటు వ్యాపారం చేశాడు. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల కంభం, అర్థవీడు మండలాలకు చెందిన రైతుల వద్ద మిర్చి కొనుగోలు చేయడం, అమ్మడం వారికి డబ్బులు చెల్లించడం అంతా బాగానే నడిచింది. అందరికీ తెలిసిన వాడు కావడం, నమ్మకస్తుడిగా నడుచుకోవడంతో రైతులు మిర్చి అమ్మిన తర్వాత వచ్చిన డబ్బులను కూడా ఆ వ్యాపారి వద్దే దాచుకొనే వాళ్లు. 2020 వరకూ ఆయనకు, రైతులకు మధ్య లావాదేవీలు సక్రమంగానే సాగాయి. ఆతర్వాత ఆ వ్యాపారికి దురాశ కలిగింది. రైతులు దాచుకున్న, మిర్చి అమ్మిన డబ్బులు తిరిగి ఇవ్వడం నిలిపివేశాడు. అడిగిన రైతులకు రకరకాల సాకులు చెప్పి మభ్యపెట్టాడు. రోజులు కాస్తా సంవత్సరాలు అవుతున్నా ఆయన డబ్బులు ఇవ్వకపోతుండటంతో బాధితులు నిలదీయడం ప్రారంభించారు. అంతేకాక రాజకీయ నాయకులనూ ఆశ్రయించారు. ఎక్కడా న్యాయం జరగకపోగా రైతులపైనే వ్యాపారి కేసులు పెట్టడం మొదలు పెట్టాడు. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆ ఆక్రోశంలో భాగంగానే తప్పించుకు తిరుగుతున్న రాగి వెంకటరెడ్డిని కిడ్నాప్ చేశారు.

సుమారు 20 గ్రామాల రైతులు బాధితులు

మిర్చి వ్యాపారి రాగి వెంకటరెడ్డి బాధితుల్లో సుమారు 20 గ్రామాల పైచిలుకు రైతులు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆయన స్వగ్రామానికి సమీపంలోని గొట్టిపడియ రైతులకే సుమారు రూ.2 కోట్ల మేర చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. వారిలో చాలామంది పేదలే. రూ.లక్ష నుంచి పది లక్షల వరకూ పోగొట్టుకున్నవాళ్లు ఉన్నారు. తిప్పాయిపాలెం, మాల్యవంతునిపాడు, మిట్టమీదిపల్లి, బొడిచెర్ల, బొందలపాడు, కొండేపల్లి, చింతకుంట, తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు, ఓబాయపల్లె, తర్లుపాడు గ్రామాలకు చెందిన రైతులకు ఎక్కువ మొత్తంలో డబ్బులు ఎగ్గొట్టాడు. దాదాపు ఐదు మండలాలకు చెందిన రైతులు వెంకటరెడ్డి చేతిలో మోసపోయారు. రమారమి రూ.10 కోట్లపైనే రైతులకు టోకరా వేసినట్లు తెలుస్తోంది.

పుష్కలంగా రాజకీయ అండదండలు

మిర్చి వ్యాపారి రాగి వెంకటరెడ్డికి వైసీపీ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఆయన బావమరిది ఇటీవల వరకూ మార్కాపురం ముఖ్యప్రజాప్రతినిధిగా పనిచేసిన నేతకు బంధువు. ఆ ప్రజాప్రతినిధికి ప్రధాన అనుచరుడు.. వెంకటరెడ్డి రైతుల నుంచి కొట్టేసిన డబ్బులను బావమరిది ద్వారా పలు వ్యాపారాల్లో పెట్టాడు. తర్లుపాడు రోడ్డులో ఆయన బావమరిది నిర్మించిన అపార్ట్‌మెంటులో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయాలు గమనించిన మార్కాపురం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన బాధిత రైతులు పలుమార్లు అప్పటి ముఖ్యప్రజాప్రతినిధి వద్ద పంచాయతీ పెట్టారు. తమను వెంకటరెడ్డి నమ్మించి నట్టేట ముంచాడని లబోదిబోమన్నా ఆ ప్రజాప్రతినిధికి మనసు కరగలేదు. కేవలం బంధుప్రీతికే ప్రాధాన్యం ఇచ్చి మీరుమీరు మాట్లాడుకోండని ఉచిత సలహా ఇచ్చాడు. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన అప్పటి ప్రజాప్రతినిధి సోదరుడు మిర్చి వ్యాపారి బావమరిది వద్ద నుంచి పెద్ద మొత్తంలోనే జేబులో వేసుకున్నట్లు రైతులు బాహాటంగానే విమర్శించారు. అప్పట్లో రైతులు కొందరు పోలీసులను ఆశ్రయించారు. ప్రజాప్రతినిధి జోక్యంతో పోలీసులు రైతులనే బెదిరించి పంపించేశారు. మిర్చి వ్యాపారి ఫిర్యాదు చేస్తే మిమ్మల్నే కేసుల్లో ఇరికించాల్సి ఉంటుందని పోలీసులు భయపెట్టడంతో రైతులు పోలీసుస్టేషన్ చుట్టుపక్కలకే వెళ్లడం మానుకున్నారు.

కోర్టుల్లో కేసులు వేసి ..

గుంటూరు మిర్చి యార్డులోని వ్యాపారులు చాలామంది సీజన్‌కు ముందు రైతులకు ఎంతో కొంత పెట్టుబడి కింద ఇస్తుంటారు. ఈ క్రమంలో రైతుల నుంచి ప్రామిసరీ నోట్లు తీసుకుంటారు. పండిన మిర్చిని రైతు ఆ వ్యాపారికి అమ్మిన తర్వాత ముందుగా తీసుకున్న అడ్వాన్స్ పోను మిగిలిన సైకం తీసుకుంటారు. వ్యాపారి వద్దవున్న ప్రామిసరీ నోట్‌ను చించేస్తారు. కానీ వ్యాపారి వెంకటరెడ్డి మాత్రం ఈ ప్రక్రియను అడ్డుపెట్టుకుని రైతులను మరోలా మోసం చేశాడు. తొలుత రైతులకు నమ్మకం ఏర్పడేందుకు అడిగిన వారికి అడిగినట్లు అడ్వాన్స్‌లు ఇచ్చాడు. ఆ సమయంలో వారి నుంచి ఖాళీ ప్రామిసరీ నోట్లు తీసుకున్నాడు. తెలిసిన వ్యక్తి కావడం. అడగక ముందే డబ్బులు ఇస్తుండటంతో రైతులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. అలా ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేసిన పదుల సంఖ్యలోని రైతులపై వెంకటరెడ్డి మార్కాపురం, పొదిలి కోర్టుల్లో కేసులు వేశాడు. ఆ నగదు తనకు జమ అయితే ఇబ్బందులు ఎదురవుతాయని సమీప బంధువుల పేర్లు రాసుకుని వారి ద్వారా కేసులు వేయించాడు. తీసుకున్నది కొంత మొత్తమైతే ప్రామిసరీ నోట్లపై పెద్ద మొత్తంలో నగదు ఇచ్చినట్లు నమోదు చేసుకుని వారిని రెండు విధాలా ముంచాడు. దీంతో కడుపు మండిన రైతులు బుధవారం బిరుదుల నరవలోని తన వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన వెంకటరెడ్డిని కిడ్నాప్ చేశారు.

కిడ్నాప్ కథ సుఖాంతం

మిర్చి వ్యాపారి వెంకటరెడ్డి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. సుమారు 30 గంటలపాటు నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రైతులు తీసుకెళ్లిన వెంకటరెడ్డిని గురువారం రాత్రి 7.00 గంటల సమయంలో గొట్టిపడియ గ్రామ సమీపంలోని కొండపై వదిలి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి వెళ్లిన పోలీసులు వెంకటరెడ్డిని వాహనంలో వైద్య పరీక్షల నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.


లక్ష్మీపురంలో సబ్‌కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న గ్రామస్థులు

నష్టపరిహారం ఇప్పించండి

● ముంపు గ్రామాల ప్రజల వినతి
● కాకర్ల డ్యాంను పరిశీలించిన సబ్‌కలెక్టర్

కంభం, జూలై 4 : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన కాకర్ల డ్యాం ముంపు గ్రామాలైన లక్ష్మీపురం, కృష్ణానగర్ గ్రామాల బాధితులకు పునరావాసం కల్పించి ఆదుకోవాలని ప్రజలు సబ్ కలెక్టర్ రాహుల్‌మీనాను కోరారు. అర్థవీడు మండలం కాకర్ల డ్యాం నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ముంపు గ్రామ ప్రజలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ, ఎంతమందికి పునరావాసం కల్పించాలి, నష్టపరిహారం ఎంతమందికి ఇవ్వాలి తదితర వివరాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయన్ను కలిసి వారి సమస్యలను వివరించారు. ముంపునకు గురవుతున్న 550 ఎకరాల అసైన్డ్ భూముల్లోని రైతులకు కూడా నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ గ్రామస్థులతో మాట్లాడుతూ తాను ప్రస్తుతం కాకర్ల డ్యాం, ముంపు గ్రామాలను పరిశీలించేందుకు వచ్చానన్నారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతల ఉన్నతే లక్ష్యం

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- ఎరువులు, విత్తనాలన్నీ అందుబాటులో ఉండాలి
- మిచౌంగ్ పరిహారం వెంటనే అందించాలి
- పర్చూరు మిర్చి యార్డును అందుబాటులోకి తెస్తా
- హైబ్రిడ్ కూరగాయల సాగుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- వ్యవసాయ అనుబంధ శాఖల సమీక్షలో ఎమ్మెల్యే ఏలూరి


వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూలై 4: అన్నదాతల ఉన్నతే లక్ష్యంగా పాలన సాగిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలైన అగ్రికల్చర్, అర్టికల్చర్, మార్కెటింగ్ శాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అన్నదాత అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికార యంత్రాంగం రైతుల పట్ల అప్రమత్తంగా ఉండి వారి అభ్యున్నతికి సహకరించాలన్నారు. విధి నిర్వహణలో అన్నదాతలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. వైసీపీ వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, రైతులు అవసరాలు ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆయా శాఖల్లో ఉన్న ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

వ్యవసాయశాఖ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ రైతులకు చేదోడుగా నిలవాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు నేపథ్యంలో రైతులకు అవసరమైన పిల్లిపెసర, జీలుగ వంటి విత్తనాలను అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో మైక్రో న్యూట్రిషన్ అందించి రైతు సంఘానికి అండగా నిలిచారన్నారు. రైతన్నలకు అవసరమైన యంత్ర పరికరాలు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎన్ పథకం కింద యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించలేదని వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధునిక సాగువైపు కదిలించాలి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఆధునిక సాగు వైపు రైతులు అడుగులు వేసేలా చైతన్యం చేయాలన్నారు. పండ్లు, హైబ్రిడ్ వెజిటేబుల్ సాగుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసి రైతులను ఆదిశగా మళ్లించాలని సూచించారు. రైతులకు అవసరమైన స్పేయర్‌లు, రొటేవేటర్లు అందించేందుకు కృషి చేయాలన్నారు. బెస్ట్ రైతు సంఘాలు, ఏపీలోఐదు బెస్ట్ ప్రదేశాలను గుర్తించి అక్కడకు రైతులను సందర్శనకు తీసుకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

మార్కెట్ యార్డ్ విస్తరణకు చర్యలు

నియోజకవర్గంలో మార్కెట్ యార్డ్‌లలో విస్తరణకు ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. రైతుల సౌలభ్యం కోసం మార్కెట్ యార్డులను విస్తరించాలని ప్రతిపానలు చేయాలని అధికారులను ఆదేశించటం జరిగిందన్నారు. పర్చూరు మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. పంట ఉత్పత్తులను నిల్వచేసేలా గోడౌన్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయాలన్నారు. పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాంలో గోడౌన్‌లను నిర్మాణం చేపడతామన్నారు. ఇంకొల్లు, పర్చూరులో పదివేల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ప్రతిపాదన చేయాలని అధికారులను ఆదేశించారు.


కలెక్టర్ మురళికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

కలెక్టర్‌ని కలిసిన ఎంపీడీవో

చినగంజాం, జూలై 4 : కలెక్టర్ జేవీ మురళిని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి గురువారం మర్యాద పూర్వకముగా కలిశారు. కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మురళికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నియమితులైన చామకూరి శ్రీధర్‌ని ఎంపీడీవో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల హాజరును పెంచాలి

మార్టూరు, జూలై 4 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో సీహెచ్.వస్రాంనాయక్ అన్నారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి సాయంత్రం వేళ అదనపు పని వేళలను కేటాయించి విద్యార్థుల్లో జ్ఞానం పెంచేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా స్కూళ్లలో చేతులు శుభ్రపరచడం, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, వేడిగా ఉండే భోజనాన్ని, మంచినీటిని అందించాలని ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు రమేష్, రామారావు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రి రవికుమార్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

మంత్రులకు ఆర్యవైశ్య నేతల శుభాకాంక్షలు

అద్దంకి, జూలై 4 : మంత్రులు గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్‌ను అద్దంకి పట్టణ ఆర్యవైశ్య నాయకులు గురువారం సచివాలయం వద్ద చాంబర్లలో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ ఆర్యవైశ్య నాయకుడు టీడీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిన్ని శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శింగరకొండ ఆర్యవైశ్య అన్నదానసత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు భోజనపల్లి సత్యనారాయణ, చుండూరి మురళీసుధాకరరావు, నాగసూరి రమేష్‌బాబు, సంకా సుబ్రహ్మణ్యం, కురిచేటి వెంకటసుబ్బారావు, ఆత్మకూరి మస్తానయ్య, జవ్వాజి ఏడుకొండలు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, నేరెళ్ల శేషగిరి, అర్వపల్లి హనుమంతరావు, మల్లికార్జునరావు, శ్రీరామ్ హరిబాబు, మాజేటి సత్యం, చామర్తి మల్లికార్జునరావు, రవికుమార్ పాల్గొన్నారు.

రోశయ్య చిరస్మరణీయుడు


రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కరణం

చీరాల, జూలై 4 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య చిరస్మరణీయులని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఎంజీసీ మార్కెట్ ప్రాంగణంలోని ఆయన కాంస్య విగ్రహానికి గురువారం పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోశయ్య అజాతశత్రువుగా మన్ననలు పొందిన వ్యక్తన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంజీసీ మార్కెట్ ప్రతినిధులు, రోశయ్య అభిమానులు, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

అద్దంకి : రోశయ్యకు ఆర్యవైశ్య నాయకులు నివాళులర్పించారు. పాత గాంధీబొమ్మ సెంటర్‌లో కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నాయకులు సోమిశెట్టి సుబ్బరాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కాకరపర్తి రమేష్, కూరపాటి రామకోటేశ్వరరావు, మామిడి రాంబాబు, పొట్టి శివ, చిన్ని ప్రసాద్ పాల్గొన్నారు.

నాగరాజుపల్లిలో పారిశుధ్య పనులు

మార్టూరు, జూలై 4 : మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో మూడు రోజుల నుంచి శానిటేషన్ కార్మికులు పారిశుధ్య పను లు చేస్తున్నారు.డెంగ్యూ నివారణ మాసోత్సవాలు, స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్యపనులు చురుగ్గా చేస్తున్నారు. బల్లికురవ రోడ్ నుంచి గ్రామంలోని జడ్పీ హైస్కూల్, సచివాలయం వరకు మురుగునీరు నిలబడకుండా కాలువలను శుభ్రం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల నిలిచి ఉన్న మురుగును ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నారు. జడ్పీ హైస్కూల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల బారిన విద్యార్థులు పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి మురళి తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పంగులూరు, జూలై 4 : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధులు దూరమవుతాయని ఆరోగ్య పర్యవేక్షకుడు మదరసా అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో గురువారం డయేరియాపై ఆరోగ్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మదరసా మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు రాకుండా సురక్షితమైన మంచినీటిని తాగాలన్నారు. కాచి చల్లార్చిన నీరు, వేడి పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బిందు, ఏఎన్ఎం మంగమ్మ పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

అద్దంకిటౌన్, జూలై 4 : చేతుల పరిశుభ్రతతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. చేతుల పరిశుభ్రత ద్వారా ఏఎన్ఎంలు అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఈ విద్య సంవత్సరంలో పాఠశాలకు సంబంధించి పలు అంశాలపై పలు సూచనలు చేయడం జరిగింది. కార్యక్రమంలో సీఆర్పీలు పుణ్యవతి, రామకృష్ణ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. తప్పిన ప్రమాదం

మార్టూరు, జూలై 4 : జాతీయ రహదారిపై గుంటూరు వైపు మండల పరిధిలో ఇసుకదర్శి సెంటరు సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొన్న సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. ఒంగోలు నుంచి విజయవాడలోని కాలేజీలో జాయిన్ చేసేందుకు దోమల రజనీకాంత్ అనే వ్యక్తి కుమార్తెతో కారులో వెళుతున్నారు. రోడ్డు ప్రక్కన మతిస్థిమితం లేని వ్యక్తి కారుపైకి రాళ్లు విసరగా ఈ రాయిని తప్పించుకోవడానికి ప్రయత్నించగా కారు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొడుతూ డివైడర్‌ను దాటి ఒంగోలు వైపు కారు నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ఒక వైపు టైరు దెబ్బతిన్నది. తండ్రీ కుమార్తెలు క్షేమంగా బయటపడ్డారు. అనంతరం వారి బంధువులకు సమాచారం ఇవ్వగా మరో కారు అక్కడకు రాగా వారు దానిలో వెళ్లిపోయారు. హైవే మొబైల్ వారు రోడ్డుపై ఉన్న కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు.

టోల్ గేట్ వద్ద స్తంభాన్ని ఢీకొన్న చేపల లారీ


లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

మార్టూరు, జూలై 4 : జాతీయ రహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలో బొల్లాపల్లి టోల్ గేట్‌లో ఇనుప స్తంభాన్ని చేపల లారీ ఢీకొన్న ఘటన గురువారం రాత్రి 9 గంటలకు జరిగింది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో డ్రైవింగ్ సీటులోనే డ్రైవర్ ఇరుక్కుపోయారు. లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవరు నున్న శివనాగరాజు పోలీసులకు తెలిపారు. అతనికి స్వల్పగాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు.. గుడివాడ నుంచి నెల్లూరుకు చేపల లోడుతో వెళుతున్న లారీ ఒంగోలు వైపు వెళ్లడానికి టోల్ గేట్‌లో 1 వనంబరు గేట్ లోపలకు ప్రవేశించింది. ఈ లారీ ముందు ఎక్స్‌కవేటర్‌ను తీసుకెళ్తున్న లారీ టోల్ గేట్ నుంచి బయటకు వెళుతున్న సమయంలో వెనుక నుంచి చేపల లారీ బ్రేకులు ఫెయిల్ అయి స్వల్పంగా ఎక్స్‌వేటర్ లారీ వెనుక వైపును ఢీకొట్టింది. దాంతో చేపల లారీని అదుపుచేయలేని డ్రైవరు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, లారీ క్యాబిన్‌లో డ్రైవరు ఇరుక్కు పోయారు. ఇలా కాకుండా లారీ టోల్ గేట్ నుంచి బయటకు వచ్చినట్లయితే అదే సమయంలో ఒంగోలు వైపు, బెంగళూరు వైపు వెళ్లడానికి ట్రావెల్స్ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులను లారీ ఢీకొనే ప్రమాదం ఉండేది. అయితే లారీ పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. దాంతో టోల్ గేట్ వద్ద ఉన్న సిబ్బంది, హైవే మొబైల్ వారు వెంటనే స్పందించి ఎక్స్‌కవేటర్ సాయంతో లారీని అక్కడ నుంచి తొలగించి డ్రైవింగ్ సీటులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. అతనికి స్వల్పగాయాలు కావడంతో వెంటనే అతనిని టోల్ గేట్‌కు చెందిన అంబులెన్సులో అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న నిర్మల

డిప్యూటీ డీఈవో సందర్శన

పంగులూరు, జూలై 4 : మండలంలోని కొండమూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం చీరాల డిప్యూటీ డీఈవో ఎం.నిర్మల సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరగతిగదిలో ఉపాధ్యాయుడు పాఠ్యాంశ బోధనతో పాటు సంసిద్ధతా కార్యక్రమాలపై దృష్టిసారించాలని సూచించారు. విద్యార్థులకు డిప్యూటీ డీఈవో నిర్మల పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, బెల్ట్, బ్యాగ్‌తో ఉన్న కిట్‌లను విద్యార్థులకు అందజేశారు. విద్యా కిట్లను సమగ్ర శిక్ష సీఈవో శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఎంఈవో నాగభూషణం, వీరాంజనేయులు హెచ్ఎం ఆదినారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ హరిబాబు, సీఆర్‌పీలు సురేష్, మోషే, శ్యామల పాల్గొన్నారు.

కొణికిలో నేత్రదానం

ఇంకొల్లు, జూలై 4 : మండలంలోని కొణికిలో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన శ్రీమతి నాగమణి మృతి చెందగా, ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన నాగమణి కుటుంబసభ్యులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, అధ్యక్ష కార్యదర్శులు డాక్టరు రఫీ, సాంబశివరావు, క్లబ్ సభ్యులు అభినందించారు.

6న సర్వసభ్య సమావేశం

ఇంకొల్లు, జూలై 4 : ఎంపీడీవో కార్యాలయంలో 6వ తేదీ శనివారం ఉదయం 10.30లకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి తరానికి స్ఫూర్తి అల్లూరి


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సుభద్ర

అద్దంకి, జూలై 4 : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలతోపాటు నందమూరి కళాపరిషత్ కార్యాలయంలో గురువారం అల్లూరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి, ఆర్ఐ శంకరరావు, ఏఎస్‌వో అమర్‌నాథ్, నందమూరి కళా పరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, అన్నమనేని వెంకట్రావు, పీసీహెచ్ కోటయ్య, ఎర్రమోతు రమేష్, కూరపాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

బల్లికురవ : బ్రిటీష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించిన అల్లూరి సీతారామరాజు సేవలను అందరూ గుర్తు చేసుకోవాలని తహసీల్దార్ సుభద్ర తెలిపారు. గురువారం కార్యాలయంలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఏఎస్‌వో అమరనాథ్, సిబ్బంది ప్రకాష్‌రావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పంగులూరు : అల్లూరి త్యాగధనుడని పలువురు కొనియాడారు. మండలంలోని చందలూరు గ్రామంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందుకూరి సుబ్బరాజు, అప్పలరాజు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పెంట్యాల కిష్టారావు, రామాంజనేయులు, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరాల : విప్లవ వీరుడు, మన్యం ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కమిషనర్ చక్రవర్తి తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

మార్టూరు : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం మండలంలోని రాజుగారిపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానసెంటరులో ఉన్న అల్లూరి విగ్రహానికి మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు, గ్రామస్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అల్లూరి పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. తీసుకువచ్చి ఆయన గొప్పతనాన్ని వీరోచిత పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. మాజీ ఉపసర్పంచ్ అచ్చిరాజు, కళ్లేపల్లి శ్రీనివాసరాజు, చి ంతలపూడి శ్రీనివాసరావు, కళ్లేపల్లి హనుమంతరాజు, ధనంజయ, కళ్లేపల్లి హరికృష్ణ, జగదీష్ అల్లూరికి నివాళులర్పించారు.

వంగవీటికి ఘనంగా నివాళులు



వంగవీటి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సంఘ నేతలు

చినగంజాం, జూలై 4 : మండలంలోని పలు గ్రామాల్లో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లోని జనసేన కార్యాలయంలో టీడీపీ కూటమి నాయకులు మోహనరంగా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తదనంతరం కేకు కట్ చేశారు. రంగా జయంతి సందర్భంగా స్థానిక చుండిబజారులోని వాల్మీకి వృద్ధాశ్రయంలోని వృద్ధులకు దుప్పట్లు, రిక్షా కార్మికులకు కండు వాలు పంపిణీ చేశారు. కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కడవకుదురు గ్రామంలో రంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పర్వతరెడ్డి సత్యనారాయణ, తుమ్మల పెంట సీతారామయ్య, టీ.జయరావు, శిఖరం వెంకటేశ్వర్లు, సందు శ్రీనివాసరావు, కట్టిబోయిన సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, సందు శ్రీరామ్, శిఖరం కోటయ్య పీ.పార్థసారిధి, గంటా చెన్నయ్య, పీ.లక్ష్మీనారాయణ, డీ.ఏసునారాయణ, ఎస్.రాంబాబు, కుర్రి వాసుదేవరావు, చిన్నా, జీవీ లక్ష్మీనారాయణ, ఎన్.గోపి, టి.వెంకటేశ్వర్లు, జి.వెంకటనారాయణ, ఎస్.సూరిబాబు, మహేష్, నారాయణ, రంగా అభిమానులు పాల్గొన్నారు.

పర్చూరు : వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు గురువారం కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వంగవీటి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాపుల ఐక్యత వర్ధిల్లాలి జిందాబాద్ జనసేన, పవన్ కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్ కుమార్ పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు నేతలు, జనసేన నాయకులు కఠారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి నరసింహం, కారంపూడి సందీప్‌తేజ, తులసి చంటి, మాధవరావు మాష్టర్, తులసి అప్పారావు, రంగిశెట్టి ఆంజనేయులు, తులసి శ్రీనివాసరావు, తంగెళ్ళ మల్లిఖార్జునరావు, రంగిశెట్టి రవికుమార్, రంగిశెట్టి ఆంజనేయులు, గోగుల శ్రీను, సాంబయ్య పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

అద్దంకిటౌన్, జూలై 4 : కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలపై చేస్తున్న దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రజా సంఘాల నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలను ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను తరగతుల నుంచి బయటకు పంపించడంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బాలికల ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో విద్యార్థి సంఘాలు ర్యాలీ నిర్వహించారు. విద్యా ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా అందరు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్ బాజీ, విద్యార్థులు వినిత్, శాలెంరాజ్, వెంకీ, సత్య పాల్గొన్నారు.


చీరాలటౌన్ : నీట్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన బంద్ విజయవంతం అయింది. కార్యక్రమంలో సంఘ నాయకులు ఠాగూర్, కార్యకర్తలు దినేష్, నవీన్, రాకేష్, పాల్, విష్ణువర్ధన్, కోటేశ్వరరావు, అనిల్, సూర్య పాల్గొన్నారు.

పంగులూరు : నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం బంద్ పాటించారు.

చినగంజాం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు బంద్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు కే.రవితేజ, వై.సురేష్ పాల్గొన్నారు.



బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు



సోమశిలలో నీటినిల్వ



అనంతసాగరం, జూలై 4: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారానికి డ్యాంలో 10.155 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 352 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఇదిగో పులి

'వెలుగొండ'లో మగ టైగర్ ● నల్లమల నుంచి వచ్చిందని నిర్ధారణ

- ఇప్పటికే ఆడపులి ఉన్నట్టు అటవీ శాఖ గుర్తింపు
- సీసీ కెమెరాల్లో చిక్కిన కదలికలు
- భారీగా చిరుతలూ ఉన్నట్టు గుర్తింపు
- 'టైగర్ కారిడార్'కు ముమ్మర ప్రయత్నాలు
- అటవీ పరిసర గ్రామస్థులను హెచ్చరిస్తున్నాం
- స్మగ్లర్ల ఆటకట్టించేందుకు నిరంతర నిఘా : డీఎఫ్‌వో



నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 4 : వెలుగొండ అటవీ ప్రాంతంలోకి మగ పెద్దపులి ప్రవేశించినట్లు జిల్లా అటవీ అధికారులు నిర్ధారించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతంలోని నల్లమల అడవి నుంచి ఈ పులి నెల్లూరు జిల్లా ఆత్మకూరు రేంజ్ పరిధిలోని వెలుగొండ అడవిలోకి ఇటీవల ప్రవేశించినట్లు గుర్తించారు. మర్రిపాడు తదితర ప్రాంతాల్లో మగ టైగర్ కదలికలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. జిల్లాలోని వెలుగొండ అటవీ ప్రాంతమైన ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు తదితర ప్రాంతాల్లో రెండేళ్లగా ఆడ పులి సంచరిస్తోంది. దీంతో నల్లమల అటవీ ప్రాంతం నుంచి మగ టైగర్ వెతుక్కుంటూ వచ్చినట్లు తెలుస్తోంది.



● టైగర్ జోన్ కోసం నివేదిక

జిల్లాలో పెద్ద పులులు ఉన్నట్లు నిర్ధారించుకున్న అటవీ శాఖ అధికారులు అప్రమత్తమైయ్యారు. వెలుగొండ అడవి పరిధిని టైగర్‌జోన్ కింద గుర్తించాలని ఇప్పటికే కేంద్రానికి నివేదికలు పంపించారు. అప్పటివరకు పెద్దపులుల నుంచి ఎవరికీ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టారు. ఇప్పటికే అనేక చోట్ల సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచారు. హెచ్చరిక బోర్డులనూ ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పులుల కదలికలను గుర్తించేలా అధికారులు చర్యలు చేపట్టారు. వెలుగొండ పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఒంటిరిగా పశువుల మేతకు అడవిలోకి వెళ్లొద్దని హెచ్చరించారు.

● జిల్లాలో పెరిగిన జంతుసంపద

పెద్దపులుల సంచారం ఉన్నచోట అన్ని రకాల జంతుసంపద పెరిగినట్టేనని అటవీ అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలోని ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు, వెంకటగిరి తదితర ప్రాంతాల్లోని అడవుల్లో భారీగా జంతుసంపదతోపాటు వన్యప్రాణులు పెరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో మగ టైగర్‌తోపాటు చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, పందులు, నెమళ్లు, దుప్పిలు, జింకలు ఇలా అనేక రకాల జంతువులు, వన్యప్రాణులు కదిలికలు చిక్కాయి.

● స్మగ్లర్ల ఆటకట్టించేలా..

జిల్లాలో రెండు పెద్దపులులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో అటవీ శాఖ అప్రమత్తమైంది. ప్రధానంగా స్మగ్లర్ల నుంచి వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అటవీ సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టారు. టైగర్ జోన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో జిల్లా అటవీ అధికారులు, సిబ్బంది అందుకు సంబంధించిన చర్యలు ఇప్పటికే ప్రారంభించారు. హెచ్చరిక బోర్డులు, అడవుల్లో ప్రత్యేక తాగునీటి తొట్టెల ఏర్పాటుతోపాటు స్మగ్లర్లు అడవిలోకి ప్రవేశించకుండా నిరంతర నిఘా ఉంచారు. జిల్లావాసులు, ముంబయి జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒంటిరిగా ఎవరూ అడవిలోకి వెళ్లొద్దని జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు.



మర్రిపాడు : నీటి మడుగు వద్ద సీసీ కెమెరాకు చిక్కిన పెద్ద పులి సంచారం

'కారు ప్రమాదంతో వెలుగులోకి..



మర్రిపాడు : గత నెల 17న పడమటినాయుడు పల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఓ కారుపై పెద్ద పులి దాడి చేసినట్లు డ్రైవర్ తెలపడంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఈ ప్రమాదానికి పులి కారణం కాదంటూనే.. ప్రమాదం జరిగిన పరిసరాల్లో మగ పులి అడుగులు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద స్థలంలో సేకరించిన వెంట్రుకలను శ్రీశైలంలోని ల్యాబ్‌కు పంపించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి నివేదికలు రాలేదు. అంతిమంగా అక్కడ పులి ఉన్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చి, పరిసర గ్రామాల ప్రజలను అప్ర మత్తం చేశారు. అలాగే అడవిలో మరుగైన ప్రాంతాలు, నీటి స్థావరాల వద్ద సుమారు 60 వరకు సీసీ కెమెరాలను అమర్చారు. ప్రతి వారం ఆ కెమెరాలను రీ సైక్లింగ్ చేస్తూ వీడియో క్లిప్పింగ్‌లను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఆడ పులి, మరో పెద్దపులి తిరుగుతున్నట్లు గత నెల 23వ తేదీన మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో వీడియో రికార్డు అయినట్లు మర్రిపాడు డీఆర్వో రవీంద్రవర్మ తెలిపారు. అయితే, కారు ప్రమాదానికి కారణం పలి అని చెప్పేందుకు తమ వద్ద ఆధారం లేదని అన్నారు.



వెలుగొండ అడవిలో సీసీ కెమెరాలకు చిక్కిన వన్యప్రాణుల కదలికలు







సీసీ కెమెరాలను అమరుస్తున్న అధికారులు, సిబ్బంది

నేత్రానందంగా రామలింగేశ్వరుడి కల్యాణం

● జన సందోహంగా రామతీర్థం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి



వేడుకలో పాల్గొన్న భక్తజనం

విడవలూరు : రామతీర్థంలో గురువారం రాత్రి శ్రీ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం కనుల పండుబగా జరిగింది. ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తులు తరలిరావడంతో పుణ్యక్షేత్రం జనసందోహంగా మారింది. ఉదయం ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం తిరుచా ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ నిర్వహించారు. ఆ తర్వాత శివపార్వతులను కల్యాణోత్సవానికి విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివాహ వేదికపై రామలింగేశ్వరుడు, కామక్షీదేవిలను కొలువు దీర్చారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కల్యాణోత్సవానికి శాశ్వత ఉభయకర్త పెన్నార్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ అధినేత ఓజిలి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఉత్సవర్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. పండితుల వేదమంత్రోచ్చరణలు పటిస్తుండగా, మంగళవాయిద్యాలు, భక్తుల శివనామస్మరణల నడుమ స్వామిఅమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి రామలింగేశ్వరుడు ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఏనుగు వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలో ఆలయ ఈవో రామకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆవుల వాసు, చెముకుల కృష్ణచైతన్య, తాతా రమేష్, శ్రీహరి కోట గోపి, కుడుముల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల శాఖ

ఏడీ గుండెపోటుతో మృతి

నెల్లూరు(హరనాథపురం), జూలై 4 : విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అక్బర్ అలీ గురువారం తన కార్యాలయంలో గుండెపోటుతో మృతి చెందారు. కార్యాలయంలో విధి నిర్వహణలో ఆయన గుండెపోటుకు గురై కుప్పకూలిపోయినట్టు తెలిసింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు.

ఇక చౌకగా ఇసుక!

- వైసీపీ హయాంలో కృత్రిమ కొరత, ఆపై ధర కూడా ఎక్కువే
- కునారిల్లిన నిర్మాణ రంగం, భవన కార్మికులు
- ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా టీడీపీ అడుగులు
- రవాణా, లోడింగ్ లేబర్ చార్జీలతో సరఫరా
- త్వరలో కొత్త పాలసీ విధివిధానాలు

ఇక పేదలకు ఇసుక చౌకగా లభ్యం కానుంది. కేవలం రవాణా, లోడింగ్ లేబర్ చార్జీలతో ఇసుక పేదల దరిచేరనుంది. దీంతో గత వైసీపీ ప్రభుత్వం ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించడంతో పక్కనే ఉన్న ఇసుక రేట్లు ఆకాశానంటాయి.. దీనివల్ల నిర్మాణ రంగంతోపాటు అనుబంధ రంగాలు కునారిల్లాయి. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక పస్తులు గడిపారు. అయితే, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో 2014లో మాదిరి త్వరలో ఉచిత ఇసుక పాలసీ తీసుకురానుండటంతో కునారిల్లిన నిర్మాణరంగంతోపాటు భవన నిర్మాణ కార్మికులు జవసత్వాలు పురుడుపోసుకోనున్నాయి.



పెన్నానదిలో ఇసుక లోడుతున్న యంత్రం (ఫైల్)

సంగం, జూలై 4 : వైసీపీ హయాంలో జిల్లాలో ఇసుక దందా కొనసాగింది. జేపీ వెంచర్‌ను తెరపైకి తెచ్చి ఇసుకను అక్రమంగా రవాణా చేసి వైసీపీ నాయకులు రూ.కోట్లు దండుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే కొంతకాలంపాటు ఇసుక తవ్వకాలు ఆపేసి కృత్రిమ కొరత సృష్టించారు. దీంతో నిర్మాణ రంగం కుదేలై పనుల్లేక కార్మికులు రోడ్డున పడ్డారు. దీని ప్రభావం సిమెంట్, స్టీల్, ఇటుక వంటి అనుబంధ రంగాలపైనా పడింది. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సంస్థకు ఇసుక కాంట్రాక్టు ఇచ్చారు. వీరు ఇసుకను తవ్వడంలో నిబంధనలను ఉల్లంఘించారు. పెన్నా, స్వర్ణముఖి వంటి నదుల్లో యంత్రాలతో తవ్వి భారీ వాహనాల్లో ఇసుకను తరలించారు. దీంతో నదులు, వాగులు రూపురేఖలు కోల్పోయాయి. జిల్లాలోని కొన్నిచోట్ల వైసీపీ నాయకులు రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ ఇసుకను అక్రమంగా తమిళనాడు, కర్ణాటకకు తరలించి, సొమ్ము చేసుకున్నారు.

● ట్రాక్టర్ ఇసుక రూ. 3,500 నుంచి రూ. 5వేలు

కృత్రిమ కొరత, అధిక ధరలతో ఇసుక దొరకడం కష్టమైంది. ట్రాక్టరు ఇసుక ధర రూ.3,500 నుంచి 5 వేలకు, టిప్పరు ఇసుక రూ. 8 నుంచి 30 వేలు పెట్టి కొనాల్సిన పరిస్థితి నెలకొంది. పక్క రాష్ట్రాలకు టిప్పర్ల ద్వారా తరలించే ఇసుక ధర రెండింతలైంది. దీంతో ఊరు పక్కనే ఇసుక ఉన్నా.. అంత ధర పెట్టి కొనలేక చాలా మంది ఇళ్ల నిర్మాణాన్ని ఆపేశారు. ఇలా పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల నెరవేరకుండా చేశారు.

● 2014లో రూ.వెయ్యికే..

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ హయాంలో ఉచిత ఇసుక పాలసీని అమలు చేసింది. దీంతో ట్రాక్టరు ఇసుక దూరాన్ని బట్టి రూ.1000 నుంచి 1500 ఉండేది. టిప్పరు రూ. 6 వేల నుంచి 8 వేలకు లభించేది. దీంతో ఇసుక అన్ని వర్గాలవారికి సరసమైన ధరలకు అందుబాటులోకి వచ్చింది. నిర్మాణ రంగం ఊపందుకుంది.

● ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా..

ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అధికారం చేపట్టిన ఎన్డీయే కూటమి ఇచ్చిన ఉచిత ఇసుక హామీ నెరవేర్చే దిశగా అడుగులు ప్రారంభించింది. ఈ నెల 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక పాలసీని తీసుకురానున్నట్లు ప్రభుత్వ పెద్దలు వెల్లడించారు. కేవలం రవాణా, లోడింగ్ లేబర్ చార్జీలు భరిస్తే సరిపోతుందని చెప్పడం జరిగింది. దీంతో ఇసుక కష్టాలు తీరుతాయని భవన నిర్మాణ కార్మికులు, సామాన్యులు భావిస్తున్నారు. ఇసుక చౌకగా, అందుబాటులోకి వస్తే ఇన్నాళ్లు కుదేలైన భవన నిర్మాణ రంగం ఊపందుకోనుంది.

● జిల్లాలో నాణ్యమైన ఇసుక

జిల్లాలో ఇటు పెన్నానదితోపాటు అటు స్వర్ణముఖి, వాగులు, వంకల్లో నాణ్యమైన ఇసుక అందుబాటులో ఉంది. అనంతసాగరం, ఆత్మకూరు, చేజర్ల, సంగం బుచ్చిరెడ్డిపాళెం, పొదలకూరు, నెల్లూరు రూరల్ మండలాల్లోని పెన్నానదిలో నాణ్యమైన ఇసుక అందుబాటులో ఉంది. అంతేగాక స్వర్ణముఖి నదితోపాటు వాగులు, వంకల్లో జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు అవసరమైన ఇసుక ఉంది. ఉచిత ఇసుక కొత్త పాలసీ కోసం సామాన్య ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఐదేళ్లుగా కునారిల్లిన నిర్మాణ రంగం మళ్లీ ఊపందుకుంటుందని భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

ప్రజలకు చేరువ చేయండి!

- అధికారులకు నూతన కలెక్టర్ ఆనంద్ ఆదేశం
- కలెక్టరేట్‌లో బాధ్యతల స్వీకరణ



నూతన కలెక్టర్ ఆనంద్‌కు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న జేసీ సేథుమాధవన్

నెల్లూరు (హరనాథపురం), జూలై 4 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలను దృష్టి పెట్టి ఆ ఫలాలు ప్రజలకు చేరువ అయ్యేలు విధులు నిర్వహించాలని జిల్లా నూతన కలెక్టర్ ఓ ఆనంద్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను వేదపండితులు ఆశీర్వదించగా, జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్, కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో ప్రత్యేకత చూపాలని ఆదేశించారు. తన సర్వీస్‌లో మొదటి పోస్టింగ్ సబ్ కలెక్టర్‌గా ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరులో పని చేశానని చెప్పారు. ఏడేళ్ల తర్వాత మళ్లీ నెల్లూరుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో తన వంతు కృషి చేస్తానని అన్నారు.

● 'అల్లూరి' ఆదర్శనీయం



అల్లూరు సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్, ఇతర అధికారులు

స్వాతంత్ర్యోద్యమంలో అశువులు బాసిన అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం అల్లూరు సీతారామరాజు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ జిల్లా పద్మనాభ మండలం పాండ్రంగి గ్రామంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య ఉద్యమంలో తన ప్రాణాలను పణంగా పెట్టి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీతోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

శకునాలపల్లిలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ఉదయగిరి రూరల్, జూలై 4: డయేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా శకునాలపల్లిలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి సూచన మేరకు గురువారం కార్యదర్శులు కరీముల్లా, తేజలు పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టారు. మురుగు ప్రాంతాల్లో నిల్వ నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. వీధుల్లో దెబ్బతిన్న వీధిదీపాలను తొలగించి నూతన కొత్తవాటిని ఏర్పాటు చేశారు.


పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

రోడ్లకి అడ్డంగా కేబుల్ వైర్లు

● పొంచి ఉన్న ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు

కావలి, జూలై 4 : పట్టణంలో రహదారుల వెంబడి వివిధ కంపెనీల కేబుల్ వైర్లు, డిష్ వైర్లు అడ్డదిడ్డంగా వదిలేసి ఉన్నారు. నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులకు రోడ్డు వెంబడి ఉన్న ఈ వైర్లతో ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వైర్లు తగిగి ఎంతో మంది కిందపడిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. మున్సిపాలిటీలో పనులు లేకుండా జీతాలు తీసుకునే అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఎంతోమంది ఉన్నారు. వారికి వైర్లు తప్పించే బాధ్యత అప్పగిస్తే ఓ గంటలో ఆ పని చేయవచ్చు. ప్రధానంగా ట్రంకురోడ్డు వెంబడి, ఆర్వోబీ వంతెనపై ఉదయగిరి రోడ్డు వెంబడి ఈ కేబుల్ వైర్లు గతంలో వీధిలైట్ల స్తంభాలకు కట్టి ఉండటంతో వాటికి పెయింట్ వేస్తూ స్తంభాలకు ఉన్న వైర్లను తొలగించారు. దీంతో అవి రోడ్ల వెంబడి వేలాడుతుండగా, కొందరు వాటిని కట్ చేశారు. దీంతో ఆ వైర్లు ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. వాటిని తగులుకుని ఎక్కడ ప్రమాదాలకు గురవుతామోనని ప్రజలు, వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కేబుల్ వైర్లు, డిష్ వైర్లను తొలగించాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.


ఆర్వోబీ వంతెన ఫుట్‌పాత్‌పై అడ్డదిడ్డంగా పడేసిన కేబుల్ వైర్లు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, జూలై 4 : మండలంలోని మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు వీఆర్‌కోట మన్నేరు వాగులో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం ఉదయం ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎస్టీలైతే విచారణకు ఎందుకు రాలేదు ?

బిట్రగుంట,జూలై 4: నిజంగా ఎస్టీ కులానికి చెందిన వారైతే బహిరంగ విచారణకు పీట్ల ధనమ్మ ఎందుకు రాలేదని ఏపీ ఎరుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ, మండల నేత భోగిరి యోహాను అధికారులను ప్రశ్నించారు. బోగోలు మండలం కప్పరాళ్ళ తిప్ప బౌడన్‌పేట చర్చి ఆవరణంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారిని పరిమళ గురువారం సాయంత్రం బహిరంగ విచారణ చేపట్టారు.తహసీల్దారు ఎస్.వెంకటరత్నం, ఆర్‌ఐ వాజీద్, వీఆర్వో హరిబాబులతోపాటు గ్రామ పెద్దలు ఆకుల డేవిడ్‌పాల్, ఆవుల నాగేశ్వరావు, గొడ్డేటి బాబు విచారణలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి పీట్ల ధనమ్మ హాజరు కాకపోవడంతో అధికారులు విచారణ వాయిదా వేసినట్లు తెలిపారు. మరోసారి ఆమెను పిలిచి విచారణ జరుపుతామని తహసీల్దార్ పేర్కొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి


సంగంలో అధికారుల నివాళి..

సంగం: రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు రమాదేవి అధికారులతో సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు

సీతారామపురం: స్థానిక మండల కార్యాలయంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. కార్యదర్శులు రామ్‌నాథ్‌రెడ్డి, జీవన్, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, జూనియర్ అసిస్టెంట్ రాజేష్, కిరణ్, బండి రవి పాల్గొన్నారు.


ఆత్మకూరులో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వాణిశ్రీ, అధ్యాపకులు

ఆత్మకూరు, జూలై 4: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వాణిశ్రీ గురువారం అల్లూరి సీతా రామరాజు జయంతి సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు.


ఉదయగిరిలో..


సీతారామపురంలో..

అనంతసాగరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం, చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్ మస్రూర్, హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో డాక్టర్ జీ.కృష్ణారెడ్డి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అనంతసాగరం: వేడుకల్లో పాల్గొన్న అధికారులు

అవినీతి రహిత పాలన అందిస్తా : ఎమ్మెల్యే కావ్య

కావలి, జూలై4: అవినీతి రహిత పాలన అందిస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. వంగవీటి మోహన్ రంగా 77వ జయంతిని పురస్కరించుకుని గురువారం రైతుబజారు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ముందుగా అక్కడ నిర్మిస్తున్న రంగా విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి వంగవీటి రంగా అన్నారు. ముందుగా రంగా విగ్రహ కమిటీ గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లును సత్కరించారు. ఈకార్యక్రమంలో కమిటీ బాధ్యులు, కాపునాయకులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.రంగా అభిమాని దేవరకొండ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అల్లూరు : దివంగత కాపు నేత వంగవీటి రంగా 77వ జయంతిని పురస్కరించుకొని గురువారం అల్లూరులోని బలిజపాలెంలో వేడుకలను నిర్వహించారు. పట్టణ కాపు యూత్ ఆధ్వర్యంలో రంగా చిత్రపటానికి పాలభిషేకాన్ని నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి అఖిలేష్, పీసాయి, ఎం.సాయి. ఆర్.చెన్నకేశవ, పీ రాము, కాపు యూత్ తదితరులు పాల్గొన్నారు.



రంగా జయంతి సందర్భంగా ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

ఊరూరా ఎమ్మెల్యే ఇంటూరి జన్మదిన వేడుకలు


గుడ్లూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


ఉలవపాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు


లింగసముద్రంలో కేక్ కట్ చేస్తున్న వేముల గోపాలరావు

కందుకూరు : ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. అనంతరం ఏరియా హాస్పటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. స్వర్ణస్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో కేకు కట్‌చేసి విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. వివిధ ఆలయాల వద్ద యాచకులకు భోజన ప్యాకెట్లు అందచేశారు. పలుచోట్ల బాణసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు. జనార్దన్‌కాలనీ, ఎర్రగుంటపాలెం ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ స్కూళ్లలో విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. 6వ వార్డులో స్థానిక నేతలు, కార్యకర్తలు కేకు కట్‌చేశారు. తలతోటి మస్తాన్ ఆధ్వర్యంలో ఏరియా హాస్పటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండలంలోని పాలూరులో వినోద్‌కుమార్‌రెడ్డి, హరికృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. విద్యార్థులకు ప్లేట్లు స్వీట్లు పంపిణీ చేశారు.

గుడ్లూరు : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను గురువారం గుడ్లూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ ట్రస్టు భవన్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జని గర్ల నాగరాజు, నాయకులు పువ్వాడి వేణు, మేకల మాల్యాద్రి, కావలి ఏసు దాస్, మద్దసాని కృష్ణ, ఉమ్మినేని సుబ్బారావు, చిత్తారి మల్లికారున తదిత రులు పాల్గొన్నారు.

ఉలవపాడు : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఉలవపాడులో గురువారం ఘనంగా జరిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలు జరిగాయి.

లింగసముద్రం : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. లింగసముద్రంలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అంబేడ్కర్‌నగర్‌లో గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాదరావు, టీడీపీ నాయకుడు సీహెచ్ బాలకోటయ్యలు కేక్ కట్ చేశారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, ఉపాధ్యక్షుడు అడపా నరసయ్య కేజీబీవీ హైస్కూల్‌లో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి చినపవని హెచ్‌పీ పాఠశాలలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కండే మాలకొండయ్య, ఏ చినసత్యం, జే శివప్రసాదు, జీ బాలనారాయణ, బింకం శేషయ్య, జే క్రిష్ణయ్య, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పెదపవనిలో గ్రామపార్టీ అధ్యక్షుడు గొర్రెపాటి సాంబయ్య కూడా వేడుకలు నిర్వహించారు.

అత్యవసర పనులకు రూ.43 లక్షలతో ప్రతిపాదనలు

ఉదయగిరి రూరల్, జూలై 4: ఉదయగిరి జలవనరుల శాఖ సబ్ డివిజన్ పరిధిలో గండిపాళెం జలాశయం, చెరువుల అత్యవసర పనుల కోసం రూ.43లక్షలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు గురువారం ఆ శాఖ డీఈ చంద్రమౌళి తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే గండిపాళెం జలాశయం కాలువల్లో పూడికతీత, చెరువుల మరమ్మతులు చేపడతామన్నారు. చెరువులోని మట్టి అవసరమైన వారు కార్యాలయాన్ని సంప్రదించి అనుమతులు తీసుకోవాలన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సంగం, జూలై 4: తలుపూరుపాడు ఖాదర్‌బాషాపై దాడికి పాల్పడిన బాదుల్లా అతని కుమారుడు హుసేన్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు తెలిపారు. చెరువులో అక్రమంగా గ్రావెల్ తరలింపును అడ్డుకున్నందుకు తనపై వారు దాడి చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బీసీజీ టీకా కార్యక్రమం పరిశీలన

సంగం, జూలై 4: వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెంలో జరుగుతున్న అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమాన్ని స్టేట్ మానిటరింగ్ అధికారి కె.దేవగణేష్, జిల్లా అదనపు వైద్యాధికారి, టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి పరిశీలించారు. వ్యాక్సిన్ క్యారియర్, కోల్డ్ స్టోరేజ్‌ని, అత్యవసర మందుల కిట్‌ను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు వ్యాక్సిన్ వేసినట్లు నమోదైన వారికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జలీల్ అహ్మద్, ఎస్టిఎస్ సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రత్యూష, హెచ్‌ఏ ప్రసాద్, ఏఎన్ఎం రాజమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి

సంగం, జూలై 4: మండలకేంద్రంలో గురువారం జనసేన నాయకులు వంగవీటి మోహన్‌రంగా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థికసాయం

ఉదయగిరి, జూలై 4: భారత సాయుధ దళాల మాజీ సైనికుల కుటుంబాల్లోని చిన్నారులకు గురువారం ఉదయగిరి దళితవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. అంతకుముందు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపల వేట నిషేధం

అనంతసాగరం, జూలై 4: స్థానిక చెరువు పైలెట్ ప్రాజెక్టు పరిధిలో ఉందని అందులో చేపల వేట నిషేధించినట్లు అనంతసాగరం మత్స్యశాఖ అధికారి శ్రీనివాసులు గురువారం తెలిపారు. వేటసాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సచివాలయం తనిఖీ

సీతారామపురం: సీతారామపురం బిట్-1 సచివాలయాలన్ని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రామ్‌నాథ్‌రెడ్డి, జీవన్, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర, ఇంజనీర్ అసిస్టెంట్ సుమతి పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కావలి రూరల్: స్థానిక బుడంగుంట గేటు వద్ద గురువారం రాత్రి రైలు ఢీకొని వాయిల పెంచలమ్మ(60) మృతి చెందింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీకి చెందిన పెంచలమ్మ రైల్వేగేటు వేసి ఉన్నా రైలును గమనించకుండా గేటు దాటు సమయంలో హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. మృతురాలి వద్ద లభించిన ఆధారాల మేరకు పెంచలమ్మగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ అరుణకుమారి కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

ఆత్మకూరు, జూలై 4: ఎన్డీఏ నిర్వహించిన నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీ, అక్రమాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఆత్మకూరులో చేపట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాఠశాలలు, కళాశాలల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చక్రి, అధ్యక్షుడు ఖాదర్‌బాష, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు అఖిల్, ఉపాధ్యక్షుడు యస్థానీ పాల్గొన్నారు.


ఆత్మకూరులో విద్యార్థి సంఘాల నాయకుల నిరసన

ఉదయగిరి: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

వింజమూరు, జూలై 4: మండలంలో గురువారం జలశక్తి అభియాన్ కేంద్ర బృందం నీటి సంరక్షణ పథకాన్ని పరిశీలించారు. బృంద సభ్యులైన సత్యేంద్రకుమార్, పట్నాయక్, లోకేష్, లక్ష్మీనారాయణలు మొదట మండల కార్యాలయంలో నీటి సంరక్షణ నిలువ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం చాపలకొండలో గ్రామ చెరువును పరిశీలించి కొన్ని సలహాలు సూచనలను అధికారులకు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం పనులను పరిశీలించారు. కాలువలు, చెరువులను శుభ్రప రచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసులు, ఎండీపీవో రాజేష్‌బాబు పాల్గొన్నారు.


నీటి సంరక్షణ నిలువ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వరికుంటపాడు: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రామాపురంలో చేపట్టిన పనులను కేంద్రబృందం సభ్యులు పరిశీలించారు. గ్రామంలోని రామరాజుకుంట వద్ద రూ.10,50,863 లక్షల వ్యయంతో చేపట్టిన పనులను సమగ్రంగా చేపట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీరు వృథా కాకుండా వడిసిపట్టడమే లక్ష్యంగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బృంద సభ్యులు లక్ష్మీనారాయణ, లోకేష్, డ్వామా పీడీ శ్రీనివాసులు, డ్వామా అసిస్టెంట్ ఏపీడీ విజయలక్ష్మి, ఏపీడీలు శంకర్‌నారాయణ, గాయత్రీదేవి, మృదుల, ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి, ఏపీవో అజమ్‌ఖాన్ పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం


అమ్మవారి ఆలయానికి ఊరేగింపు వస్తున్న మహిళలు

సంగం, జూలై 4: అనసూయనగర్‌లో గురువారం అర్ధరాత్రి పోలేరమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా పోలేరమ్మ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గజమాలలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఉదయగిరి: గన్నేపల్లిలో వెలసిన అడవిపేరంటాలమ్మకు భక్తులు నెల పొంగళ్లు సమర్పించారు. గన్నేపల్లి, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, మిట్టపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు మహిళలు కొత్త గంపల్లో పూజ సామగ్రిని పెట్టుకుని డబ్బు వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొన్నారు. అమ్మవారి సన్నిధిలో పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద రైతుల ఆందోళన

సీతారామపురం, జూలై 4: మండలకేంద్రంలోని చెక్‌పోస్ట్ నుండి ఉత్తరం వైపు ఉన్న ఎన్‌హెచ్ 167బి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని గురువారం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆధ్వర్యంలో గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తమ భూములు ఉన్నాయని, ఈ భూములకు మధ్యలో వాగు పోతుందని, నేషనల్ హైవే అధికారులు వాగునకు ఎదురుగా బ్రిడ్జి కట్టకుండా తమ పొలాల్లోకి నీరు పోయేలా బ్రిడ్జి నిర్మాణం చేప డుతున్నారని మండిపడ్డారు. వాగుకు ఒక కానాల్ మాత్రమే నిర్మిస్తున్నారని అందులో చెరువు అలుగునీరు, కుంటలోని నీరు పట్టక మా భూముల్లోకి వాన నీరు వచ్చి పొలాలు వ్యవ సాయానికి పనికిరాకుండా పోతాయని వాపోయారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేసేలా చూడాలని కోరారు.


ఎన్‌హెచ్ 167బీ బైపాస్ రోడు బ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సంగం ఐటీఐ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

సంగం, జూలై 4: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో కళాశాలలో డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆదేశాల మేరకు గురువారం ఉత్తీర్ణులైన ఐటీఐ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. సంగం, ఏఎస్‌పేట నుంచి వంద మంది హాజరవగా, వివిధ కంపెనీలకు 70మంది ఎంపికైయ్యారు. వారందరికీ ఆయా కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, కిసాన్ క్రాఫ్ట్, రామయ్యపట్నం, సీమెన్ గమేశా, హోండా మెటార్స్, బజాజ్ ఆటో మొబైల్స్ వంటి కంపెనీ ప్రతినిధులు, సంగం, ఏఎస్‌పేట, నెల్లూరు ఐటీఐ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, గౌస్‌భాషా పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : బీటీఏ

లింగసముద్రం, జూలై 4: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల ని బహుజన టీచర్స్ అసోషియేషన్ (బీటీఏ) గౌరవ అధ్యక్షుడు కల్లగుంట మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వీఆర్ కోట, పెదపవని కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్, పీఆర్సీ, ఏపీజీఎల్ఐ బకాయిలను చెల్లించాలని కోరారు.అలాగే మండలంలో నిలిచిపోయిన నాడు-నేడు ఫేజ్ 2 పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నాయకులు షేక్ అబ్దుల్లా, దార్ల కోటేశ్వరరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పీ మాధవరావు, పత్రె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఎన్వీ సుబ్బారావు ఆకస్మిక మృతి

కందుకూరు, జూలై 4: మండల టీడీపీ సీనియర్ నేత ఎన్వీ సుబ్బారావు (68) గురువారం ఆకస్మికంగా మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందిన ఆయన హైదరాబాద్‌లో తన కుమారుడు వద్ద ఉంటున్నారు. ఆరోగ్యం విషమించడంతో గురువారం వేకువజామున మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు సుబ్బారావు పార్థివదేహానికి నివాళులర్పించారు. మరో మాజీఎమ్మెల్యే దివి శివరాం సుబ్బారావు మృతిపట్ల కన్నీటిపర్యంతమయ్యారు..


ఎన్వీ సుబ్బారావు(ఫైల్

పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

కందుకూరు : డివిజన్ పెన్షనర్ల సంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడిగా రావులకొల్లు వెంకటేశ్వర్లు(ఆర్‌వీ), అధ్యక్షుడిగా చిమ్మిరి నరసింహం, కోశాధికారిగా పి. శ్రీనివాసరావు, కార్యదర్శులుగా ఎంఎస్ రాంబాబు, ఇంటూరి మాల్యాద్రి, వై. సత్యనారాయణ, పున్నయ్య, చెన్నయ్య, జీవీ కృష్ణారావు, ఉపాధ్యక్షు లుగా ఎం. భైరాగిశాస్త్రి, సామాను బ్రహ్మయ్య, ఏవీ నరసమ్మ, షేక్ మహబూబ్‌బాషా, నజీర్ అహ్మద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు విశ్వరూపాచారి, రాఘవరావు పాల్గొనగా, ఎన్నికల అధికారులుగా శంకరరెడ్డి, రాజయ్యలు వ్యవహరించారు.

'టీఆర్‌ఆర్'లో అల్లూరి జయంతి

కందుకూరు : స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డాక్టరు డీ. రామాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంపులో 'ప్రకాశం' క్యాడెట్ల ప్రతిభ

కందుకూరు : గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటిగ్రేషన్ క్యాంపులో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు కె. ఆంజనేయులు, ఏ. రమేష్‌లు విశేష ప్రతిభచూపి గుంటూరు గ్రూపు ట్రోఫీని కైవసం చేసుకోవటంలో క్రియాశీలపాత్ర పోషించారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మరో క్యాడెట్ కె. నరేంద్ర అనంతపురంలో జరిగిన క్యాంపునకు ఎంపికయ్యాడని తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని పలువురు అభినందించారు.

రేపు ఎడ్యుకేషన్ ఫెయిర్

కందుకూరు : ఇంజనీరింగ్, మెడిసిన్, ఎంసీఏ, ఎంబీఏ, హోటల్ మేనేజ్‌మెంట్, ఓవర్సీస్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు అవగాహన కోసం గ్లోబల్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఒంగోలులోని ఏ1 కన్వెన్షన్ హాలులో బ్రిలియంట్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జమీల్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరైన విద్యార్థులలో ఇద్దరికి లక్కీ డ్రా ద్వారా ల్యాప్‌టాప్‌లు బహూకరిస్తామన్నారు.

వీవీ పాలెంలో ఇంటూరి పుట్టినరోజు వేడుకలు

వలేటివారిపాలెం : స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బర్త్‌డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ నేత మాదాల లక్ష్మీనరసింహం కేక్ కట్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం, గొర్రెపాటి మాధవరావు, ప్రగడ మోహన్‌కుమార్, గుత్తా కొండయ్య, మార్తీల సుబ్బారెడ్డి, వీరమోసు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి


మాజీ సీఎం రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యనేతలు

కావలి,జూలై4: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా గురువారం ఆర్యవైశ్యనేతలు కావలిలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడు తటవర్తి రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కావలి మహిళా విభాగం నేతలు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలి

కావలి, జూలై4: బడుగువర్గాల బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి తెలిపారు. గురువారం ఆయన ఆర్డీవో శీనానాయక్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగువర్గాల బాలికలకు సంక్షేమ హాస్టళ్లలో సీట్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీట్ల కోసం బాలికలు హాస్టళ్ల చుట్టూ తిరుగుతుంటే అధికారులు పట్టించుకోక పోవటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా హజరత్తయ్య, శ్రీనివాసులు, జరుగు మల్లి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క

జలదంకి : ప్రధాని మోదీ పిలుపుతో జలదంకిలో గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా బీజేవైఎం రాష్ట్ర సోషల్‌మీడియా కో-కన్వీనర్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముడి కిషోర్‌రెడ్డి, కమతం బాలకోటయ్య యాదవ్, ఆతిన చైతన్యయాదవ్, శనివరపు ప్రవీణ్‌కుమార్, భీమవరపు మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాల కుటుంబానికి అండగా ఉంటా..

బిట్రగుంట : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవరాల చిన్నకొండయ్య కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు యాదవపాలెంలోని చిన్నకొండయ్య ఇంటికి గురువారం ఆయన వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి సోదరుడు తిరుపతితో మాట్లాడారు. ఆయన వెంట నాయకులు వీరరఘు, మస్తాన్‌బాషా, ఉపసర్పంచు జనార్దన్‌రెడ్డి, తుమ్మల రమణయ్య, మల్లారెడ్డి, ఎంపీటీసీ సుందర్‌రాజ్ తదితరులు ఉన్నారు.